www.andhrajyothy.com
ANDHRAJYOTHI
గురువారం | 24-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 189
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 1.59 తదుపరి నవమి; నక్షత్రం: పునర్వసు ఉ. 6.15 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ. 2.43-4.25; దుర్ముహూర్తం: ఉ. 10.04-10.50, మ. 2.40-3.26; అమృతఘడియలు: రా. 12.53-2.35; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.43 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తప్పిన తుఫాను ముప్పు

ఉత్తర ఒడిసా దిశగా 'దానా' పయనం.. నేడు తీవ్ర తుఫాన్‌గా బలపడే చాన్స్



- రేపు ఉదయంలోగా ఒడిసాలో తీరం దాటే అవకాశం
- ఒడిసాలో 110 కి.మీ. వేగంతో గాలులు? పలు రైళ్లు రద్దు
- కల్లోలంగా సముద్రం.. ఉత్తరాంధ్ర తీరంలో బలమైన గాలులు
- 26 వరకు చేపల వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక

3

మమకారం మాయం!

సొంత తల్లీ చెల్లిపైనే ఎన్‌సీఎల్టీలో జగన్ కేసు

- వాటాలు, గిఫ్ట్‌డీడ్‌ల రద్దు కోరుతూ పిటిషన్.. సరస్వతీ పవర్‌లో తల్లికి పూర్తి వాటా
- అంతకుముందే జగన్, భారతి గిఫ్ట్ డీడ్.. బోర్డు ఆమోదంతో వాటాల బదిలీ పూర్తి
- చెల్లదంటూ సెప్టెంబరులో జగన్, భారతి పిటిషన్.. నా తెలివితేటలతో వ్యాపారం
- ప్రేమాభిమానాలతో షర్మిలకు కొంత ఇవ్వాలనుకున్నా.. 2019లో ఎంవోయూ

షర్మిలకు కృతజ్ఞత లేదు

- నా ప్రేమాభిమానాలు కరిగిపోయాయి
- ఆస్తుల్లో వాటా ఇవ్వాలనుకోవడం లేదు
- పిటిషన్‌లో జగన్ వాదనలు

దాయాదుల మధ్య ఆస్తుల గొడవల గురించి విన్నాం! ఆస్తుల కోసం అన్నదమ్ములు గొడవలు పడటం విన్నాం! భాగస్వాముల మధ్య విభేదాలు తలెత్తడమూ సర్వ సాధారణం! కానీ... ఏకంగా తల్లి, చెల్లిపైనే కేసులు వేయడం మాత్రం అత్యంత అసాధారణం! మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ 'అరుదైన ఘనత'ను సొంతం చేసుకున్నారు. చెల్లి షర్మిల, తల్లి వైఎస్ విజయలక్ష్మిపైనే ఆయన నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్టీ)లో గత నెల 9వ తేదీన పిటిషన్ దాఖలు చేశారు. తన సొంత తెలివితేటలు, కష్టంతో సంపాదించిన ఆస్తుల్లో షర్మిలకు ప్రేమాభిమానాలతో కొంత వాటా ఇవ్వాలనుకున్నానని... ఇప్పుడు ఆ మమకారం కరిగిపోయిందని తెలిపారు. ఆమె ఆరోపణలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని చెప్పారు. షర్మిలకు ఇచ్చేందుకు అంగీకరిస్తూ కుదుర్చుకున్న ఒప్పందాన్ని (ఎంవోయూ) రద్దు చేసుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. అంతేకాదు... సరస్వతీ పవర్‌లో తన తల్లికి జరిగిన షేర్ల బదిలీ కూడా చెల్లదంటూ 'కోర్టు'కెక్కారు! చెల్లెలితో జగన్ రాయబేరాలు సాగిస్తున్నారంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' సంచలనాత్మక కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే! అయితే... అంతకంటే ముందు చాలా జరిగింది. ఒకవైపు జగన్ రణభేరి మోగిస్తూనే, మరోవైపు రాయబారాలు సాగిస్తున్నట్లు తేలింది. 13



నాన్నకు మాటిచ్చి తప్పావ్

నైతికంగా పతనమయ్యావ్

- అన్నపై షర్మిల ఫైర్.. జగన్‌కు ఘాటుగా లేఖాస్త్రం
- తల్లి విజయలక్ష్మిపై కేసు పెట్టినందుకు ఆగ్రహం
- తన పిల్లలకు ఆస్తులు పంచనందుకు ఆవేదన
- ఆస్తులు మనుమడు, మనుమరాళ్లకు సమానంగా ఇవ్వాలన్నది నాన్న ఆదేశం
- పాటిస్తానని నాడు హామీ ఇచ్చి ధిక్కరించావు
- ఎంవోయూలో లేకున్నా యలహంక ఆస్తిలో నాకూ వాటా ఉంది.. అమ్మ సాక్షిగా మౌఖిక అంగీకారం
- అమలుచేయకుంటే న్యాయపరమైన చర్యలు
- షర్మిల హెచ్చరిక.. లేఖపై సంతకం చేసిన విజయలక్ష్మి

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తన జీవితకాలంలో సంపాదించిన ఆస్తులను తన మనుమడు, మనుమరాళ్లకు సమానంగా పంచాలన్న తమ తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాన్ని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధిక్కరించారని ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. తద్వారా నైతికంగా పతనమయ్యారని దుయ్యబట్టారు. తండ్రి అభీష్టం మేరకు ఆస్తులను సమానంగా పంచకపోతే.. న్యాయపరమైన చర్యలు తప్పవని ఓ లేఖలో హెచ్చరించారు. గత నెల 12న జగన్‌కు రాసిన ఈ లేఖను ఆమోదిస్తూ

మిగతా 13వ పేజీలో...



తల్లీ చెల్లిపై జగడాల జగన్


- ఎన్‌సీఎల్టీలో పిటిషన్‌తో రచ్చ
- అంతకుముందు షర్మిలకు జగన్ లేఖ
- ఆస్తుల పంపిణీకి సరే అంటూనే.. షరతులు
- తమ గురించి, అవినాశ్ గురించి మాట్లాడొద్దని కండిషన్
- ఆమోదయోగ్యం కాదంటూ షర్మిల మౌనం
- దీంతో ఆస్తులే ఇవ్వనంటూ జగన్ పిటిషన్
- వెంటనే సోదరుడికి ఘాటుగా షర్మిల జవాబు
- తండ్రి వైఎస్ పరువు తీస్తున్నారంటూ ధ్వజం
- తన మాటా అదేనంటూ విజయలక్ష్మి సంతకం
- రాజీ కోసం సన్నిహితుల ప్రయత్నాలు

ప్రేమాభిమానం.. రద్దు

షర్మిలకు ప్రేమాభిమానాలతో ఆస్తులు ఇద్దామనుకున్నాము. కానీ... ఆమెకు నాపై కనీస కృతజ్ఞత లేదు. షర్మిల ప్రవర్తన వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యాను. నాపై షర్మిల బహిరంగంగా అనేక ఆరోపణలు చేశారు. రాజకీయపరమైన దాడితో పాటు వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా మాట్లాడారు. దీనివల్ల షర్మిలపై ఉన్న ప్రేమాభిమానాలు కరిగిపోయాయి. అందుకే... ఆస్తుల పంపకంపై షర్మిలకు రాసిచ్చిన ఎంఓయూ, గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేయాలనుకుంటున్నాం!

- ఎన్‌సీఎల్టీలో వేసిన పిటిషన్‌లో వైఎస్ జగన్

శారదా పీఠానికి భూకేటాయింపు రద్దు



సంబంధిత జీవోల రద్దుకు కేబినెట్ ఆమోదం

- మహిళలకు 3 ఉచిత సిలిండర్లకూ పచ్చజెండా.. ఇసుకపై సీనరేజ్ తదితర పన్నుల రద్దు
- ఆలయ బోర్డుల్లో సభ్యుల పెంపు.. బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు
- రివర్స్ టెండరింగ్ రద్దు.. జ్యుడీషియల్ ప్రివ్యూ కూడా.. జీవోఐఆర్ పోర్టల్ పునరుద్ధరణ
- మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పార్థసారథి, మనోహర్, అనిత, రవీంద్ర

14

నాతో పోటీ పడండి

- మంత్రులు చురుగ్గా పనిచేయాలి: చంద్రబాబు
- సంఘటనలపై ఎప్పటికప్పుడు స్పందించాలి
- ప్రభుత్వం చేసే పనులనూ చెప్పలేకపోతే ఎలా?
- ఉచిత ఇసుక గురించి చెప్పలేకపోతున్నారు
- కేంద్రం చేసిన పనులపైనా ప్రచారం చేద్దాం
- రెండు నెలల్లో అభివృద్ధి పట్టాలెక్కించాలి
- కేబినెట్ భేటీలో సీఎం పిలుపు



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలొద్దు!


- దౌత్య మార్గాలకే భారత్ మద్దతు
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ
- చైనా అధ్యక్షుడితో మోదీ చర్చలు

2

పారిశ్రామిక ఆల్కహాల్‌పై రాష్ట్రాలదే అధికారం

- తయారీ, సరఫరా తదితర అన్ని ప్రక్రియలపైనా చట్టాలు చేయొచ్చు
- దీనిని కేంద్రం అడ్డుకోలేదు
- 1990 నాటి తీర్పును తిరగరాస్తూ సుప్రీంకోర్టు 8:1 మెజారిటీ తీర్పు

పోలవరం పరుగులు పెట్టాలి



- 2027 నాటికి సాగునీటి ప్రాజెక్టు పూర్తి కావాలి
- అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించిన సీఎం చంద్రబాబు
- 2026 మార్చి నాటికి డయాఫ్రమ్‌వాల్ రెడీ అవుతుంది
- 2027 జూలై నాటికి ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పూర్తి
- పనుల పురోగతిని సీఎంకు వివరించిన అధికారులు

2

జీజీహెచ్‌లో జగన్ రచ్చ


- భారీగా కార్యకర్తలతో గుంటూరు ఆస్పత్రికి జగన్
- ఆస్పత్రి పరిసరాల్లో వైసీపీ శ్రేణుల హల్‌చల్
- గేటు దూకి, మొక్కలను తొక్కి.. బీభత్సం
- అంబులెన్స్‌లకూ తప్పని అవస్థలు
- జగన్ అక్కడ ఉన్న 3 గంటలూ నరకమే..

12



జీజీహెచ్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న జగన్

- ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు
- జగన్ మండిపాటు
- జీజీహెచ్, బద్వేలులో బాధిత కుటుంబాలకు పరామర్శ



నవంబరు తొలి వారంలో మెగా డీఎస్సీ!

- 16,347 పోస్టులతో నోటిఫికేషన్ జారీకి సిద్ధం
- 3-4 నెలల్లో భర్తీ ప్రక్రియ పూర్తి
- పాఠశాల విద్యాశాఖ అధికారుల కసరత్తు
- న్యాయ వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా అనురాధ

- రిటైర్డ్ ఐపీఎస్ అధికారికి కీలక పదవి
- గవర్నర్ ఆమోదం.. సర్కారు ఉత్తర్వులు
- ఏడాది కాలం పదవిలో ఉండే అవకాశం
- ఏపీ ఇంటెలిజెన్స్ మహిళా చీఫ్‌గా గుర్తింపు

14





వెంకయ్య మనవడి నిశ్చితార్థం.. హాజరైన సీఎం

మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు మనవడి నిశ్చితార్థ వేడుక గుంటూరు మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. సీఎం చంద్రబాబు హాజరై, త్వరలో ఒకటి కాబోతున్న విష్ణు సాయి, సాత్విక జంటను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి, గుంటూరు సిటీ

పట్టణాల్లో పేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తాం

▸▸ టిడ్కో చైర్మన్‌గా అజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



టిడ్కో చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న వేములపాటి అజయ్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి కృషి చేస్తానని ఏపీ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీ టిడ్కో) చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం విజయవాడ బస్ భవన్‌లోని టిడ్కో కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో ప్రతిష్ఠాత్మకమైన పదవిని అప్పగించిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి

▸▸ చంద్రబాబుకు ముస్లిం సంఘాల విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్టంలో మార్పులను అంగీకరించవద్దని ముస్లిం సంఘాల ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి ఫరూక్, మండలి మాజీ చైర్మన్ షరీఫ్‌లతోపాటు ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ముస్లిం సంఘాల ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిశారు. వక్ఫ్ చట్ట సవరణలపై తమ అభ్యంతరాలను తెలియజేశారు. పార్లమెంట్‌లో ఆ బిల్లును వ్యతిరేకించాలని చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబుతో కొరియా కాన్సులేట్ జనరల్ భేటీ

చెన్నైకి చెందిన కొరియా కాన్సులేట్ జనరల్ కిమ్ చాంగ్ న్యూన్ తన బృందంతో బుధవారం సీఎం చంద్రబాబును కలిశారు. పలు రంగాల్లో సహకారం, భాగస్వామ్యం మరింత బలోపేతం చేసేలా చర్చలు తాము జరిపినట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు.

చుక్కల భూములపై వైసీపీ నేతల కన్ను

▸▸ టీడీపీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చుక్కల భూముల పై వైసీపీ నేతల కన్ను పడిందని, దాదాపు 2 లక్షల ఎకరాలపైగా భూముల్ని కొట్టేసేందుకే ఆ భూములపై సర్వాధికారాలు ఇవ్వడంతో నాటి కలెక్టర్లు స్వయంగా సెటిల్‌మెంట్లకు దిగారని పలువురు బాధితులు టీడీపీ నేతలకు ఫిర్యాదు చేశారు. పేదల అనుభవంలో ఉన్న భూముల రికార్డుల్లో తప్పులు సరిచేయకుండా, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిప్పారని, దీనిపై విచారణ జరిపించాలని బాపట్ల జిల్లా పెద్ద గంజాంకి చెందిన కొందరు విజ్ఞప్తి చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాన్‌పిక్ భూములకు సంబంధించిన కొందరు.. తాము ఆరేళ్లుగా తిరుగుతున్నా తమ గోడును అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. పోలవరం ముంపు పరిహారాన్ని వైసీపీ నేతలు తప్పుడు పత్రాలతో దండుకున్నారని అల్లూరి జిల్లా గానుగలగొంది గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు ఫిర్యాదు చేశారు. 2023లో జరిగిన కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ప్రశ్నపత్రంలో తప్పుల వల్ల మార్కులు తగ్గి తాము నష్టపోతున్నామని పలువురు అభ్యర్థులు తెలిపారు.

డిస్టిలరీల్లో రెండో రోజూ తనిఖీలు

▸▸ పలు చోట్ల కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్న సీఐడీ అధికారులు

వెంకటాచలం/తిరుపతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు వరుసగా రెండో రోజైన బుధవారం కూడా సోదాలు చేపట్టారు. నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న ఎస్ఎన్‌జే(ఎస్ఎన్ జయమురగన్) లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారుల బృందం కీలకమైన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా వీడియో తీయించారు. అదేవిధంగా తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని ఎస్వీఆర్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా తదితర అంశాలపై వివరాలు సేకరించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఓ రాజకీయ ప్రముఖుడి సంస్థ ఈ డిస్టలరీస్‌ను లీజుకు తీసుకున్నప్పటి నుంచీ జరిగిన కార్యకలాపాలపైనా దృష్టి పెట్టారు. కంప్యూటర్ల హార్డు డిస్కులను స్వాధీనం చేసుకున్నారు.

ఎక్సైజ్ స్టేషన్లకు మద్యం దుకాణాల్లోని ఫర్నిచర్

▸▸ అధికారుల విజ్ఞప్తికి సర్కారు ఓకే

అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల మూతబడిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న ఫర్నిచర్ సహా ఇతర సామగ్రిని ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు, ఆఫీసులలో వినియోగించనున్నారు. దుకాణాల్లోని కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇన్వర్టర్లు, ఇతర సామాగ్రిని ఎక్సైజ్ స్టేషన్లు, ఆ శాఖ డీసీ, ఏసీ, ఈఎస్ ఆఫీసులకు తరలించనున్నారు. ఫర్నిచర్‌ను తమకు కేటాయించాలని ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షుడు బి. నర్సింహులు ఎక్సైజ్ శాఖను కోరారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం అనుమతించింది.

31 వరకు మద్యం షాపులకు ప్రొవిజినల్ లైసెన్స్‌లు

ప్రైవేటు మద్యం దుకాణాలకు ఇటీవల జారీ చేసిన ప్రొవిజినల్ లైసెన్స్‌ల గడువును నెలాఖరు వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. లైసెన్సీల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సైకో ఫేకూ.. నాతో చర్చకు సిద్ధమా?

▸▸ జగన్‌కు లోకేశ్ సవాల్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రభుత్వంలో ఉన్నా అభిప్రాయాలను వ్యక్తపరిచే విధానం గౌరవంగా ఉండాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సలహా ఇచ్చారు. 'సైకో ఫేకూ జగన్.. చర్చకు సిద్ధమా?' అంటూ బుధవారం ఎక్స్ వేదికగా జగన్‌కు సవాల్ విసిరారు. గౌరవంగా ఉండాలని, అబద్ధాలు చెప్పొద్దని తమ నేత, సీఎం చంద్రబాబు తమకు సూచించారని పేర్కొన్నారు. దిశా చట్టం లేకుండానే.. ఉందన్నట్టుగా జగన్ మాట్లాడుతున్నారన్నారు. నేరగాళ్లకు జగన్ అండగా ఉన్నారని లోకేశ్ ఆరోపించారు.

మంత్రి సత్యకుమార్ 5 లక్షల విరాళం

▸▸ ఐఏఎస్ కోచింగ్ విద్యార్థినుల వసతికి సాయం

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ధర్మవరం ప్రాంతం నుంచి ఎంపికైన 28 మంది విద్యార్థినుల వసతి కోసం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. బుధవారం సచివాలయంలో అకాడమీ ప్రతినిధులకు మంత్రి చెక్కును ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సివిల్స్‌కు ఎంపిక కావాలనే ఉద్దేశంతో ఢిల్లీకి చెందిన లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీతో ఆదివారం ధర్మవరంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో 28 మంది విద్యార్థినులు ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు.

ఉగ్రవాదంపై పోరులో

ద్వంద్వ ప్రమాణాలొద్దు!

అందరం ఏకతాటిపై నిలిచి, ఎదుర్కోవాలి.. పరస్పర మద్దతుతో ముందుకు సాగాలి

కజాన్, అక్టోబరు 23: ఉగ్రవాదం అనే సవాలును ఎదుర్కోవడంలో ద్వంద్వ వైఖరికి తావు లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అందరూ ఏకతాటిపై నిలిచి, పరస్పరం పటిష్ఠ మద్దతుతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భారత్ ఎప్పుడూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడానికే మద్దతు తెలుపుతుందని.. యుద్ధానికి కాదని చెప్పారు. శాంతి చర్చల ద్వారానే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం లభిస్తుందని పునరుద్ఘాటించారు. కొవిడ్ లాంటి సవాళ్లను సమష్టిగా ఎదుర్కొన్న తరహాలోనే మనమంతా కలిసి భావి తరాలకు భద్రతమైన, పటిష్ఠమైన భవిష్యత్తును అందించేందుకు సరికొత్త అవకాశాలను సృష్టించాలని మోదీ సూచించారు. రష్యాలోని కజాన్ నగరంలో జరుగుతున్న 16వ బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సులో బుధవారం ఆయన మాట్లాడారు. రష్యా, చైనా, ఇరాన్ అధినేతలు పుతిన్, జిన్‌పింగ్, మసౌద్ పెజెష్కియన్‌ల సమక్షంలో మోదీ మాట్లాడుతూ.. బ్రిక్స్ దేశాల్లో యువతను ఉగ్రవాదం వైపు పురికొల్పడాన్ని అడ్డుకోవడానికి క్రియాశీల చర్యలు చేపట్టాలన్నారు. ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయాన్ని అడ్డుకోవడంలో అందరూ కలిసి పనిచేయాలని, ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదని తేల్చిచెప్పారు. 'పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు' అని పేర్కొనాలంటూ ఐరాసలో చేసిన అనేక ప్రతిపాదనలను చైనా అడ్డుకున్న నేపథ్యంలో మోదీ 'ద్వంద్వ ప్రమాణాలు' వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతర్జాతీయ ఉగ్రవాద సమస్యపై ఐరాసలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అంశాలను పరిష్కరించేందుకు కలిసి పనిచేయాలని మోదీ ఉద్ఘాటించారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని, యుద్ధాలు, ఆర్థిక అస్థిరతలు, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. ఇక బ్రిక్స్‌లోకి కొత్త దేశాలను చేర్చుకోవడాన్ని భారత్ స్వాగతిస్తోందని చెప్పారు. గాజాస్ట్రిప్‌లో తక్షణమే,



బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ కరచాలనం


శాశ్వత కాల్పుల విరమణ పాటించాలని, ఇరువైపుల నుంచి బందీలను విడిచిపెట్టాలని బ్రిక్స్ నేతలు తీర్మానం చేశారు. అలాగే సహాయ కార్యకలాపాలు చేపడుతున్న సంస్థలపై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని బ్రిక్స్ సభ్యులు ఖండించారు.

సరిహద్దు గస్తీ ఒప్పందాన్ని స్వాగతించిన జిన్‌పింగ్, మోదీ

బ్రిక్స్ సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఇద్దరు నేతలూ భేటీ కావడం ఇదే తొలిసారి. భారత్-చైనాల మధ్య సరిహద్దు గస్తీకి సంబంధించి కుదిరిన ఒప్పందాన్ని ఇరువురు నేతలూ స్వాగతించారు. విభేదాలు, వివాదాలను సరైన పద్ధతిలో పరిష్కరించుకోవడం ప్రధానమని.. వీటి ప్రభావం శాంతి, సామరస్యాలపై పడకూడదని భేటీలో మోదీ.. జిన్‌పింగ్‌కు స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాలు కేవలం ఇరుదేశాల ప్రజలకే కాదని, ఈ ప్రాంతంతోపాటు అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు కూడా ప్రధానమని వ్యాఖ్యానించారు. పరస్పర గౌరవం, పరిణతితోనే భారత్, చైనాల మధ్య శాంతియుత, సుస్థిర బంధాలు ఉంటాయని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. విభేదాల పరిష్కారంలో ఇరుదేశాల ప్రతినిధులు మరింత సమర్థంగా సహకరించుకోవాల్సిన అవసరం ఉందని జిన్‌పింగ్ చెప్పారు. ఇది ఇరుదేశాలకు అత్యంత ప్రాధాన్య అంశమన్నారు. ఇక సరిహద్దు అంశంపై ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల తదుపరి సమావేశం అతిత్వరలోనే ఉంటుందని మోదీ, జిన్‌పింగ్ పేర్కొన్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో చెప్పారు. కాగా, బుధవారం ఉజ్బెకిస్థాన్, యూఏఈ అధ్యక్షులతో కూడా మోదీ భేటీ అయ్యారు. ఆయా దేశాధినేతలతో ఫలప్రదమైన చర్చలు జరిగినట్లు మోదీ ట్వీట్ చేశారు.

బ్రిక్స్ తెర వెనుక తెలుగు అధికారి

న్యూఢిల్లీ, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): భారత-చైనా సంబంధాల్లో నూతన అధ్యాయానికి తెర లేపిన చరిత్రాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం వెనుక కీలక పాత్ర పోషించింది మన తెలుగోడే! ఈ సమావేశానికి రూపకల్పన చేసింది, బుధవారం పది దేశాలు ఆమోదించిన తీర్మానాన్ని రూపొందించింది.. భారత విదేశాంగ శాఖలో పనిచేస్తున్న సీనియర్ అధికారి దమ్ము రవి. విదేశాంగ శాఖలో ఆర్థిక సంబంధాల కార్యదర్శిగా ఉన్న ఆయన.. ఈ సమావేశాలకు ప్రధాన సంధానకర్త (షెర్పా)గా వ్యవహరించారు. కాగా ఈ సదస్సులో ఒకరి కరెన్సీని మరొకరు గుర్తించడం, వాతావరణ మార్పు, ఉగ్రవాదంపై పోరు, ఆర్థిక సంబంధాలు, ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు మొదలైన వాటిపై చర్చలు జరిగాయని దమ్ము రవి విలేకరులకు తెలిపారు. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన ఆయన.. 1989లో భారత విదేశాంగ సర్వీసులో చేరారు.



పారిశ్రామిక ఆల్కహాల్‌పై

రాష్ట్రాలదే అధికారం

న్యూఢిల్లీ, అక్టోబరు 23: పారిశ్రామిక ఆల్కహాల్ తయారీ, సరఫరాలపై నియంత్రణ అధికారం రాష్ట్రాలదేనని(శాసనసభల) సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఔషధాలు, టెక్స్‌టైల్స్, డైలు, యాంటీఫ్రీజ్ సమ్మేళనాలు, ఇంక్‌లు, సాల్వెంట్లు, క్లీనర్లు, సౌందర్య సాధనాలు తదితర ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే పారిశ్రామిక ఆల్కహాల్‌పై ఇప్పటివరకూ కేంద్రానికే నియంత్రణ ఉంది. 1990లో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం పారిశ్రామిక ఆల్కహాల్(రెక్టిఫైడ్ స్పిరిట్) ఉత్పత్తి, సరఫరాపై కేంద్రానికే అధికారం ఉంటుందని తీర్పు ఇచ్చింది. దీనిని యూపీతోపాటు పలు రాష్ట్రాలు సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేశాయి. 2010లో ఈ కేసును 9 మంది సభ్యుల ధర్మాసనానికి సిఫార్సు చేశారు. నాటి నుంచి విచారణ కొనసాగింది. బుధవారం సుప్రీంకోర్టు 8:1 మెజారిటీ తీర్పును వెలువరించింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు జస్టిస్‌లు రిషికేశ్ రాయ్, అభయ్ ఒకా, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రా, ఉజ్జల్ భుయాన్, సతీశ్‌చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మాసి 364 పేజీల మెజారిటీ తీర్పును ఇచ్చారు. దీంతో జస్టిస్ నాగరత్న విబేధిస్తూ.. పారిశ్రామిక ఆల్కహాల్‌పై చట్టాలు చేసే అధికారం రాష్ట్రాల శాసనసభలకు ఉండదని, ఆ అధికారం పార్లమెంటుదేనన్నారు.

ఇది కూడా 'మత్తు ద్రావకాల' పరిధిలోకే!

రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో రాష్ట్రాల జాబితాలో ఉన్న ఎంట్రీ 8లోని 'మత్తు కలిగించే ద్రావకాలు' అనే పదం పరిధిలోకి పారిశ్రామిక ఆల్కహాల్ కూడా వస్తుందని సీజేఐ వెలువరించిన మెజారిటీ తీర్పులో స్పష్టం చేశారు. 'మత్తు కలిగించే ద్రావకాల' తయారీ, నిల్వ, రవాణా, కొనుగోళ్లు, అమ్మకాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్రాలదేనని ఎంట్రీ 8 నిర్వచిస్తున్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఎంట్రీ 52 కింద యావత్ పరిశ్రమను కేంద్రం పరిధిలోకి తీసుకొచ్చేలా పార్లమెంటు చట్టం చేయలేదని పేర్కొంది.

విమానాలకు బాంబు బెదిరింపుల వ్యవహారం..

ఎక్స్‌పై కేంద్రం కన్నెర్ర!

▸▸ నేరానికి ఊతమిస్తున్నట్టుగా ఉందంటూ ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబరు 23: కొద్ది రోజులుగా దేశీయ, అంతర్జాతీయ విమానాలకు వస్తున్న వరుస బాంబు బెదిరింపులు అటు విమానయాన సంస్థలు, కేంద్ర ప్రభుత్వం ఇటు ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే సోషల్ మీడియా వేదికగా వస్తున్న బెదిరింపులకు సంబంధించి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంకేత్ ఎస్ బోండ్వే అధ్యక్షతన విమానయాన సంస్థలు, సోషల్ మీడియా దిగ్గజాలైన ఎక్స్, మెటా వంటి సంస్థల ప్రతినిధులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఎక్స్ వేదికగా బెదిరింపులు రావడంతో వాటి కట్టడి విషయంలో ఆ సంస్థ తీరుపై కేంద్రం తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ పరిస్థితిపై ఎక్స్ తీరు నేరానికి ఊతమిస్తున్నట్టుగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అలాగే ఇలాంటి ఆందోళనకరమైన వదంతులను నిలువరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. విమానాలకు బెదిరింపుల మెసేజ్‌లు పోస్ట్ చేసిన యూజర్ల ఐడీ లేదా అకౌంట్ల డొమైన్‌కు సంబంధించిన వివరాలను ఢిల్లీ పోలీసులు పొందడంలో విఫలమవడమే కేంద్రం ఆ సంస్థపై కన్నెర్రజేయడానికి కారణమని సమాచారం. బాంబు బెదిరింపులకు సంబంధించి ఢిల్లీ పోలీసులు ఎనిమిది ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు.

మీలో ఒకరిగా.. మీ కుటుంబసభ్యురాలిగా ఉంటా!

▸▸ వయనాడ్‌లో నామినేషన్ వేసిన ప్రియాంక గాంధీ

వయనాడ్, అక్టోబరు 23: తనను గెలిపిస్తే మీలో ఒకరిగా.. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని వయనాడ్ ప్రజలకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా హామీ ఇచ్చారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల బరిలో దిగిన ఆమె బుధవారం భారీ రోడ్డుషో నిర్వహించి నామినేషన్ వేశారు. తద్వారా ప్రత్యక్ష ఎన్నికల్లోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా తనకు ఘన స్వాగతం పలికేందుకు హాజరైన వేలాది మంది ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర పార్టీ సీనియర్ నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. ప్రియాంక తన ప్రసంగంలో రాజకీయాల్లో తనకు 35 ఏళ్ల అనుభవం ఉందని పేర్కొన్నారు. 17 ఏళ్ల వయస్సులోనే తన తండ్రి దివంగత రాజీవ్ గాంధీ కోసం 1989లో ప్రచారం చేశానని చెప్పారు. బీజేపీ నుంచి వయనాడ్ ఉప ఎన్నికల బరిలో దిగిన నవ్య హరిదాస్.. ప్రజలకు ప్రాతినిధ్యం వహించడంలో ప్రియాంకకన్నా తనకు ఎంతో అనుభవం ఉందని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడినప్పుడు తాను ఇక్కడికి వచ్చానని, అప్పుడు తాను కలుసుకున్న వారందరూ బాధితులకు సాయం చేసినవారేనని ప్రియాంక తన ప్రసంగంలో తెలిపారు. వారి ధైర్యం తనను కదిలించిందన్నారు. మీలో ఒకరిగా, మీ కుటుంబసభ్యురాలిగా ఉండడం తనకు గౌరవం, అదృష్టం అవుతుందన్నారు. ప్రపంచమంతా తన సోదరుడు రాహుల్‌కి వెన్ను చూపినప్పుడు వయనాడ్ ప్రజలు అండగా నిలిచారని పేర్కొన్నారు. "మీ సమస్యలపై పోరాడతాను, ప్రతి ఒక్కరికి అండగా ఉంటాను" అని చెప్పారు. కేంద్రంలో బీజేపీ పాలనను వివరిస్తూ... తమను ఎన్నుకొన్న ప్రజలనే అధికారంలో ఉన్నవారు విభజించే పరిస్థితి నెలకొందన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని అణచివేయడానికి వెనుకాడరని ఆమె విమర్శించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రియాంక గాంధీ

రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. తనను ఆదరించినట్లే తన సోదరిని కూడా ఆదరించాలని వయనాడ్ ప్రజలను కోరారు. రాహుల్ వయనాడ్‌తోపాటు యూపీలోని రాయబరేలి నుంచి లోక్‌సభకు ఎన్నికయి.. వయనాడ్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించడంతో ఇక్కడ ఉప ఎన్నిక తప్పనిసరి అయ్యింది. బహిరంగ సభలో ప్రసంగం అనంతరం ప్రియాంక వయనాడ్ కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట రాహుల్, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉన్నారు. అనంతరం రాహుల్, ప్రియాంక వయనాడ్‌లో కొండచరియలు పడి ప్రాణాలు కోల్పోయిన వారిని ఖననం చేసిన పుతుమల సామూహిక శ్మశానవాటికకు చేరుకుని నివాళులు అర్పించారు. కాగా తనకు రూ. 12 కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రియాంక తన నామినేషన్ పత్రాల్లో పేర్కొన్నారు.

దక్షిణాదిన జన ఆందోళన!

జనాభా తగ్గుదలపై ఆంధ్ర, తమిళనాడుల్లో కలవరం

▸▸ భవిష్యత్‌లో యువత కంటే వృద్ధుల సంఖ్య పెరిగే ప్రమాదం

▸▸ నియోజకవర్గాల పునర్విభజనపైనా జనాభా లెక్కల ప్రభావం

▸▸ ఎక్కువ మంది పిల్లలను కనాలని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపు

▸▸ తమిళనాడు సీఎందీ అదేమాట



న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశంలో జనాభా అపరిమితంగా పెరిగిపోవడంతో 40-50 ఏళ్ల క్రితం దాని నియంత్రణకు కేంద్ర, రాష్ట్రాలు నడుం బిగించాయి. జనాభా నియంత్రణ విధానాలు గట్టిగా అమలు చేశాయి. ముఖ్యంగా దక్షిణ భారతం ఈ విషయంలో ముందంజలో ఉంది. అయితే భవిష్యత్‌లో ఇదే తమకు ముప్పు తెచ్చిపెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నేతలు ఆందోళన చెందుతున్నారు. వృద్ధుల జనాభా పెరిగిపోతుండగా.. జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేటు-టీఎఫ్ఆర్.. ప్రతి మహిళ తన జీవితకాలంలో కనే పిల్లల సగటు శాతం) తగ్గిపోతోంది. త్వరలోనే జనాభా లెక్కల సేకరణ ప్రారంభం కానుంది. దక్షిణాది జనాభా తగ్గిపోయే అవకాశం ఉందని.. ఇది వనరుల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయా రాష్ట్రాలు అంటున్నాయి. అంతేగాక.. జనాభాను బట్టి జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది వాటా, పలుకుబడి తగ్గిపోతాయన్న ఆందోళన కూడా ఏర్పడింది. ఇన్నాళ్లు జనాభా నియంత్రణ పాటిస్తే ప్రభుత్వాలు ప్రోత్సాహకాలిచ్చేవి. ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని.. అలా కంటే ప్రోత్సాహకాలిస్తామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ఇందుకోసం ఓ చట్టం తెచ్చే యోచనలో ఉన్నామని సరిగ్గా ఐదు రోజుల కిందట బహిరంగ సభలో వెల్లడించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఒకడుగు ముందుకేసి.. తాజా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. జాతీయ స్థాయిలో తమిళనాడు రాజకీయ పలుకుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని మూడ్రోజుల కిందట అన్నారు. జనాభా నియంత్రణలో దక్షిణ రాష్ట్రాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశంలో విజయాలు సాధించిన రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన సమయంలో శిక్షించరాదన్నారు. జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు జరుగుతుందా అని ప్రశ్నించారు. అలా జరక్కుండా ఓ చక్కటి ఫార్ములాను రూపొందించాలని సూచించారు. 2031 జనాభా లెక్కల తర్వాత చేసే నియోజకవర్గాల పునర్విభజనలో లోక్‌సభ స్థానాలను జనసంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాల్సి ఉండగా.. 2026లోనే సర్దుబాటు చేయాలని వాజపేయి ప్రభుత్వం 2001లో రాజ్యాంగ సవరణ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. రాజకీయాల సంగతి అటుంచితే దక్షిణ భారతంలో జననాల రేటు.. భర్తీ స్థాయి కంటే బాగా తగ్గిపోయిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-5లో కూడా వెల్లడైంది. వాస్తవానికి ఈ ఏడాది జూలై 27న ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో.. జనాభా నిర్వహణ విధానాలను రాష్ట్రాలు సొంతగా రూపొందించుకోవలసిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. వృద్ధుల సంఖ్య పెరిగిపోతున్న సమస్యను అధిగమించడానికి చేపట్టే జనాభా నిర్వహణ విధానాలను కేంద్రం ప్రోత్సహిస్తుందని ప్రధాని తన ముగింపు ఉపన్యాసంలో పేర్కొనడం గమనార్హం. జనాభా నియంత్రణలో భాగంగా ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్నవారు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధిస్తూ చాలా రాష్ట్రాలు చట్టాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం.. బిహార్, యూపీ, జార్ఖండ్ రాష్ట్రాల్లో మాత్రమే భర్తీ స్థాయి (2.1) కంటే టీఎఫ్ఆర్ ఎక్కువగా ఉంది. 15 ఏళ్ల నుంచి 49 ఏళ్లలోపు మహిళల్లో టీఎఫ్ఆర్ జాతీయ సగటు 1981 జనాభా లెక్కల ప్రకారం 4.5గా ఉండగా.. 1991లో 3.6, 2001లో 2.5, 2011లో 2.2గా ఉందని.. తన సర్వేలో ఇది 2.0 అని ఈ సర్వే వెల్లడించింది.

అన్నివిధాలా అండగా ఉంటా

▸▸ బద్వేలులో హత్యకు గురైన బాలిక కుటుంబానికి సీఎం భరోసా

▸▸ 10లక్షల ఆర్థికసాయం అందించిన కలెక్టర్

బద్వేలు టౌన్, అక్టోబరు 23: ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన కడప జిల్లా బద్వేలుకు చెందిన ఇంటర్మీడియట్ బాలిక కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని బాలిక తల్లిదండ్రులను ముఖ్యమంత్రి ఓదార్చారు. 'మా ఆడబిడ్డకు జరిగిన అన్యాయం మరేబిడ్డకు జరగకుండా నిందితుణ్ని కఠినంగా శిక్షించాల'ని బాలిక తల్లిదండ్రులు .. సీఎంను కోరారు. అల్లారు ముద్దుగా పెంచుకున్నామని, మంచి చదువు చెప్పించి ప్రయోజకురాలిగా చేసుకోవాలని అనుకున్నామంటూ కన్నీరుమున్నీరయ్యారు. అధైర్యపడవద్దని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి చంద్రబాబు హామీ ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. బాధితురాలి తమ్ముడికి రెసిడెన్షియల్ స్కూల్‌లో సీటు ఇప్పించాలని నిర్దేశించారు. సీఎం ఆదేశంతో బుధవారం రూ.10లక్షల చెక్కును ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ బాధిత కుటుంబాన్ని కలిసి అందజేశారు.



పోలవరం పరుగులు పెట్టాలి

▸▸ 2027 నాటికి సాగునీటి ప్రాజెక్టు పూర్తి కావాలి: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు పనుల వేగాన్ని పెంచి 2027 జూలై నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలు, జల వనరుల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జల వనరుల శాఖపై మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి, మేఘా, బావర్ సంస్థల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. 1,396.60 మీటర్ల పొడవైన డయాఫ్రమ్‌వాల్ డిజైన్లను ఆఫ్రై సంస్థ.. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి, విదేశీ నిపుణుల ప్యానెల్‌కు అందజేసిందని అధికారులు ఆయనకు తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో నిపుణుల ప్యానెల్.. డిజైన్లపై వర్క్‌షాపు నిర్వహించి చర్చిస్తుందని, ఆ డిజైన్లను వచ్చేనెల 24 నాటికి ఆమోదిస్తాయని వివరించారు. కొత్త వాల్‌కు రూ. 960.34 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర జలసంఘం ఆమోదించిందని, దానిని 2025 జూలై నాటికి పూర్తి చేస్తామని అధికారులతో పాటు కాంట్రాక్టు సంస్థలు వెల్లడించాయి. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులను 2025 నవంబరులో ప్రారంభించి 2027 జూలైనాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నాయి. భూసేకరణ సహా కీలకమైన పనులన్నీ 2025 జూలై నాటికి పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

2026 నాటికి గోదారి, పెన్నా అనుసంధానం

హంద్రీ-నీవా ప్రధాన కాలువపైనా సీఎం సమీక్షించారు. రూ. 2,484 కోట్లతో తొలిదశ పనులు మేఘా ఇంజనీరింగ్, రెండోదశ ప్యాకేజీ పనులు రూ. 2,163 కోట్లతో డీఎస్ఆర్-వీపీఆర్ సంస్థ చేపట్టనున్నాయని అధికారులు వివరించారు. కుప్పం బ్రాంచి కెనాల్‌ను రూ. 180.61 కోట్లతో చేపడుతున్నామని, ఇక చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రూ. 3,782 కోట్లతో జూలై 2026 నాటికి పూర్తి చేస్తామన్నారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధాన పనులను 2026 జనవరి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రూ. 9,700 కోట్లతో చేపడుతోన్న వెలిగొండ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.6,061.60 కోట్లు ఖర్చయిందని, మరో 3,639 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నామని వివరించారు. వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులు కూడా చేపట్టనున్నామని తెలిపారు. వరదలు తగ్గేలోగా రిజర్వాయర్లు నింపాలని సీఎం ఆదేశించారు.

శిక్షణలేని డ్రైవర్లతో బస్సులు నడపడమా?

- కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి
- ఆర్టీసీ ఎండీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వోల్వో, ఇతర హైఎండ్ టెక్నాలజీ బస్సులను శిక్షణ లేని డ్రైవర్లతో ఎలా నడిపిస్తున్నారని ఆర్టీసీ యాజమాన్యాన్ని హైకోర్టు ప్రశ్నించింది. శిక్షణ ఇవ్వాలని ఒప్పందంలో ఉన్నా ఎందుకు అమలు చేయడంలేదని నిలదీసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా కోర్టు ముందు హాజరుకావాలని ఆర్టీసీ ఎండీని ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి, ఆర్టీసీ ఎండీ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్, వోల్వో అండ్ ఐషర్ గ్రూప్ సీఈవోలకు నోటీసులు జారీ చేసింది. విచారణను నవంబరు 6కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. వోల్వో, ఇతర హైఎండ్ బస్సులను సుశిక్షితులైన డ్రైవర్లతో నడిపించేలా ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రకాశం జిల్లా పేర్నమిట్టకు చెందిన మేడికొండ జార్జ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న హైఎండ్ బస్సులు నడిపేందుకు సర్టిఫికెట్ పొందిన డ్రైవర్లు 149 మంది మాత్రమే ఉన్నారన్నారు. శిక్షణలేని డ్రైవర్లు బస్సులు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని ఆర్టీసీ ఎండీ తరఫు న్యాయవాది చెప్పారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

రూ.7.10 లక్షలకు బెల్టుషాపు వేలం

- బాటిల్‌కు రూ.30-50 అదనంగా అమ్మకం
- మాగుటూరులో గ్రామస్థుల తీర్మానం

కంభం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం మాగుటూరులో బెల్టుషాపు పెట్టుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. ఓ దేవాలయంలో గ్రామస్థులు సోమవారం రాత్రి వేలంపాట నిర్వహించగా రూ.7.10 లక్షలకు ఓ వ్యక్తి బెల్టుషాపును దక్కించుకున్నట్లు తెలిసింది. రెండేళ్లపాటు మద్యం బాటిల్‌పై ఎంఆర్‌పీ కన్నా రూ.30 నుంచి రూ.50 వరకు అమ్ముకోవచ్చని, గ్రామంలో మరెవరూ మద్యం అమ్మరాదని తీర్మానించినట్లు తెలిసింది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ కొండారెడ్డిని ప్రశ్నించగా.. బెల్టుషాపును మూయించి, చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రానికి తప్పిన తుఫాను ముప్పు

- ఉత్తర ఒడిసా దిశగా 'దానా' పయనం
- నేడు తీవ్ర తుఫానుగా బలపడే చాన్స్
- రేపు ఉదయంలోగా ఒడిసాలో తీరం దాటే అవకాశం
- ఒడిసాలో 110 కి.మీ. వేగంతో గాలులు? పలు రైళ్లు రద్దు
- అల్లకల్లోలంగా సముద్రం.. ఉత్తరాంధ్ర తీరంలో బలమైన గాలులు
- 26 వరకు చేపల వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక
- విశాఖ, బందరు ఓడరేవుల్లో రెండో నంబరు హెచ్చరిక

విశాఖపట్నం, విజయవాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తుఫాను ముప్పు తప్పింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం పశ్చిమ వాయవ్యంగా పయనించి బుధవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడింది. తరువాత వాయవ్యంగా గంటకు 12 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ రాత్రి 10గంటలకు ఒడిసాలోని పారాదీప్‌కు 420 కి.మీ., ధామ్రాకు 450 కి.మీ., సాగర్ ద్వీపానికి(పశ్చిమ బెంగాల్) 500కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీనికి ఒమన్ దేశం సూచించిన 'దానా' అని పేరు పెట్టారు. తుఫాను వాయవ్యంగా పయనించే క్రమంలో తీవ్ర తుఫాన్‌గా బలపడి గురువారం ఉదయానికి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. ఆ తరువాత అదే దిశలో పయనించి గురువారం రాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ఒడిసాలోని భితార్కనికా, ధామ్రా సమీపంలో తీరం దాటనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కి.మీ. వేగంతో అప్పుడప్పుడు 120 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, తీరంలో అలలు రెండు మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడతాయని పేర్కొంది. ఒడిసా తీర ప్రాంతాల్లో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని, పల్లపు ప్రాంతాలు నీట మునగడంతోపాటు రవాణా, కమ్యూనికేషన్లు, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ నేపథ్యంలో తూర్పుకోస్తా, ఆగ్నేయ రైల్వేలు అనేక రైళ్లను రద్దు చేశాయి. తూర్పు మధ్య, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య, ఈశాన్య బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారడంతో చేపల వేటను నిషేధించారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున ఈనెల 26వ తేదీ వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవులలో రెండో నంబరు హెచ్చరిక ఎగురవేశారు. కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవులకు సమాచారం అందించారు. తీవ్ర తుఫాను ఒడిసాలో తీరం దాటుతున్నందున ఏపీకి ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు ముప్పు తప్పింది. తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్రలో పలుచోట్ల చెదురుమదురు వర్షాలు మాత్రమే కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

భితార్కనికా పార్కులో మొసళ్లకు ముప్పు..

ఒడిసాలోని కేంద్రపారా జిల్లా భితార్కనికా, ధామ్రా సమీపాన తీవ్ర తుఫాన్ తీరం దాటుతున్నందున భితార్కనికా నేషనల్ పార్కులోని అరుదైన ఉప్పునీటి మొసళ్లు, చుక్కల జింకలు, కొండచిలువలు, పలు రకాల పక్షులు, అడవి పందులకు ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. ఇది సుమారు 200 చ.కి.మీ విస్తీర్ణంతో దేశంలో రెండో అతి పెద్ద మడ అడవిగా ప్రసిద్ధి చెందింది. బ్రాహ్మణి, బైతరణి నదులు బంగాళాఖాతంలో కలిసిన ప్రాంతంలో ఈ పార్కు ఏర్పాటుచేశారు. తీవ్ర తుఫాను ప్రభావంతో సముద్ర అలలు ఎగిసిపడి పార్కులోకి నీరు చొచ్చుకువచ్చే అవకాశం ఉన్నందున మొసళ్లు, ఇతర జంతువులు, పక్షుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే 200 చ.కి.మీ విస్తరించిన మడ అడవులు తుఫాన్ గాలులను కొంత వరకు నిలువరిస్తాయని రిటైర్డు అటవీ అధికారి ఒకరు చెప్పారు.

రైల్వే కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

విజయవాడ డివిజన్ పరిధిలో 14 చోట్ల రైల్వేశాఖ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. సామర్లకోట 8842327010, నెల్లూరు 08612345863, విజయవాడ 8662576924, రాజమండ్రి 08832420541, అనకాపల్లి 7569305669, ఏలూరు 7569305268, గూడూరు 08624250795, నిడదవోలు 08813223325, ఒంగోలు 8592280306, తాడేపల్లిగూడెం 8818226162, తుని 08854252172, తెనాలి 8644227600, గుడివాడ 7815909462, భీమవరం టౌన్ 7815909402 నంబర్లలో సంప్రదించాలి.

53 రైళ్లు రద్దు..

తుఫాను నేపథ్యంలో అధికారులు ఈ నెల 29వ తేదీ వరకు మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. విశాఖపట్నం మీదుగా వెళ్లే 53 రైళ్లను రద్దు చేశారు. బెంగళూరు నుంచి విజయవాడ మీదుగా హౌరా వెళ్లే రైళ్లు, హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్లే రైళ్లు, పట్నా నుంచి ఎర్నాకుళం వెళ్లే రైళ్లు, సికింద్రాబాద్- భువనేశ్వర్, బెంగళూరు-గౌహతి, ముంబై-భువనేశ్వర్, కన్యాకుమారి-దిబ్రూగఢ్, తంబారం-సంత్రాగచి మధ్య నడిచే రైళ్లను పెద్ద సంఖ్యలో రద్దు చేశారు. 24న బెంగళూరు-హౌరా హంసఫర్ ఎక్స్‌ప్రెస్(22888), భువనేశ్వర్-ముంబై కోణార్క్(11020), భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్(12830), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్(18046), 25న చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ సూపర్ ఫాస్ట్(12829), గుణుపూర్-కటక్ మెము పాసింజర్(08422), భువనేశ్వర్-విశాఖ వందేభారత్(20841), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ(17015), భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి(18463), భువనేశ్వర్-రామేశ్వరం(20896), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్(22883), 26న పూరి-గాంధీధాం(22874), సికింద్రాబాద్-సిలిచర్ (12513), యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్(22884), మంగుళూరు సెంట్రల్-సంత్రాగచ్చి వివేక్ ఎక్స్‌ప్రెస్(22852), బెంగళూరు-కామాఖ్య ఏసీ ఎక్స్‌ప్రెస్(12551), 27న రామేశ్వరం-భువనేశ్వర్(20895), వాస్కోడిగామ-షాలిమార్ అమరావతి (18048), 29న మాల్డా టౌన్-సికింద్రాబాద్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (03430)లను రద్దు చేస్తున్నట్టు వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు.



పులివెందుల సమీపంలో లోయలో పడ్డ ఆర్టీసీ బస్సు

లోయలో పడిన ఆర్టీసీ బస్సు

- 20 మంది ప్రయాణికులకు గాయాలు

పులివెందుల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల-కదిరి ప్రధాన రహదారిలోని లోయలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పడిపోవడంతో 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. పులివెందుల ఆర్టీసీ డిపోకు చెందిన అల్ట్రా పల్లెవెలుగు బస్సు బుధవారం ఉదయం కదిరి నుంచి పులివెందుల వస్తుండగా పట్టణం సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న 30 అడుగుల లోయలో పడింది. ఈ ప్రమాదంలో కండక్టరు సహా విద్యార్థులు, వృద్ధులు 20 మంది గాయపడ్డారు. వారిని పులివెందులలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఓ వృద్ధుడిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. డ్రైవరు అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. డీఎస్పీ మురళీనాయక్, అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

తిరుమల ఘాట్‌లో సుమో బోల్తా

- ఎనిమిది మందికి స్వల్పగాయాలు

తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో బుధవారం ఓ టాటా సుమో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. కర్నూలుకు చెందిన శివ, సంజయ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనం పూర్తిచేసుకుని బుధవారం ఉదయం తిరుమల నుంచి సుమోలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 24వ మలుపు వద్ద వాహనం బోల్తాపడడంతో శివ, సంజయ్‌తో సహా కుటుంబ సభ్యులు, డ్రైవర్ హేమంత్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ తెలిపాడు. కాగా ఈ మలుపు వద్దే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రాణం తీసిన గంజాయి మత్తు

- రాత్రివేళ రైలు పట్టాలపై గంజాయి సేవనం
- వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం



కె.కిరణ్‌కుమార్, ఎస్.యాసీన్ అలీ

పీలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడిన ఇద్దరు యువకుల జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయాయి. రాత్రివేళ రైలు పట్టాలపై గంజాయి సేవించి మత్తులో ఎదురుగా వస్తున్న రైలును తప్పించుకోలేక దానికింద పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పీలేరు పట్టణం పద్మావతినగర్‌కు చెందిన ఎస్.షరాఫత్ అలీ కుమారుడు ఎస్.యాసీన్ అలీ(17), ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన కె.శ్రీనివాసులు కుమారుడు కె.కిరణ్ కుమార్(20) స్నేహితులు. యాసీన్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, కిరణ్‌కుమార్ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ కొంతకాలంగా కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. వీరిద్దరూ గత ఏడాదిగా గంజాయి, మత్తు మాత్రలకు బానిసలయ్యారు. మంగళవారం రాత్రి 10.30 గంటల వరకు ఆర్టీసీ నల్లగుట్ట సమీపంలోని పీలేరు-పులిచెర్ల రైల్వేట్రాక్ వద్ద గంజాయి సేవించారు. అదే సమయంలో నాగర్‌కోయిల్-ముంబై సూపర్‌ఫాస్ట్ రైలు వేగంగా వచ్చి వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో యాసీన్ అక్కడికక్కడే మృతి చెందగా, కిరణ్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కిరణ్‌ను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

ఏనుగు దాడిలో రైతు మృతి

రామకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం పీఎంకే తాండాలో మంగళవారం రాత్రి రెడ్డినాయక్ అనే రైతును ఒంటరి ఏనుగు దాడి చేసి హతమార్చింది. రెండునెలల క్రితం రెడ్డినాయక్ భార్య ప్రమీల అనారోగ్యంతో మృతి చెందింది. తాగుడుకు బానిసైన అతను భార్యను ఖననం చేసిన శ్మశానం వద్దకు వెళ్లి రాత్రి అక్కడే గడిపేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం శ్మశానంలో రెడ్డినాయక్ మృతదేహాన్ని పశువుల కాపర్లు గుర్తించారు. ఒంటరి ఏనుగు దాడి చేయడంతో రెడ్డినాయక్ మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు.

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP16TF4438	MAHINDRA BOLERO PICK UP	2015

AUCTION PLACE : SHRIRAM AUTOMALL INDIA LTD, D.NO:1-438,NEAR NHAI, TOLL PLAZA, TARLUVADA ,PANCHAYATH,ANANDAPURAM MANDAL,VISAKAPATNAM-530052
AUCTION DATE : 24-10-2024
Cont : SHRIRAM FINANCE LIMITED D No:- 27-12-34, BSN REDDY COMPLEX, 3rd Floor, Gudavallivari Street, VIJAYAWADA. Ph: 0866-2579197
9949911574, 9704184786

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP31TD1667	TATA LPK 2518	2012
AP16TH1257	TATA LPT 3118	2016
AP37TF1814	TATA ACE MEGA XL	2017

AUCTION PLACE : SHRIRAM AUTO MALL INDIA LTD., SURVEY NO. 79, MUSTABAD ROAD, KESARAPALLI - 521 102. GANNAVARAM MANDAL, KRISHNA DISTRICT, A.P.
AUCTION DATE :24-10-2024
Cont : SHRIRAM FINANCE LIMITED D No:- 27-12-34, BSN REDDY COMPLEX, 3rd Floor, Gudavallivari Street, VIJAYAWADA. Ph: 0866-2579197
9949911574, 9704184786

విద్యాసాగర్ పిటిషన్‌పై వాదనలు పూర్తి

- రిమాండ్ ఉత్తర్వుల సవాల్‌పై తీర్పు రిజర్వ్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తనకు విధించిన రిమాండ్ ఉత్తర్వులను సవాలు చేస్తూ వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. న్యాయస్థానం తీర్పు రిజర్వ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధ్యమైనంత త్వరగా నిర్ణయాన్ని వెల్లడిస్తామని ప్రకటించారు. సినీనటి కాదంబరి జత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తనకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కుక్కల విద్యాసాగర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు కొనసాగిస్తూ... రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కావన్న పిటిషనర్ వాదనలో అర్థం లేదన్నారు. తన వాదనను బలపరుస్తూ సుప్రీంకోర్టు, పలు హైకోర్టులు ఇచ్చిన తీర్పులను కోర్టు ముందు ఉంచారు. పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. విద్యాసాగర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ... రిమాండ్‌కు ముందు మాత్రమే అరెస్టుకు గల కారణాలను పిటిషనర్‌కు అందజేశారన్నారు. అరెస్టు సమయంలో కారణాలు వివరించినట్లు రిమాండ్ ఆర్డర్‌లో సైతం ప్రస్తావించలేదన్నారు. అరెస్టుకు గల కారణాలు తెలుసుకోవడం నిందితుడి ప్రాథమిక హక్కు అన్నారు. పిటిషనర్ అరెస్టు సమయంలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించకుంటే... రిమాండ్ ఉత్తర్వులు నిలబడవన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు, పలు హైకోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను కోర్టుకు చదివి వినిపించారు. రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్ గురువారం విచారణకు రాబోతుందన్నారు. దానిపై విచారణకు ఒత్తిడి చేయవద్దని సంబంధిత పీపీకి సూచించేలా ఏజీని ఆదేశించాలని కోరారు.

క్యాంటీన్ సబ్‌లీజు టెండర్లపై ఏపీటీడీసీని వివరణ కోరాం

- హైకోర్టుకు నివేదించిన టీటీడీ

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలోని క్యాంటీన్‌ను సబ్‌లీజ్‌కు ఇచ్చేందుకు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) టెండర్లు పిలవడంపై ఆ సంస్థ నుంచి వివరణ కోరామని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఏపీటీడీసీ వివరణ కోసం ఎదురు చూస్తున్నామని వివరించింది. విచారణను వాయిదా వేయాలని అభ్యర్థించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. తిరుమలలో టీటీడీ కేటాయించిన క్యాంటీన్‌ను మరొకరికి సబ్ లీజుకు ఇచ్చేందుకు ఏపీటీడీసీ టెండర్లు పిలవడాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన సురవరం ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

శాఖమూరులో వైసీపీ నేతకు చెక్

- మినుము పంటను తొలగించిన అధికారులు
- పంటలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



శాఖమూరులో సీఆర్డీఏ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న మినుము పంట

తుళ్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 'సీఆర్డీఏ భూముల్లో పాగా' అని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఎక్స్‌కవేటర్‌తో మినుము పంటను తొలగించారు. శాఖమూరుకు చెందిన వైసీపీ నేత ప్రశాంత్ గత ఐదేళ్లుగా 25 ఎకరాల సీఆర్డీఏ భూములను ఆక్రమించి పంట సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా దర్జాగా మినుము పంట వేశాడు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో శాఖమూరు యూనిట్ సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ నాయక్, సిబ్బంది వెళ్లి పంటను తొలగించారు. త్వరలో రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఎవరూ పంటలు వేయవద్దంటూ మైకులో ప్రచారం చేశారు. పంటలు వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇక దరఖాస్తులకు సత్వర పరిష్కారం

- మున్సిపల్ అనుమతులపై సర్కారు ప్రత్యేక దృష్టి
- మంత్రి నారాయణ ఆదేశాలతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు, లేఅవుట్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ, ఏపీ రెరా అనుమతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అన్ని రకాల ఫీజులు చెల్లించి, సరైన డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నిర్ణయం తీసుకున్నారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆదేశాలిచ్చారు. మంత్రి ఆదేశాలతో దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను టౌన్ ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసింది. 9398733100, 9398733101 నంబర్లకు వాట్సాప్ ద్వారా కూడా వివరాలు పంపవచ్చని వెల్లడించారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ విభాగం పనిచేస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం అన్ని రకాల డాక్యుమెంట్లు ఉండి ఫీజు చెల్లిస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని వెల్లడించారు.

కలుషిత నీరే కారణం!

- గుర్ల డయేరియా కేసులకు కారణమదే
- చంపానదీ తీరంలో మురుగు, ఉప్పునీరు
- నది ప్రాంతంలో బహిరంగ మల విసర్జన
- భూగర్భ నీటి మట్టం ఒకేసారి పెరగడంతో తాగునీటి కాలుష్యం.. కమిటీ నివేదిక
- 31 నమూనాల్లో కోలిఫారమ్
- నీటి నమూనాల్లో క్లోరిన్ లేదని వెల్లడి

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'గుర్లలో తాగునీరు విస్తృతంగా కలుషితమైంది. ఈ ప్రాంతంలో డయేరియా వ్యాధి తీవ్రస్థాయిలో ప్రబలడానికి ప్రధాన కారణం కలుషిత తాగునీరే' అని నిపుణుల కమిటీ నివేదికలో పేర్కొంది. గుర్ల నుంచి సేకరించిన 44 నీటి నమూనాల్లో 31 దాంట్లో కోలిఫారమ్‌లు ఉన్నట్లు నిర్ధారణ అయిందని, అక్కడ తాగునీరు ఉపయోగం కాదని వెల్లడించింది. 57 మలం నమూనాల పరీక్షా ఫలితాల ఆధారంగా భూతల, భూగర్భ జలాలు కలుషితమైనట్లు తేలిందని తెలియజేసింది. విజయనగరం జిల్లా గుర్లలో తీవ్రస్థాయిలో డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణాలు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరుగురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం ఆరోగ్య శాఖకు మంగళవారం సమగ్ర నివేదికను అందించింది. పరిశీలనలో భాగంగా నిపుణుల బృందం గుర్ల, కోటగండ్రేడు, నాగులవలస, దమ్మసింగి, కెల్ల తదితర గ్రామాల్లో పర్యటించింది. గుర్ల, ఇతర గ్రామాలకు ప్రధాన నీటి వనరు అయిన చంపానదిలో దహన సంస్కారాలు, జాతరలు, పండుగలు మొదలైన మతపరమైన కార్యకలాపాలు చేస్తున్నారని కమిటీ గమనించింది. నది వెంబడి ఉన్న ప్రాంతాల నుంచి ఎక్కువ డయేరియా కేసులు నమోదయ్యాయని కమిటీ స్పష్టం చేసింది. గుర్ల, పొరుగు గ్రామాలకు నీరు పంప్ చేయడం, సరఫరా చేసే బోర్‌వెల్ నది ఒడ్డునే ఉంది. తాగునీటి పైపులైన్లు డ్రైనేజీ వ్యవస్థ నుంచి పోతున్నాయి. చంపానది తీరం, గుర్ల గ్రామ సమీపంలో మురుగునీరు, ఉప్పునీరు పారుతోంది. దీంతో పాటు ప్రజలు నదీ పరివాహక ప్రాంతం దగ్గర్లోనే బహిరంగ మల విసర్జన చేస్తున్నారని కమిటీ తెలిపింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ ప్రాంతంలో భూగర్భ నీటి మట్టం పెరగడం వల్ల నీటి కాలుష్యం అయిందని కమిటీ గమనించింది. వ్యాధుల వ్యాప్తి నివారణకు అవసరమైన క్లోరినేషన్ పేలవంగా ఉందని అభిప్రాయపడింది. పరీక్షించిన నీటి నమూనాల్లో క్లోరిన్ అవశేషాలేవీ లేకపోవడంపై బృందం ఆందోళన వ్యక్తం చేసింది.

కమిటీ సూచనలు

సంక్రమణ వ్యాధులు రాకుండా, ప్రబలకుండా పరిశుభ్రమైన తాగునీరు, పారిశుధ్యంతో కూడిన వాతావరణం, ఆరోగ్యానుకూల అలవాట్లను పెంపొందించడానికి పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కమిటీ సూచించింది. తాగునీరు ప్రధాన వనరు అయిన చంపానది నీటిని తరచుగా క్లోరినేషన్ చేయాలని, నీటి సరఫరా పైపులకు మరమ్మతులు, నిర్వహణ చేపట్టాలని, డ్రైనేజీ గుండా నీటి పైపులైన్లు వెళ్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని సూచించింది. విజయనగరం భౌగోళిక స్థితి, వాతావరణ పరిస్థితులు, సంక్రమణ వ్యాధుల వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున నమూనాలను పరీక్షించేందుకు వీలుగా ప్రాంతీయ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. నిపుణుల బృందం అందజేసిన నివేదికలోని అంశాలపై మంత్రి సత్యకుమార్ త్వరలో ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి వైద్యులతో సమీక్షించనున్నారు.

జీతాలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌తో లింకు

- అక్టోబరు జీతంలో కోతకు ఆదేశాలు
- ఆందోళనలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు
- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్‌కు వర్తింపు

గుంటూరు సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల నెత్తిపై పిడుగుపడినంత పనయింది. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలకు ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం)తో లింకు పెట్టారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు ఆధారంగానే అక్టోబరు జీతాలు జమ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జిల్లాలకు సమాచారం అందించారు. నేషనల్ హెల్త్ మిషన్‌తోపాటు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులకు కూడా ఇదే ప్రాతిపదికన జీతాల బిల్లులు చేయాలని ఆదేశించారు. ఈమేరకు ఈ నెల 16న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక మెమో జారీ చేసింది. నేషనల్ హెల్త్ మిషన్‌లో 10,032 మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, వందల సంఖ్యలో డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, సెకండ్ ఏఎన్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. తాజా నిర్ణయంతో వారందరికీ అక్టోబరు జీతంలో భారీగానే కోత పడనుంది. జగన్ ప్రభుత్వం చివరి దశలో వైద్య, ఆరోగ్య శాఖలోని ఉన్నతాధికారులు ఉద్యోగుల జీతాలకు ఎఫ్ఆర్ఎస్‌తో ముడి పెట్టాలని చూశారు. ఈ విషయం వివాదాస్పదం కావడంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. జీతాలకు ఎఫ్ఆర్ఎస్ లింకు పెట్టటంపై నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు సచివాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ చీఫ్ అకౌంట్ ఆఫీసర్ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ స్టాఫ్‌గా పరిగణించే మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల జీతాలకు ఎఫ్ఆర్ఎస్ లింకు కక్ష సాధింపు కిందకే వస్తుందని రాష్ట్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల రాష్ట్ర సంఘం వినతిపత్రంలో పేర్కొన్నది.

108, 104 ఉద్యోగులతో సీఈవో చర్చలు

- జీతాలు వెంటనే ఇవ్వాలని అరబిందోకు ఆదేశం

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆటంకం లేకుండా సేవలను కొనసాగించాలని 108 అంబులెన్స్, 104 వాహనాల ఉద్యోగులను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషా ఆదేశించారు. 108 అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఉద్యోగులు, అరబిందో యాజమాన్యాన్ని చర్చలకు పిలిచారు. బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో ఉద్యోగులు, యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం వైపు నుంచి ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు వెంటనే బకాయిలు విడుదల చేయాలని అరబిందో యాజమాన్యాన్ని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సర్వీస్ ప్రొవైడర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు 89.52 లక్షల సాయం

- ముఖ్యమంత్రి సహాయనిధికి పలువురు దాతల విరాళాలు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి దాతల విరాళాలు కొనసాగుతున్నాయి. అమరావతి సచివాలయంలో బుధవారం పలువురు దాతలు సీఎం చంద్రబాబును కలిసి చెక్కులు అందజేశారు. పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు రూ.89,52,452, కృష్ణవేణి డిగ్రీ కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు రూ.5 లక్షలు, సోమరాజు భూపతిరాజు రూ.5 లక్షలు, ప్రైవేట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.5 లక్షలు, పి.వెంకట సుబ్బారావు రూ.5లక్షలు, నంద్యాల ప్రజల తరఫున మంత్రి ఫరూక్ రూ.4.10 లక్షలు, పి.సత్యనారాయణ రూ.2 లక్షలు, కామినేని మల్లికార్జున రూ.1.55 లక్షలు, ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రూ.1.5 లక్షలు, నిహారికా ఏజెన్సీస్ రూ.1.4 లక్షలు, న్యూక్లియస్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ రూ.1.10 లక్షలు, శ్రీఆంధ్ర రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రూ.1,01,116, ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.లక్ష, నాగేశ్వరరావు అవధాన రూ.లక్ష, ఎస్.గోవర్ధన్‌రెడ్డి రూ.లక్ష విరాళం ఇచ్చారు. మరికొందరు దాతలు వారికి తోచిన సాయం అందజేశారు.

మరణానంతరం ఆస్తి దానం

- స్వచ్ఛంద సంస్థలకు రూ.61 లక్షల చెక్కులు పంపిణీ
- విశ్రాంత ఉద్యోగిని వీలునామాను అమలు చేసిన కుటుంబసభ్యులు

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్టా రాజ్యలక్ష్మి తన మరణానంతరం ఆస్తులను స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసేలా వీలునామా రాసి మరణించడంతో కుటుంబసభ్యులు అమలు చేశారు. బ్యాంక్ ఖాతాలో దాచుకున్న రూ.61 లక్షలకు సంబంధించి చెక్కులను సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి సమక్షంలో ఆమె కుటుంబసభ్యులు బుధవారం ఆయా సంస్థలకు అందజేశారు. వీలునామా ప్రకారం అమ్మ చారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, షిరిడీ సాయి సేవా ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, శిష్టా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటు చేసుకున్న మెమోరియల్ ట్రస్ట్‌కు రూ.36 లక్షలను రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేశ్, చిట్టే వెంకట్‌లకు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి తీసుకున్న సంచలనాత్మక నిర్ణయం ఇతరులకు స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా సజీవంగా ఉంటారని కొనియాడారు.

వికాస్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్
విస్సన్నపేట
B.Ed M.Ed
సీట్లు కలవు.
Eligibility: Any Degree, B.Tech కంప్లీట్ అయిన వారూ చేయవచ్చు.
94924 85802

శ్రీ ఈశ్వరస్వామి దేవాలయం
రేగడగూడూరు గ్రామము, వెలుగోడు మండలము, నంద్యాల జిల్లా.
e-Procurement Tender NIT No.COE/1295/2022-45, Dt:25-01-2023
ముఖమండపం పునఃనిర్మాణము, విమానగోపురం నిర్మాణము, ధ్వజస్తంభ ప్రతిష్టాపన పనుల కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు సం/- కార్యనిర్వహణాధికారి

కార్యదర్శి కార్యాలయం
ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
డి.నం. 12-467-9, మోక్ష సాయి ప్లాజా, సర్వీస్ రోడ్, తాడేపల్లి, గుంటూరు జిల్లా-522501
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
APSWRE - 17021/13/2024-PROC, తేది: 22.10.2024
డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులాల కొరకు 1) PT డ్రెస్సుల సరఫరా (టి-షర్ట్, ప్యాంట్ మరియు షార్ట్ కలిగిన సెట్) 2) PT షూలు & సాక్సుల సరఫరా 3) స్పోర్ట్స్ మరియు గేమ్స్ మెటీరియల్స్ సరఫరా 4) షీల్డ్‌లు (మెమెంటోలు & ట్రోఫీలు) మరియు సర్టిఫికెట్ల సరఫరా చేయడానికి. APSWRI సొసైటీ వారు అర్హత గల మరియు నమోదిత సరఫరా చేయు సంస్థల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా సంక్షిప్త టెండరు ప్రకటనను కోరుచున్నారు. పాల్గొనాలనుకునే బిడ్డర్లు https://tender.apeprocurement.gov.in లో నమోదు చేసుకొనవలెను మరియు తమ బిడ్లను దాఖలు చేయగలరు. బిడ్డర్లు టెండరు డాక్యుమెంట్‌ను 24.10.2024న ఉ. 11.00 గం.ల నుండి ఏపి ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా యాక్సెస్ చేయగలరు. బిడ్ల స్వీకరణకు చివరి తేది: 30.10.2024న సా. 04.00 గం.ల. లోగా.
DIPR RO. No.3247 PP/CL/ADVT/1/1/2021-22, తేది. 23.10.2024 సం/- కార్యదర్శి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాంబు భయాలు

భారతీయ విమానాలకు ఒక్కసారిగా పెరిగిన బాంబు బెదిరింపు కాల్స్ మన వ్యవస్థలకు పెను సవాల్ విసురుతున్నాయి, మన సామర్థ్యానికి అగ్నిపరీక్ష పెడుతున్నాయి. వందకుపైగా బెదిరింపు కాల్స్‌తో పౌర విమానయానరంగం అప్పటికే వొణికిపోతుండగా, ఒక్క మంగళవారం నాడే మరో యాభై బెదిరింపులు కాల్స్ రావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. బాంబు బెదిరింపు కాల్స్ చేసినవారిని వదిలేది లేదని, జీవిత ఖైదు విధించేట్టుగా చట్టాలు చేస్తామని, వారిని జీవితంలో విమానం ఎక్కబోనివ్వమని పౌర విమానయానమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గట్టిగా బెదిరించినా ఈ ఉధృతి తగ్గలేదు. వారం రోజుల్లో మొత్తం 169 విమానాలకు బెదిరింపులు రావడమే కాక, దేశీయ సర్వీసులతో పాటు అంతర్జాతీయ నగరాలకు వెళ్ళే విమానాలకు కూడా అవి విస్తరించడం పెను సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ఒకపక్కన ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నా, మెయిల్ ద్వారా హెచ్చరికలు వస్తున్నాయంటే, ఈ దుష్టచేష్టలకు పాల్పడేవారు బాగా తెగించారని అర్థం. ఒక పద్ధతి ప్రకారం సదరు శక్తులు ఈ బెదిరింపులకు పాల్పడుతున్నప్పటికీ, తేలికగా తీసుకొనే పరిస్థితి లేదు. చివరకు ఈ మెయిల్, సోషల్ మీడియా పోస్టుల్లో వచ్చే హెచ్చరికలకు విలువేమిటని కూడా ఊరుకోగలిగే అవకాశం లేదు. ఫలానా విమానంలో బాంబు ఉన్నదనో, దానికి ముప్పు ఉన్నదనో ఒక సమాచారం ఏ రూపంలో, ఎక్కడనుంచి అందినా దానిని నిశితంగా పరిశీలించాల్సిందే, విమానాన్ని క్షుణ్ణంగా గాలించి ఏ ప్రమాదమూ లేదని నిర్ధారించుకున్నాక ఎగరనివ్వాల్సిందే. ఈ కారణంగానే ఎగురుతున్న విమానాలను అర్థంతరంగా దింపాల్సివచ్చింది, ఎగరాల్సినవాటిని గంటల పాటు నిలిపివేయాల్సివచ్చింది. ఒక కాల్ లేదా ఒక హెచ్చరిక సందేశంతో దేశంలోని దాదాపు ప్రతీ ఎయిర్‌లైన్స్‌నీ దుండగులు భయపెట్టారు, బెదిరించారు. సదరు సంస్థల వ్యవస్థలన్నీ తీవ్రంగా భయపడ్డాయి, హడావుడి పడ్డాయి, ఆర్థికంగానే కాదు, పలురకాలుగా ఇబ్బందిపడుతున్నాయి. చేపట్టవలసిన చర్యలన్నీ పూర్తయితే కానీ విమానం కదిలేందుకు అవకాశం లేదు. ఈ బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తుల లేదా సంస్థల లక్ష్యం ఏమిటన్నది అటుంచితే, ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్నవారిని జైల్లో పెడతామనో, రాబోయే రోజుల్లో విమానం ఎక్కబోనివ్వమనో హెచ్చరించినంత మాత్రాన ఫలితం ఉండబోదని ఇప్పటికే తేలిపోయింది.

ప్రభుత్వ విభాగాలు అనేకం రంగంలోకి దిగాయి, దోషులను గుర్తించేందుకు యథాశక్తి ప్రయత్నిస్తున్నాయి. బెదిరింపు సందేశాలు పుట్టింది ఎక్కడో, ద్రోహులెవ్వరో కనిపెట్టడం వేరు, వారిని ఎక్కడనుంచో ఇక్కడకు పట్టుకురావడం వేరు. ఒప్పందాలు, అవగాహనలు లేని దేశాలతో, సంయుక్త విచారణకు సహకరించనివారితో వ్యవహరించడం మరీ కష్టం. అయితే, ఒక్కసారిగా ఉధృతమైన ఈ బెదిరింపు సందేశాల వెనుక ఉన్నది ఎవరో అల్లరిచిల్లర వ్యక్తులు కారని మాత్రం రూఢీగా చెప్పవచ్చు. వారు తమ లొకేషన్ కనిపెట్టలేని రీతిలో, ఎవరికీ చిక్కని అత్యాధునిక సాంకేతిక విధానాల్లో ఈ పాడుపనిచేస్తున్నందున మనదేశానికి హానిచేయాలన్న వారి కసి స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ ఎయిరిండియా విమానాలు లక్ష్యంగా చేసిన ప్రకటన, ఖలిస్తానీ శక్తులను వెనకేసుకొస్తున్నందుకు కెనడాతో పతాకస్థాయికి చేరిన వైరం ప్రస్తుత పరిణామాల నేపథ్యంగా చాలామందికి కనిపిస్తున్నది. ఒక్కో బెదిరింపు కాల్‌తో సదరు విమానయాన సంస్థకు మూడు నుంచి నాలుగుకోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నదని అంచనా. ఇక, ప్రయాణీకులు అనుభవించిన ప్రాణభయం, మానసిక వేదన, ఇతరత్రా కష్టనష్టాలు వెలకట్టలేనివి. ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నవారిని పట్టుకోవడం, శిక్షించడం ఎప్పటికైనా జరిగితీరాలి. ఎంతకాలం పట్టినా, ఎంత ఖర్చయినా సరే, ఆ ద్రోహులను వదిలిపెట్టకూడదు. భవిష్యత్తులో ఈ తరహా బెదిరింపుకాల్స్‌తో మనను ఎవరూ భయపెట్టలేని రీతిలో నిర్దిష్టమైన వ్యవస్థలను రూపొందించుకోవాలి. విమానాలను మరింత క్షుణ్ణంగా పరిశీలించి, భద్రంగా మార్చడం, ప్రయాణీకులను, వారి సామగ్రిని మరింత శ్రద్ధగా పరీక్షించడం, ఆయా వ్యవస్థలనూ, విధానాలను లోపరహితంగా తీర్చిదిద్దుకోవడం వంటివి చేయగలిగినప్పుడు, ఒక ఉత్తుత్తి బెదిరింపునకు వెంటనే ఉలిక్కిపడి విమానాన్ని నేలమీదకు దించేయాల్సిన అవసరం ఉండదు.

అధర్మంపై మౌనమే అసలైన చెరసాల

'ఈ అంధకారం శాశ్వతమైనది కాదు. రేపటి ఉషోదయంతో ఈ చీకటి అదృశ్యమవుతుంది'- ఆత్మవిశ్వాసం ప్రతిబింబిస్తున్న ఈ మాటలు వసంత సాయిబాబా వి. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా ఆంగ్ల పుస్తకం 'వై డు యు ఫియర్ మై వే సో మచ్? పొయెమ్స్ అండ్ లెటర్స్ ఫ్రమ్ ప్రిజన్' ప్రతి నొకదాన్ని సెప్టెంబర్ 18, 2022న వసంత నుంచి నేను కొన్నప్పుడు ఆమె ఆ మాటలు రాశారు.

ప్రొఫెసర్ సాయిబాబాను వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశంగా నాకు లభించలేదు. అయితే సాయిబాబా జైలు కవితలు, లేఖల నుంచి ఆయన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. విజయదశమి నాడు ఆయన మరణం, జైలు నుంచి నిర్దోషిగా విడుదలైన కొద్ది నెలలకే సంభవించడం నన్ను ఎంతో బాధాతప్త హృదయుడిని చేసింది.

ఐదేళ్ల చిరుప్రాయంలోనే పోలియో వ్యాధి కారణంగా సాయిబాబా నడిచే సామర్థ్యాన్ని కోల్పోయారు. జీవితం విసిరిన ఎన్నో సవాళ్లు, సమస్యలను ఆయన చిన్ననాటి నుంచే ఎంతో ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నారు. పదవ తరగతి సంవత్సరాంతర పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని స్వాయత్తం చేసుకోవడం అందుకొక మొదటి నిదర్శనం.



భిన్న భావజాలాన్ని అనుసరిస్తున్నవారు, రాజకీయ అసమ్మతివాదులు, అంతరాత్మకు నిబద్ధులయి ఉండేవారి పట్ల రాజ్యం ఎలా వ్యవహరించాలి? భావాల రంగంలో ఆ చైతన్యశీలురుతో పోరాడటమా లేక కఠోర చట్టాలను వారికి వ్యతిరేకంగా ప్రయోగించడమా? జైళ్లలో ఖైదీలు, భిన్న రాజకీయ అభిప్రాయాలు కలవారిపట్ల రాజ్య వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందనేది మన నాగరికత ఔన్నత్యం, శక్తికి ఒక నిజమైన పరీక్ష.

జీవితం ఎన్ని కష్టనష్టాలకు గురిచేస్తున్నప్పటికీ సాయిబాబా తన నవయవ్వన కాలం నుంచీ ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆదివాసీల, దళితుల, మహిళల, మైనారిటీల హక్కుల కోసం పోరాడారు. ప్రజా పోరాటాలు, సామాజిక ఉద్యమాలు సాయిబాబాకు పాదాలు అయి, ఆయన్ని ముందుకు నడిపించాయని వసంత అన్నారు. ఉన్నత విద్యాభ్యాసానంతరం ఢిల్లీ విశ్వవిద్యాలయ రామ్‌లాల్ ఆనంద్ కళాశాల ఇంగ్లీష్ భాషా, సాహిత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అయ్యారు. సాయిబాబా కాళ్లు చలన రహితమైనా ఆయన చేతులే ఆయన శక్తి. జైలులో అధికారులు ఆయన ఆరోగ్యాన్ని అమానుషంగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఆయన చేతులు కూడా శక్తి హీనమయ్యాయి.

జైలు జీవితాన్ని తట్టుకుంటూ తన ప్రియమైన విద్యార్థులకు, సహచర అధ్యాపకులకు రాసిన ఒక లేఖలో ప్రొఫెసర్ సాయిబాబా ఇలా పేర్కొన్నారు: 'నాకు తెలిసిన జీవితమంతా విద్యా ప్రాంగణాలలోనే నివసించాను; జ్ఞానం, అనురాగం, స్వేచ్ఛను అన్వేషిస్తూ బోధనా విధులను నిర్వహించాను. కొద్దిమందికి మాత్రమే ఉండే స్వేచ్ఛ అసలు స్వేచ్ఛే కాదని ఆ అన్వేషణా ప్రస్థానంలో నేను నేర్చుకున్నాను'.

అసత్యారోపణలు, తప్పుడు తీర్పు కారణంగా ప్రొఫెసర్ సాయిబాబాను 2021లో అన్యాయంగా అధ్యాపక ఉద్యోగం నుంచి తొలగించారని వసంత బాధపడింది. సరైన చికిత్స చేయించుకునేందుకు జైలు అధికారులు ఆయనకు పదే పదే అనుమతి నిరాకరించారు. బెయిల్ మంజూరు చేయడానికి న్యాయస్థానాలు తిరస్కరించాయి.

పది సంవత్సరాలపాటు అమానుష జైలు జీవితంలో కఠోరమైన ఏకాంత వాసం గడిపినప్పటికీ, ఆరోగ్యం ఎంతగా క్షీణించిపోయినప్పటికీ ఆ కాలంలో ఆయన సృజించిన కవితలలో అసాధారణ ఆత్మవిశ్వాసం, ఆశాభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వసంతకు పంపిన ఒక కవితలో సాయిబాబా ఇలా చెప్పారు: 'నీ స్వప్నాల గవాక్షాలను మూసివేయవద్దు. ఒక సుడిగాలిలో నిన్ను చూడడానికి వస్తున్నాను'. 26 అక్టోబర్ 2017న వసంతకు పంపిన మరొక కవితలో ఆయన ఇలా అన్నారు: 'నేను చనిపోయేలా ఏం చేయాలో/ వాళ్లకు తెలియడం లేదు/ ఎందుకంటే/ నాకు మొలకెత్తే గడ్డి సవ్వడులు/ చాలా ఇష్టం'.

జైలు జీవితంలో సాయిబాబా ఎదుర్కొన్న బాధలు మాటల్లో వ్యక్తం చేయలేనివి. తెలుగు (ఆయన మాతృభాష)లో చదివేందుకు, రాయడానికి అధికారులు అనుమతించలేదు. వసంతకు ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం లేదు. భార్యాభర్తలు ఇరువురికీ అదొక బాధాకరమైన అనుభవం. ఇద్దరు మనుషులు అందునా జీవనసహచరులు తమ ఆత్మీయ భాషలో మాట్లాడుకోవడానికి అనుమతించకపోవడం ఎంత అమానుషం! నిజానికి సాహిత్యమే వసంత, సాయిబాబాలను సన్నిహితం చేసింది. ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పరిచింది. ఉన్నతాదర్శాలతో సహజీవనం చేసేందుకు వారిని ప్రేరేపించింది. ఇరువురూ ఠాగూర్, ప్రేమ్‌చంద్, పెరియార్, శరత్, చలం, శ్రీశ్రీ, కొకు, కారా, రంగనాయకమ్మ సాహిత్యాన్ని చదివారు, స్ఫూర్తి పొందారు. కుల మత అంతరాలు, ధనిక- పేద, స్త్రీ -పురుష అసమానతలు లేని సమసమాజాన్ని స్వప్నించారు.


విప్లవ కవి వరవరరావును ఉద్దేశించి రాసిన ఒక కవితలో అన్యాయాలు చెలరేగుతున్నప్పుడు వాటిని ఎదిరించడానికి బదులు ప్రజలు తమకుతాముగా మౌనం పాటించడం పట్ల సాయిబాబా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధర్మంపై ప్రజల స్వచ్ఛంద మూకీ భావమే అసలైన చెరసాల అని ఆయన అభివర్ణించారు. దురదృష్టకరమైన ఈ లోక రీతిని ఆయన ఎలా నిరసించారో చూడండి: 'కొంత మౌనం బలవంతంగా విధించింది. మిగతా మూకీ భావం అంతా స్వయంగా పాటిస్తున్నదే. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై నిషేధం కొంత ఆదేశించబడింది. మిగతాది అంతా స్వయంగా ఆచరిస్తున్నదే. మన చుట్టూ ఉన్న ఈ సాలెగూడు పరిస్థితుల్లో వ్యక్తమవుతోన్న భయం అధికారంలో ఉన్న వారి గురించి కాదు. అది నోరు లేని అమాయకుల ఆవేదనలు వినిపించడానికి భయపడుతున్న గొంతుకలలోని భయం. అది నైతిక దుర్బలత్వం. అది ఒక నాగరికత దురహంకారం. స్వేచ్ఛాయుత సమాజం కోసం మనం ఉమ్మడిగా చేసిన పోరాటాల విస్మరణ అది'.

తాను, తన భార్య వసంత 'పేదల హక్కుల కోసం ప్రముఖం కాని మార్గాలలో పోరాడుతున్న సామాన్యులం. మరి బ్రహ్మాండమైన అధికారాలు గల రాజ్య వ్యవస్థ మా ఆశాభావాలు, మా అనురాగాలు, మా స్వప్నాలకు ఎందుకు భయపడుతుంది' అని ప్రొఫెసర్ సాయిబాబా విస్మయం వ్యక్తం చేశారు. భిన్న భావజాలాన్ని అనుసరిస్తున్నవారు, రాజకీయ అసమ్మతివాదులు, అంతరాత్మకు నిబద్ధులయి ఉండేవారి పట్ల రాజ్యం ఎలా వ్యవహరించాలి అన్నది ఒక ప్రధానాంశం. అదొక చిక్కు ప్రశ్న కూడా. భావాల రంగంలో ఆ చైతన్యశీలురుతో పోరాడటమా లేక కఠోర చట్టాలను వారికి వ్యతిరేకంగా ప్రయోగించడమా? జైళ్లలో ఖైదీలు, భిన్న రాజకీయ అభిప్రాయాలు కలవారిపట్ల రాజ్య వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందనేది మన నాగరికత ఔన్నత్యం, శక్తిశీలతకు ఒక నిజమైన పరీక్ష.

• డాక్టర్ వైఎస్ఆర్ మూర్తి
వైస్ ఛాన్సలర్, అస్సాం రాయల్ గ్లోబల్ యూనివర్సిటీ

'అధికార' చరిత్రకు పరిశోధక చికిత్స

భన్వర్ మేఘ్వంశీ. రాజస్థాన్‌కు చెందిన రచయిత, పాత్రికేయుడు, దళితోద్యమ కార్యకర్త. ఈయన రాసిన ఆత్మకథనాత్మక రచన తెలుగు అనువాదం "నేనెందుకు హిందువును కాలేకపోయాను?" ఆవిష్కరణ ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలలోను జరిగింది. తండ్రి హెచ్చరికను పెడచెవిన పెట్టి మరీ ఆర్ఎస్ఎస్‌లో చేరి, ఒకసారి అయోధ్య కరసేవకు కూడా వెళ్లిన మేఘ్వంశీ, సంఘ్‌లో కులవివక్ష కారణంగా తప్పుకున్నారు. హైదరాబాద్ 'లామకాన్'లో జరిగిన కార్యక్రమంలో మేఘ్వంశీ సంఘ్‌లో తన అనుభవాలను స్వయంగా వివరించారు. ఆర్ఎస్ఎస్ స్థాపన 1925లో జరిగితే, మూడేళ్లకే అది రాజస్థాన్‌కు వ్యాపించిందని, అంబేడ్కర్ వాదం మాత్రం 1990ల దాకా రాలేదని ఆయన చెప్పారు. ఆ సందర్భంగా, మేఘ్వంశీని ఒక ప్రశ్న అడిగాను: అంబేడ్కర్ ప్రభావం లేకపోతే, సంఘ్ దళితులకు మేలుచేయదని, అందులో చేరవద్దని మీ నాన్న మీకు సలహా ఎట్లా ఇవ్వగలిగారు? ఆయనకు ఆ అవగాహన ఎట్లా కలిగింది? అందుకు మేఘ్వంశీ సమాధానం, "అంబేడ్కర్ ప్రభావం లేదు కానీ, గాంధీ ప్రభావం ఉన్నది. కాంగ్రెస్ చేపట్టిన సంస్కరణాత్మక హరిజనోద్ధరణ కార్యక్రమాల ప్రభావం, రాజ్యాంగం ద్వారా వచ్చిన సంక్షేమం, హక్కులు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారా అమలులోకి రావడం, ఈ కారణాల వల్ల రాజస్థాన్ దళితులు ఇటీవలి కాలం దాకా కాంగ్రెస్ వైపే ఉంటూ వచ్చారు." దళితులు ఎక్కడా ఎదురుచూపుల్లో మిగలలేదు. అందిన ఆధారంతోనే అడుగులు వేశారు.



akbar

చెల్లాచెదరుగా ఉన్న తెలంగాణ దళిత చైతన్య కథనాలను కఠోరశ్రమతో పోగుచేసి, మిగిలిన వ్యక్తులతో మాట్లాడి గొప్పకృషి చేసినవాడు సంగిశెట్టి శ్రీనివాస్. అలనాటి తెలంగాణ వికాసోద్యమంలో పరిశోధకుడిగా ఆదిరాజు వీరభద్రరావు ఎంతటి పని చేశారో, సంగిశెట్టి శ్రీనివాస్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పరిశోధకుడిగా అంతటి పాత్ర నిర్వహించారు. ఆయన "తెలంగాణ దళితోద్యమ చరిత్ర" ఆధునిక తెలుగు సామాజిక చరిత్రలన్నిటిలోనే ప్రత్యేకమైనది, విశిష్టమైనది. దళితుల సాంప్రదాయ వృత్తులు, వారి కళారూపాలు, ఉద్యమాలలో దళితుల స్థానం, దళితుల సొంత ఉద్యమాలు, వీటన్నిటినీ సంగిశెట్టి శ్రీనివాస్ ఈ పుస్తకంలో విపులంగా చర్చించారు. ఈ పుస్తకంలోని బలం, కేవలం చరిత్ర పుస్తకం కావడం కాదు. చరిత్రలు విస్మరించిన చరిత్ర పుస్తకం కావడం.

ఆధునిక భారతదేశ చరిత్ర ఎంత అసమగ్రం అంటే, భౌగోళికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా కూడా కొన్ని స్థలాలు, శ్రేణుల ప్రయాణం ఇంకా అక్షరాలకు ఎక్కలేదు. మనం చరిత్ర అని చదువుకుంటున్నదానిలో ఎన్నో ఖాళీలు, విస్మరణలు, అగాధాలు! జాతీయోద్యమచరిత్ర అంతా ఉత్తరాది పురాణమే తప్ప, దక్షిణాదికి చెందిన నేతల, కార్యకర్తల, ప్రజల కథనాలే కనిపించవు! అట్లాగే, సామాజికంగా అట్టడుగున ఉన్న ప్రజాశ్రేణులు స్వాతంత్ర్య పోరాటానికి, జాతీయోద్యమవిలువలకు చేసిన దోహదాల స్మరణ ఏ దినోత్సవాలలోనూ వినము. స్థానికంగా పుట్టి పెరిగి ప్రభావశీలంగా మారిన ఉద్యమాల గురించి పెద్దగా చెప్పుకోము. గాంధీ 'హరిజన' అంశాన్ని జాతీయోద్యమానికి కీలకంగా పరిగణించకముందే, దేశంలోని దళితులకు ఆరాధ్య నాయకుడిగా, ఆశాజ్యోతిగా అంబేడ్కర్ కనిపించకముందే, దేశవ్యాప్తంగా సామాజిక ప్రజాస్వామ్యవాదానికి బీజాలు పడ్డాయని గ్రహించము.

సామాజికోద్యమాల చరిత్రకారుడు జంగం చిన్నయ్య రాసిన "ఆధునిక భారత నిర్మాణానికి దళితుల దోహదం" (దళిత్స్ అండ్ మేకింగ్ ఆఫ్ మోడర్న్ ఇండియా) అన్న పుస్తకం, కులనిర్మూలనా భావాల శతాబ్దాల చరిత్రను వివరిస్తూ, భారతదేశంలో ఈ చైతన్యం వలసవాద పూర్వదశకు, అనంతరదశకు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నదని అంటారు. భారతదేశంలో ఆధునికత వలసపాలన ఫలితమేనా, స్థానికంగా మూలాలు లేవా అనే ప్రశ్నకు, చిన్నయ్య ఈ రూపంలో సమాధానం ఇచ్చారు. భారతదేశంలో కులనిర్మూలన, కులవ్యతిరేక భావాలకున్న సుదీర్ఘచరిత్రను ఆధునికతా ప్రయాణంలో భాగంగా పూర్వోత్తర వలసవాద మేధావులు పరిగణించకపోవడం అన్యాయం. చిన్నయ్య పుస్తకం జాతీయోద్యమ అధికారిక కథనాలు మరుగుపరచిన మరో చరిత్ర కథనాన్ని ఆవిష్కరించింది. సామాజిక సమానత్వాన్ని స్వాతంత్ర్యానికి ఒక ముందస్తు షరతుగా చేయడం ద్వారా దళిత ఉద్యమం జాతీయవాదానికి గొప్ప చేర్పు ఇచ్చిందని ఆ పుస్తకం సూచిస్తుంది. హిందూ శిష్ట వర్గాల జాతీయవాదానికి ప్రతివాదాన్ని నిర్మించి, ముందుకు తీసుకువెళ్లినవాడిగా బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను చిన్నయ్య పేర్కొంటారు. అదే సమయంలో తెలుగు ప్రాంతాలలో, స్థానికంగా ఎదిగిన దళిత నాయకత్వం గురించి, నాటి రాజకీయాలలో వారి ప్రమేయం గురించి వివరంగా పేర్కొంటారు. అంబేడ్కర్ కంటె ముందే, అంబేడ్కర్ ప్రభావం సోకక ముందే, అనేక మంది దళిత సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా కార్యక్షేత్రంలో ఉన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని తమ వ్యక్తీకరణను విస్తరించుకుంటూ వెళ్లారు. దేశవ్యాప్తంగా అట్లా ఎదిగిన పాయలన్నీ అనివార్యంగా, సహజంగా అంబేడ్కర్ మహానదిలో కలిసిపోయాయి. అటువంటి పాయలలో ఒకటి ఆది హిందూ/ ఆది ఆంధ్ర ఉద్యమం. నాటి హైదరాబాద్ రాజ్యంలో ఆ పతాకాన్ని చేతబట్టి, తన ప్రభావాన్ని బ్రిటిష్ ఆంధ్రలో కూడా విస్తరించినవాడు భాగ్యరెడ్డి వర్మ. భాగ్యరెడ్డి ఉద్యమం గురించి చెప్పడమే కాకుండా, ఆయన వైఖరులను విశ్లేషించారు చిన్నయ్య. హిందూ సంస్కర్తల కార్యప్రణాళికకు లోబడి పనిచేసి, వారి గుర్తింపును పొందినవాడిగా భాగ్యరెడ్డి వర్మను చిన్నయ్య వ్యాఖ్యానించారు.


■ కె. శ్రీనివాస్

సందర్భం

విడిగా తను ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక శ్రేణితో మాత్రమే పనిచేయకుండా, ఆనాటి హైదరాబాద్ సమాజంలో ఉన్న శిష్ట సంస్కర్తలతో కలసి భాగ్యరెడ్డి ముందుకు నడిచారు. ఆ క్రమంలో ఆయన అనేక అవమానాలు, ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నారు. నిజాం పాలన కావడం వల్ల, ప్రభుత్వం నుంచి దళితులకు లభించే సానుకూలపరిగణనను వినియోగించుకుంటూ, ఆ నాటి నగర ప్రముఖులలో ఒకరిగా భాగ్యరెడ్డి ఎదిగారు. 1917లో విజయవాడలో జరిగిన చరిత్రాత్మక ఆదిమాంధ్ర మహాసభకు భాగ్యరెడ్డి అధ్యక్షుడిగా ఆహ్వానితులయ్యారు. తెలుగులో మొట్టమొదటి మహానవల 'మాలపల్లి'లో ఒక పాత్రగా నిలిచినప్పటికీ, భాగ్యరెడ్డివర్మకు అనంతర కాలంలో తెలుగువారి సామాజిక చరిత్రలో పెద్ద స్థానం లభించలేదు. 1938లో మరణించిన భాగ్యరెడ్డి స్మృతి పూర్తిగా అణగారిపోకుండా ఆయన కుటుంబం, ఉద్యమసహచరులు కాపాడుతూ వచ్చారు కానీ, ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం, దళిత రాజకీయాలతో సహ అన్నీ మారిపోయాయి. 1985 తరువాత ఉమ్మడి తెలుగురాష్ట్రాలలో దళిత చైతన్యం వెల్లువెత్తింది కానీ, ఒకనాటి నైజాము రాజ్యంలో గొప్ప సంస్కర్తగా, దళిత కార్యకర్తగా నిలిచిన భాగ్యరెడ్డికి రావలసిన గుర్తింపు రాలేదు. భాగ్యరెడ్డి వర్మ, అరిగే రామస్వామి, బి.ఎస్. వెంకట్రావు, శ్యామ్‌సుందర్ వంటి వారితో కూడిన హైదరాబాద్ దళిత ఉద్యమ ప్రస్థానాన్ని చరిత్రీకరించిన పి.ఆర్. వెంకటస్వామి పుస్తకం "అవర్ స్ట్రగుల్ ఫర్ ఎమాన్సిపేషన్" దశాబ్దాలపాటు అలభ్యంగా మసకబారిపోయింది. తెలంగాణ మలిదశ ఉద్యమం అందుకుంటున్నవేళ, పరిశోధించి, విస్మృత చిహ్నాల స్ఫూర్తిని పునరుద్ధరించాలన్న సంకల్పం వల్ల భాగ్యరెడ్డి ప్రధానకథనాలలోకి రాసాగారు. చెల్లాచెదరుగా ఉన్న తెలంగాణ దళిత చైతన్యకథనాలను కఠోరశ్రమతో పోగుచేసి, మిగిలిన వ్యక్తులతో మాట్లాడి గొప్పకృషి చేసినవాడు సంగిశెట్టి శ్రీనివాస్. అలనాటి తెలంగాణ వికాసోద్యమంలో పరిశోధకుడిగా ఆదిరాజు వీరభద్రరావు ఎంతటి పని చేశారో, సంగిశెట్టి శ్రీనివాస్ పాతికేళ్ల కిందట మొదలయిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పరిశోధకుడిగా అంతటి పాత్ర నిర్వహించారు. తెలంగాణ జర్నలిజం చరిత్ర, కథాసాహిత్య చరిత్ర, అనేక జీవిత చరిత్రలు, ఆంధ్ర ప్రాంత, అగ్రవర్ణ రచయితలతో సహ అందరి అలభ్యరచనల సేకరణ, చేసిన సంగిశెట్టి ఇప్పుడు, బహుజన సాహిత్యం మీద ప్రత్యేకంగా గురిపెట్టారు.

భాగ్యరెడ్డి వర్మ కుమారుడు ఎం.బి. గౌతమ్ రాసిన 'భాగ్యోదయం', గెయిల్ ఆమ్ వెట్ రాసిన "దళిత్స్ అండ్ ది డెమొక్రాటిక్ రివల్యూషన్", అబ్బసాయిలు రాసిన "దళిత్ లీడర్‌షిప్ ఇన్ ఇండియా" వంటి పుస్తకాలు కొన్ని తప్ప, పాతికేళ్ల కింద తెలంగాణ, హైదరాబాద్ దళిత ఉద్యమం గురించి పెద్దగా సమాచారం అందుబాటులో లేదు. దొరికిన వాటిని క్షుణ్ణంగా అధ్యయనంచేసి, విశ్వవిద్యాలయాలలోని పరిశోధక వ్యాసాలు, ఇంకా అనేక ఉద్యమచరిత్ర గ్రంథాలు, ఆత్మకథలు, పత్రికలు వీటన్నిటిని శోధించి భాగ్యరెడ్డి వర్మతో పాటు, ఆ నాటి తెలంగాణ దళిత నాయకుల విశేషాలన్నీ సంగిశెట్టి ఆవిష్కరించారు. తన అన్ని సాహిత్య, సాహిత్యేతర పరిశోధక ప్రచురణల్లోనూ దళిత కోణాన్ని, సమాచారాన్ని అంతర్భాగం చేశారు. ఈ మధ్యనే విడుదలైన సంగిశెట్టి శ్రీనివాస్ "తెలంగాణ దళితోద్యమ చరిత్ర" ఆధునిక తెలుగు సామాజిక చరిత్రలన్నిటిలోనే ప్రత్యేకమైనది, విశిష్టమైనది. ఇందులోని సమాచారం అంతా సంగిశెట్టి సుమారు రెండు దశాబ్దాలుగా పోగుచేస్తూ వస్తున్నదే. దళితశ్రేణుల నిర్వచనాలను, బౌద్ధకాలం నుంచి మూలాలను సంగిశెట్టి ఇందులో చర్చించారు. అసఫ్ జాహి కాలం నుంచి ఆధునికతా ప్రయాణాన్ని సూచించారు. దళితుల సాంప్రదాయ వృత్తులు, వారి కళారూపాలు, ఉద్యమాలలో దళితుల స్థానం, దళితుల సొంత ఉద్యమాలు, వీటన్నిటినీ సంగిశెట్టి శ్రీనివాస్ ఈ పుస్తకంలో విపులంగా చర్చించారు. ఈ పుస్తకంలోని బలం, కేవలం చరిత్ర పుస్తకం కావడం కాదు. చరిత్రలు విస్మరించిన చరిత్రపుస్తకం కావడం. మౌలిక ఆధారాలను, ఆకరాలను సేకరించడంలో అగ్రవర్ణచరిత్రల విషయంలో లభించినంత సౌలభ్యం ఇటువంటి చరిత్రలలో దొరకదు.

> అంబేడ్కర్ కంటె ముందే, అంబేడ్కర్ ప్రభావం సోకక ముందే, అనేక మంది దళిత సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా కార్యక్షేత్రంలో ఉన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని తమ వ్యక్తీకరణను విస్తరించుకుంటూ వెళ్లారు. దేశవ్యాప్తంగా అట్లా ఎదిగిన పాయలన్నీ అనివార్యంగా, సహజంగా అంబేడ్కర్ మహానదిలో కలిసిపోయాయి. అటువంటి పాయలలో ఒకటి ఆది హిందూ/ ఆది ఆంధ్ర ఉద్యమం.

అంబేడ్కర్ కంటె మూడు నాలుగు సంవత్సరాలు ముందుపుట్టిన భాగ్యరెడ్డి వర్మ, హేతుబద్ధ వివేచనను, పౌరాణిక కథనాలను ప్రశ్నించే కుతూహలాన్ని, సామాజిక సమానత్వ ఆదర్శాన్ని అలవరచుకున్నారు. అంటే ఆయన మెలగిన సమాజంలో, ఆయా ప్రగతిశీల భావాలు ఉనికిలో ఉన్నాయన్న మాట. దళితులు ఒకప్పుడు దేశపాలకులని, అందుకని రెడ్డి అని పేరుచివర ఉండాలని కుటుంబ శైవ గురువు సూచన మేరకు, భాగ్యరెడ్డి అన్నపేరు ఆయన తల్లిదండ్రులు పెట్టారు. మతప్రచారకుల ద్వారా కూడా ఆత్మాభిమాన సందేశాలు అందుతూ ఉండేవన్నమాట. అంబేడ్కర్ కంటె ముందే సామాజిక న్యాయ, సమానత్వ భావాలను విస్తృతంగా ప్రచారం చేసిన భాగ్యరెడ్డి వర్మ, 1930 ప్రాంతంలో చరిత్రాత్మక రౌండ్ టేబుల్ సమావేశానికి ముందు, అంబేడ్కర్ ప్రాతినిధ్యాన్ని సమర్థించడం ద్వారా ఆయన నాయకత్వాన్ని అంగీకరిస్తున్నట్టు సూచించారు. స్వాతంత్ర్యానంతరం భాగ్యరెడ్డి కుమారుడు కాంగ్రెస్ తరఫున శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. సమకాలంలో భాగ్యరెడ్డికి, ఇతర దళిత సంస్కర్తలకు మధ్య సమన్వయమూ ఉండేది, విభేదాలు కూడా ఉండేవి. భాగ్యరెడ్డి వర్మ జీవితాన్ని, ఆచరణను కథనం చేస్తూ రాసిన ప్రత్యేక చరిత్ర గ్రంథం "దళితోద్యమ వేగుచుక్క భాగ్యరెడ్డి వర్మ" కూడా సంగిశెట్టి శ్రీనివాస్ ఈ ఏడాదే ప్రచురించారు.

ప్రాంతీయ, శ్రేణీయ చరిత్రల ద్వారానే సమగ్రమైన భారత చరిత్ర నిర్మితమయ్యేది. సంగిశెట్టి శ్రీనివాస్ రాసిన 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' అందుకు ఒక మంచి నమూనా. పరిశోధనా, సత్యాన్వేషణా కాలం చెల్లిన విలువలైన రోజుల్లో ఇంతటి నిష్ఠాగరిష్ఠుడైన పరిశోధకుడు ఉండడం తెలుగువారికి లభించిన మంచి అవకాశం.

యాభై ఏళ్ళ పీడీఎస్‌యూ!

శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం, సమ సమాజం, నూతన ప్రజాస్వామిక విప్లవం లాంటి ఉన్నతమైన ఆశయాలతో ఏర్పడిన సంస్థ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ). ఈ సంస్థ ఏర్పడి ఈ అక్టోబర్ 12 నాటికి యాభై ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ యాభై ఏళ్ల విప్లవ ప్రస్థానంలో పీడీఎస్‌యూ విద్యార్థుల పక్షాన బాధ్యతగా కొట్లాడుతూనే విద్య ప్రైవేటీకరణకూ, కార్పొరేటీకరణకూ వ్యతిరేకంగా పోరాడింది. సాంప్రదాయ, సంస్కరణవాద విద్యార్థి సంఘాలను తుత్తునియలు చేస్తూ విద్యార్థులు అందరికీ విప్లవ చైతన్యాన్ని అందించింది. పీడీఎస్‌యూ ఇచ్చిన స్ఫూర్తితో విద్యార్థులు హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం నిత్యం సమరశీల పోరాటాలు నిర్వహించారు. తెలుగు సమాజంలో వచ్చిన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, స్త్రీవాద, దళితవాద, అస్తిత్వ, కార్మిక, కర్షక, యువజన, ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలలో తనదైన పాత్రను పోషించింది పీడీఎస్‌యూ.

పీడీఎస్‌యూ తన యాభై ఏళ్ళ ప్రస్థానంలో అనేక పోరాటాలు నిర్వహించింది. ఎన్నో హక్కులను సాధించింది. ఉద్యమ నిర్మాణ క్రమంలో అనేకమంది పోరాట యోధులను కోల్పోయింది. పీడీఎస్‌యూ పోరాట స్ఫూర్తిని వివరిస్తూ, అమరవీరుల స్ఫూర్తిని నేడు మరింత ఎత్తి పట్టాల్సిన అవసరం ఉంది. పోరాట స్ఫూర్తితో ధ్వంసం అవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవటం కోసం, విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాట జ్వాలలను రగిలించాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020ను ప్రతిఘటించాలి. అందరికీ సమానమైన శాస్త్రీయమైన విద్య కోసం, సమానమైన అవకాశాల కోసం సమరశీల పోరాటాలను నిర్వహించాలి. దీనికోసం కలిసి వచ్చే అన్ని విప్లవ విద్యార్థి సంఘాలను ఐక్యం చేసుకోవాలి. తద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవ స్ఫూర్తితో విద్యార్థులంతా తమ సమాజం కోసం పోరుసల్పాలి. అందుకే రెండు పీడీఎస్‌యూ సంస్థల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కార్యవర్గాలు ఐక్యంగా యాభై ఏళ్ల పీడీఎస్‌యూకి విప్లవ జేజేలు తెలియజేస్తూ నేడు ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలోనూ, నవంబర్ 5న విజయవాడలోనూ పీడీఎస్‌యూ అర్థ శతాబ్దోత్సవ సభలను నిర్వహిస్తున్నాయి. వీటిని జయప్రదం చేయవలసిందిగా పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులకు, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు, అన్ని వర్గాల ప్రజలకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– పి. మహేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ

కోటా తీర్పుపై శాసనిక చర్యలేవీ?

ఎస్సీ, ఎస్టీల్లో అత్యంత వెనుకబడిన కులాలు, జాతులకు విద్య, ఉద్యోగ రంగాల్లో తగిన రిజర్వేషన్లు అందించేలా రాష్ట్రాలు ప్రాధాన్యతలతో కూడిన చర్యలు తీసుకోవాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు ఒకటిన తీర్పునిచ్చింది. దీనికి వ్యతిరేకంగా న్యాయ సమీక్ష చెయ్యాలని దాఖలైన 32 పిటిషన్లను విచారించనవసరం లేదని, ఇదే రాజ్యాంగ ధర్మాసనం తాజాగా కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో, మన రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, ఎస్సీ కులాలు, ఎస్టీ తెగలన్నీ ఏకరూప అభివృద్ధి సాధించేందుకు మార్గాన్ని సుగమం చేయాలి.

ఎస్సీ కులాల్లో సంచార, అర్ధ సంచార, స్థిర జీవితం కలిగిన కులాలు ఉన్నాయి. ఎస్సీ కులాల్లో వృత్తిపరమైన శ్రేణీయ వ్యవస్థ ఉంది. అట్టడుగున పారిశుద్ధ్య కులాలు, ఆపైన చర్మకార కులాలు పూర్తిస్థాయి పైన నేత, నీరుకట్టు వృత్తి కులాలు ఉన్నాయి. శ్రేణీయ వ్యవస్థలో అట్టడుగున పారిశుద్ధ్య పనిలో ఉన్న రెల్లి, తోటి, మెహతార్, పాకి, పంచమ, గొడగలి, గొడారి వంటి కులాల వారికీ; చర్మకారులైన మాదిగ, అరుంధతీయ, ఆది జాంబవ, డక్కలి, చిందు, బైండ్ల, మోచి, సమగర, మాంగ్, మాతంగ, మాదిగ దాసు, మాదిగ మాష్టి మొదలగు కులాల వారికీ; సంచార, అర్ధ సంచార జీవనంలో వున్న బుడగ జంగం, డక్కలి, చిందు, మాష్టీ మొదలగు అనేక కులాల వారికీ విద్యా ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం లేని, అసలే ప్రాతినిధ్యం లేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. పేదరికం, కుల వివక్ష, నిరుద్యోగంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఎస్టీలలో అటవీ ప్రాంత, కొండ ప్రాంతాల్లో చెంచు, కోయ, గోండు మొదలగు ఆదివాసీ తెగలు ఉన్నాయి. అలాగే మైదాన ప్రాంతంలో యానాది, ఎరుకల, లంబాడి, సుగాలి మొదలగు ఆదివాసి తెగలున్నాయి. ఇందులో యానాది జాతి ఆదిమ జాతి. ఈ తెగ ఇప్పటికీ పంట పొలాలలో చెట్లు, పుట్టలు తిరిగి ఎలుకలు, పాములు పట్టుకునే దుర్భర నిరుపేద పరిస్థితుల్లోనే ఉన్నారు. కాగా ఎస్టీ రిజర్వేషన్లలో విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రిజర్వేషన్లను ఎరుకల, లంబాడి, సుగాలి తెగలవారే సింహభాగం అనుభవిస్తున్నారు.

దేశంలో ఎస్సీ, ఎస్టీలు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను ఉపయోగించుకున్న తీరుతెన్నుల మీద పరిశీలనకు కేంద్ర న్యాయ శాఖ 1965లో బి.ఎన్. లోకూర్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అదే ఏడాది తన తుది నివేదికను సమర్పించింది. ఎస్సీ, ఎస్టీల మధ్య అభివృద్ధి వ్యత్యాసాలు తీవ్రంగా పెరిగాయని ఈ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, తమ జనాభా నిష్పత్తుల కంటే రిజర్వేషన్లలో సింహభాగం అనుభవించిన పద్నాలుగు ఎస్సీ, ఎస్టీ సమూహాలను రిజర్వేషన్ జాబితా నుంచి తొలగించమని, నాటి లోకూర్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదికలో స్పష్టంగా సూచనలు చేసింది. లోకూర్ కమిటీ నాడు డీ రిజర్వ్ చెయ్యమని సూచించిన కులాల జాబితాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మాల కులం కూడా ఉందనేది వాస్తవం.

> రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకూ అన్ని రకాల ఉద్యోగాల నియామకాలను, అన్ని ఉన్నత విద్యా, వృత్తివిద్యా అడ్మిషన్ల ప్రవేశాలను భర్తీ చేయకూడదు. రిజర్వేషన్ల హేతుబద్ధీకరణలో జాప్యాన్ని నివారించి, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ల పంపిణీలో న్యాయం చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీలలో ఏకరూప అభివృద్ధికి తక్షణం చర్యలు తీసుకోవాలి.



తెలుగు రాష్ట్రాల్లో మాదిగ ఉద్యమ ప్రభావంతో అత్యంత వెనుకబడిన ఆదివాసులు తుడుం దెబ్బ ఉద్యమాన్ని ప్రారంభించారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు ఎంబీసీ ఉద్యమాన్ని ప్రారంభించారు. వామపక్ష, కమ్యూనిస్టులు కూడా కుల నిర్మూలన పోరాట సమితి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి వంటి సంఘాలను పెట్టారు. ముస్లిం మైనారిటీలలో వెనుకబడిన సమూహాలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్యమం ముందుకు వచ్చింది. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే ఉద్యమం ప్రారంభమైంది. ఇండియా సంయుక్త రాష్ట్రాల బహుజన కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపన దాకా, మాదిగ ఉద్యమం ప్రభావం చూపింది. గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన ప్రాజెక్టుల రూపకల్పనలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాలు రూపొందాయి. పంపకంలో హేతుబద్ధీకరణ (వర్గీకరణ) లేకపోవడం వల్ల, ఈ చట్టాల అమలు ద్వారా కూడా ఎస్సీ, ఎస్టీల్లో సాపేక్షికంగా బలమైన కులాలు, జాతులు, తెగలవారే సింహభాగం లబ్ధిని కైవశం చేసుకున్నారు.

వర్గీకరణ సమస్య పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకూ ఎటువంటి శాసనిక ప్రక్రియలు, చర్యలూ చేపట్టకపోవడంతో ఆంధ్రప్రదేశ్ మాదిగలు అసంతృప్తితో ఉన్నారు. ఇక తెలంగాణలో రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ పన్నెండున మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు అయింది. అలాగే, సమస్య అధ్యయనానికి ఏకసభ్య జుడిషియల్ కమిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2018లో ప్రభుత్వ గజెట్‌లో ప్రచురింపబడిన, ఇప్పటికి తాజా గణాంకాలైన 2011 జనాభా లెక్కల ఆధారంగా రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ ప్రక్రియను పూర్తిచేయాలి.

ఎస్సీలు, ఎస్టీలకు చాలాకాలంగా దీర్ఘకాలికమైన, విధాన పరమైన అపరిష్కృత సమస్యలు ఎన్నో ఉన్నాయి. అందులో- 1. పెరిగిన జనాభా శాతానికి అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచుకోవడం. 2. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు జరిపించుకోవడం 3. భూమి, ఉపాధి, గృహ వసతులు కల్పించుకోవడం. 4. పారిశ్రామిక, వ్యాపార, పెట్టుబడి నైపుణ్యాలు పెంచుకోవడం. 5. నిరుద్యోగ నిర్మూలన, కులవివక్ష, అత్యాచారాల నిర్మూలన. 6. ఎస్సీ, ఎస్టీల్లో సంపన్న శ్రేణిని రిజర్వేషన్ల విధానం నుంచి మినహాయించడం మొదలైనవన్నీ కొన్ని ముఖ్య సమస్యలు. అయితే, ఇవేవీ కూడా, ఎస్సీ, ఎస్టీల మధ్య వున్న ఏ సమస్య పరిష్కారానికీ మరొక సమస్య పోటీ కాదు, కాకూడదు. పోటీ పెట్టజాలని, పెట్టకూడని, అడ్డుగా నిలపకూడని సమస్యలుగా ప్రభుత్వం, వర్గీకరణ వ్యతిరేకులు, సమాజమూ గుర్తించాలి. ప్రాధాన్యతలను బట్టి ఏ సమస్యకు ఆ సమస్యనే విడివిడిగా పరిష్కరించాలి. వర్గీకరణ లేకుండానే మెడికల్ సీట్ల భర్తీ, ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు జారీ కావడం... మాదిగలకు, మిగిలిన ఎస్సీ, ఎస్టీ తెగలకు మరింత అన్యాయం చేయడమే. రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకూ అన్ని రకాల ఉద్యోగాల నియామకాలను, అన్ని ఉన్నత విద్యా, వృత్తివిద్యా అడ్మిషన్ల ప్రవేశాలను భర్తీ చేయకూడదు. రిజర్వేషన్ల హేతుబద్ధీకరణలో జాప్యాన్ని నివారించి, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లలో పంపిణీలో న్యాయం చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీలలో ఏకరూప అభివృద్ధికి తక్షణం చర్యలు తీసుకోవాలి.

■ కృపాకర్ మాదిగ
వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి



డ్రోన్ల గురించి వి ద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ..

• కొత్త ఆలోచన బాస్..

ఆకాశమే హద్దుగా..



డ్రోన్ల సమ్మిట్‌లో అద్భుతాల ఆవిష్కరణ

కొత్తరకం డ్రోన్లతో ఆకట్టుకున్న యువతరం

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం.. అందుకు అనుగుణమైన డ్రోన్లు

అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న ఔత్సాహికులు

ఆకాశమే హద్దుగా యువతరం దూసుకెళ్తోంది. వ్యవసాయంలో రైతుల కష్టాలను చూసి రైతుబిడ్డలు, ప్రకృతి వైపరీత్యాల్లో సత్వర చర్యలకు సేవాతత్పరులు.. ఇలా తమలోని నైపుణ్యంతో అద్భుతాలను కళ్లముందుంచారు. మంగళగిరి వేదికగా బుధవారం జరిగిన అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024 వారి కష్టాన్ని, సాధించిన ఘనతను ప్రపంచానికి తెలియజేయగా, వారి ఆనందాన్ని, కష్టాల వెనుక ఉన్న నేపథ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తెలుసుకుంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

రైతుల కష్టాలు తీర్చేందుకు..



మాది ఉయ్యూరు పక్కన నెప్పల్లి గ్రామం. రైతు కుటుంబం. ఎరువులు, పురుగు మందులు చల్లేటప్పుడు రైతులు, కూలీలు పడే కష్టం, జరిగే ప్రాణాంతక ప్రమాదాలు చూశా. ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చేశాను. నా చదువు వ్యవసాయానికి ఉపయోగపడాలని ఆలోచించా. మా ఫ్రెండ్ కమల్ తోడుగా నిలిచాడు. ఇద్దరం కలిసి హైబ్రిడ్ ఇంజన్ డ్రోన్‌ను సిద్ధం చేశాం. దానితో రోజుకు 30 ఎకరాల్లో సులువుగా ఎరువులు, పురుగు మందులు చల్లవచ్చు. డ్రోన్లు కొనలేని వారికి కూడా మేం సేవలందిస్తున్నాం. ఇప్పటికి 25 వేల ఎకరాల్లో డ్రోన్లతో సేవలు చేశాం. వరదల్లో చిక్కుకున్న విజయవాడవాసులకు లాజిస్టిక్ డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాలు, నీళ్లు, అత్యవసర మందులు అందజేశాం. ఇప్పటి వరకూ మాదే హైబ్రిడ్ డ్రోన్ అని గర్వంగా చెప్పుకొంటాం. - గోపీ వెంకటకృష్ణ, ఉయ్యూరు

అవయవాల తరలింపు కోసం..



కిలో.. రెండు కిలోలు మోసే డ్రోన్లు కాకుండా 7 కిలోల పేలోడ్ ఉండేలా డ్రోన్ రూపొందించాం. ఇందులోని బ్యాగులో మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకూ చల్లదనం ఉంటుంది. అందువల్ల అత్యవసర మందులు, మానవ అవయవాలు భద్రంగా, వేగంగా తరలించవచ్చు. వేగం కూడా గంటకు 125 కిలోమీటర్లు ఉంటుంది. ఒకసారి చార్జ్ చేస్తే 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. - ఏకాంత్, తంజావూర్

తేలిగ్గా.. సులభంగా..



మేం ఎస్సార్ఎం కాలేజీలో చదువుతున్నాం. అత్యవసర మందులు అందించేందుకు వీలుగా డ్రోన్లు రూపొందించాం. సెల్‌ఫోనులో వి నియోగించే బ్యాటరీకి రెట్టింపు సైజులో.. అంటే 10వేల ఎంఏహెచ్ బ్యాటరీతో నడిచే తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం. దాన్ని అందించడానికి ఒక వెబ్ ఇంటర్‌ఫేజ్‌ను ఏర్పాటుచేసి, ఆటోమేటిక్ చార్జింగ్ స్టేషన్ను ఏర్పాటుచేసి 10 కిలోమీటర్ల పరిధిలో మందులు అందించేందుకు వీలుగా డ్రోన్ రూపొందించాం. మా మోడల్‌కు ఆమోదం లభిస్తే సేవలు మొదలుపెడతాం. - మణికంఠ, పుష్కర్, అజిత్

ఆ అధికారి నోటి వెంట రూల్స్ అలవోకగా వచ్చేస్తాయి.. అంతా రూల్ ప్రకారం చేస్తానని, గీత దాటనని చెబుతుంటారు. కానీ, ఆయన దగ్గర పనిచేసే అటెండర్లు, ఇద్దరు రిటైర్ ఉద్యోగులను కలిస్తే ఎలాంటి పనైనా రూల్స్ చెరిపేసి మరీ చేసేస్తారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖలో ఉన్నతాధికారి వద్ద పనిచేసే ఇద్దరు అటెండర్లు.. మరో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగుల బాగోతం ఇదంతా. ఉపాధ్యాయులకు డిప్యుటేషన్లు చేయాలన్నా.. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేయాలన్నా.. ఈ నలుగురే చేసుకుంటారు. ఈ అవినీతి తంతుతో విసిగిపోయిన ఎన్టీఆర్ జిల్లా స్కూళ్ల యాజమాన్యాలు రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.



విద్యాశాఖలో ఆ నలుగురు

ఉన్నతాధికారి కమ్ నలుగురు కలెక్షన్ ఏజెంట్లు

- ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఎడాపెడా వసూళ్లు
- సెలవుల్లో తరగతులు నిర్వహించిన వారి నుంచి..
- ఒక్కో స్కూల్ నుంచి రూ.5 లక్షల చొప్పున..
- టీచర్ల డిప్యుటేషన్‌కూ ముట్టజెప్పాల్సిందే..
- మంత్రి లోకేశ్‌కు ప్రైవేట్ స్కూల్స్ ఫిర్యాదు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖలో ఉన్నతాధికారి వద్ద పనిచేసే ఇద్దరు అటెండర్లు మొత్తం జిల్లాను రెండు భాగాలుగా పంచుకున్నారు. ఒకరు విజయవాడ నగరంలో వసూళ్ల తంతును పర్యవేక్షిస్తుంటే, మరొకరు మిగిలిన జిల్లాలో వసూళ్లను పర్యవేక్షిస్తుంటారు. వీరి పనితీరును.. విద్యాశాఖలోనే రిటైరై ప్రస్తుతం అవుట్ సోర్సింగ్‌పై పనిచేసే ఇద్దరు ఉద్యోగులు పర్యవేక్షిస్తుంటారు. ఉన్నతాధికారి మాత్రం తాను రూల్స్‌కు కట్టుబడి ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేస్తానంటూ తన చేతికి మట్టి అంటకుండా వీరితో పని కానిచ్చేస్తుంటారు. వీరంతా కలిసి ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని లక్షలాది రూపాయలు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

అవినీతి ఇలా..

దసరాను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన సెలవుల్లో పలువురు ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు తరగతులు నిర్వహించారు. దీన్ని సాకుగా చూపి నిబంధనలు ఉల్లంఘించారంటూ వారిపై చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. కానీ, ఒక్క స్కూల్‌పై కూడా చర్యలు తీసుకున్నది లేదు. 'ఆ నలుగురు' ప్రైవేట్ స్కూళ్ల వారితో బేరాలు మాట్లాడి సెటిల్ చేయడంతో చర్యలేమీ లేకుండా వ్యవహారం సద్దుమణిగింది. ఒక్కో విద్యాసంస్థ నుంచి సుమారు రూ.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. గొల్లపూడి, సింగ్‌నగర్, భవానీపురం, సత్యనారాయణపురం, గుణదల తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ స్కూల్ నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. డిప్యుటేషన్ల విషయంలోనూ భారీగానే వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని ఆమెను అదే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించడం గమనార్హం.

మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

వీరి వేధింపులు ఎక్కువ అవుతుండటంతో జిల్లా విద్యాశాఖ పనితీరుపై ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఉన్నతాధికారి.. విద్యాశాఖలో సీనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి పనిచేయటంతో అక్కడి లొసుగులన్నీ తెలుసుని చెబుతారు. దీంతో ఏ చిన్నలోపం ఉన్నా దాన్ని క్యాష్ చేసుకునేందుకు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలను ఇబ్బందులపాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సులు వేగంగా..



కేంద్రానికి ఆర్టీసీ ప్రతిపాదనలు

విజయవాడకు 100, అమరావతికి 50 అవసరం

- సమగ్ర వివరాలతో అధికారుల నివేదిక
- కేంద్ర ప్రోత్సాహక పథకంలో భాగమే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : త్వరలో నగరంలో అత్యాధునిక ఎలక్ట్రికల్ బస్సులు సందడి చేయనున్నాయి. విద్యుత్ బస్సులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ప్రోత్సాహక పథకంలో భాగంగా విజయవాడలో 100, అమరావతిలో 50 విద్యుత్ బస్సులకు ఆర్టీసీ ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలు దాదాపు కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపిస్తోంది. నగరంలో 15, అమరావతిలో 7 డిమాండ్ ఉన్న రూట్లలో రోజూ సగటున ఎంతమంది ప్రయాణిస్తున్నారు? విద్యుత్ బస్సులు ఎన్ని కిలోమీటర్లు తిరుగుతాయి? వీటిద్వారా ఎంత ఆదాయాన్ని పొందవచ్చు? వంటి వివరాలను ఆర్టీసీ అధికారులు కేంద్రానికి పంపారు. నగరంలో 12 మీటర్ల పొడవున్న ఎలక్ట్రికల్ బస్సులకు, అమరావతిలో 9 మీటర్లు, 12 మీటర్ల బస్సులకు ప్రతిపాదించారు. విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో తిరిగే విద్యుత్ బస్సులను విద్యాధరపురం డిపో నుంచి, అమరావతిలో తిరిగే బస్సులను మంగళగిరి డిపో నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

కాలంచెల్లిన బస్సులకు ఇక చెల్లు

నగరంలో కాలంతీరిన, డొక్కు బస్సులు ఎక్కువగా ఉన్నాయి. మొత్తం 400 సిటీ బస్సుల ఆపరేషన్ సంఖ్య.. 300కు పడిపోయింది. వీటిలో కూడా 200కుపైగా తుక్కు బస్సులే. వీటివల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఫలితంగా ప్రయాణికులు ఆర్టీసీకి దూరమవుతున్నారు. ఆటోల్లో ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నగరవాసులకు సౌకర్యవంతమైన, కాలుష్యరహితమైన, శబ్దరహితమైన విద్యుత్ బస్సులు అందుబాటులోకి తేవాలన్నది ఆర్టీసీ ఉన్నతాధికారుల వాదన. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల విద్యుత్ బస్సుల ఖర్చు కూడా తగ్గుతుంది. ప్రస్తుతం ప్రతిపాదనలు పరిశీలన దశలో ఉన్నాయి. త్వరలోనే కేంద్రం నుంచి శుభవార్త వచ్చే అవకాశం ఉంది.

రఫీ హత్య వెనుక ఏం జరిగింది?

నరసింహారాజుపై మృతుడి కుటుంబం తీవ్ర ఆరోపణలు 8

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

(Regd. Under A.P. Mutual Aided Co-op. Societies Act. 1995)

గొల్లపూడి బ్రాంచ్, విజయవాడ, కృష్ణా జిల్లా. ఫోన్: 8886661477

సర్ఫేసి చట్టం అనుసరించి సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) మరియు 9(1), సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం తనఖాఉంచిన ఋణగ్రహీతల నుండి ఋణము వసూలు చేయు నిమిత్తం దీ గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, చంద్రమౌళినగర్ బ్రాంచి, గుంటూరు వారిచే దిగువ ఉదహరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అది" "ఎలా వున్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" అను పద్ధతిపై 08-11-2024 తేదీన విక్రయించుటకు నిర్ణయించి సాధారణ ప్రజానీకం నుండి సీల్డ్ టెండర్ కోరటమైనది.

ఋణగ్రహీతలు : 1) గాలి జార్జ్ హేమంత్ కుమార్, తండ్రి : శ్రీధర్ వందనం, ఇంటి చిరునామా : డోర్ నెం. 76-14-249, సత్య స్టోర్స్ పైఅంతస్తు, భవానీపురం, ప్రియదర్శిని కాలనీ, విజయవాడ (అర్బన్). **2) గాలి కళ్యాణి, భర్త: జార్జ్ హేమంత్ కుమార్,** ఇంటి చిరునామా : డోర్ నెం. 76-14-249, సత్య స్టోర్స్ పైఅంతస్తు, భవానీపురం, ప్రియదర్శిని కాలనీ, విజయవాడ (అర్బన్).

బకాయి మొత్తం : తేది.30-09-2024 నాటికి రూ.21,24,975.80 పై. (అక్షరాల ఇరవై ఒక్క లక్షల ఇరవై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఐదు రూపాయలు మరియు పైసలు ఎనభై మాత్రమే) మరియు ది.01-10-2024 నుండి కాంట్రాక్ట్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు బ్యాంకు చార్జీలతో సహా.

స్థిరాస్తి వివరములు : కృష్ణా జిల్లా, విజయవాడ, ఇబ్రహీంపట్నం సబ్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ పంచాయితీ ఏరియా, గొల్లపూడి గ్రామం, ఆర్.ఎస్. నెం. 569/1 మరియు 569/2 లోని "లక్ష్మీ శ్రీనివాసా రెసిడెన్సీ" కి చెందిన స్థిరాస్తి. దీనికి **హద్దులు: తూర్పు:** పంచాయితీ రోడ్డు, **దక్షిణం:** ఐ.టి.పి.ఎస్. యొక్క ఆస్తి, **పడమర:** కె. శ్రీను కుమార్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** శామ్యూల్ యొక్క ఆస్తి.

ఈ సరిహద్దులలో మొత్తం 481-25 చ.గ.లు లేదా 402-38 చ.మీ.ల విస్తీర్ణంలో అవిభాజ్యపు, అనిర్దేశ్యపు మరియు విభజించుటకు వీలుగాలేని 20 చ.గ.లు లేదా 16-72 చ.మీ.ల విస్తీర్ణము గల స్థలము భాగము అందులోని ఉమ్మడి మరియు జాయింట్ హక్కులు కులుపుకొని అనుభోక్తపు, సకల సౌకర్యాలు మరియు సదుపాయాలు మొ॥ వాటితో గల **"లక్ష్మీ శ్రీనివాసా రెసిడెన్సీ" గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లింత్ ఏరియా 700 చ.అ., పార్కింగ్ ఏరియా 20 చ.అ.లు గల రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.జి-1కు సంబంధించిన ఆస్తి. దీనికి హద్దులు: తూర్పు:** పంచాయితీ బజార్, **దక్షిణం:** ఫ్లాట్ నెం.జి-2, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** కామన్ కారిడార్ మరియు పార్కింగ్. ఈ హద్దులలో **"లక్ష్మీ శ్రీనివాసా రెసిడెన్సీ"** గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లింత్ ఏరియా 700 చ.అ., పార్కింగ్ ఏరియా 20 చ.అ.లు మరియు అందులోని అన్ని సౌకర్యాలతో పాటు మరియు ఉమ్మడి మరియు జాయింట్ హక్కులు కులుపుకొని పార్కింగ్ ఏరియాతో అనుభోక్తపు, సకల సౌకర్యాలు మరియు సదుపాయాలు మొ॥వాటితో సహా.

రిజర్వు ధర : రూ.9,00,000/-, ధరావత్తు సొమ్ము : రూ.90,000/-

టెండర్ / బహిరంగ వేలం ప్రకటన వివరాలు

1) సీల్డ్ టెండర్ సమర్పించు చివరి తేది.08-11-2024, సా॥3.00 గం॥లకు
2) టెండర్ తెరుచు ప్రదేశం/ వేలం అమ్మకం ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, గొల్లపూడి బ్రాంచి, విజయవాడ, కృష్ణా జిల్లా.
3) టెండర్లు తెరుచు తేది మరియు సమయం : 08-11-2024, సా॥గం॥ 3.30 ని॥లకు
4) వేలం అమ్మకం తేది & సమయం : 08-11-2024, సా॥ 4.00 గం॥లకు
5) వేలం వేయు ఆస్తి తనిఖీ తేది.: ఏదైనా బ్యాంక్ పనిదినములలో ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 5:00 గం॥ల వరకు.
6) ఏ కారణము తెలియజేయకనే బిడ్ మరియు అమ్మకం అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా పొడిగించుటకు వాయిదా వేయుటకు అధీకృత అధికారికి అధికారము కలదు
7) బ్యాంకు వారు అమ్మకమును ధృవీకరించవలెను
8) పై చిరునామా వద్ద గల బ్యాంకు బ్రాంచి నుండి సంబంధిత నమూనా టెండర్ల ఫారం పొందవచ్చును.
9) టెండర్ల ఫారం నందు ఇతర నియమాలు మరియు నిబంధనల వివరములు కలవు. పై చిరునామా గల బ్యాంకు బ్రాంచి నందు కాగోరు బిడ్డర్లు ఆస్తి తనిఖీ కొరకు ఏదైనా బ్యాంక్ పనిదినములలో ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 5:00 గం॥ల వరకు సంప్రదించవచ్చును.

తేది : 23-10-2024
స్థలం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, గొల్లపూడి బ్రాంచి, విజయవాడ.



కమిషనర్ భవానీప్రసాద్

క్లాప్ వాహన డ్రైవర్ల ఆందోళనతో తాడిగడప మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పి ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే.. పరిష్కరించాల్సిన మున్సిపల్ కమిషనర్ అర్థంలేని వ్యాఖ్యలు, నిర్ణయాలతో వివాదాస్పదంగా మారుతున్నారు. రాజకీయ నాయకులపై పైచేయి చూపించుకోవడంలో నిమగ్నమై అసలు సమస్యలను గాలికొదిలేస్తున్నారు.

ఎమ్మెల్యే చెబితే వినాలా..!

వివాదాస్పదంగా తాడిగడప మున్సిపల్ కమిషనర్

- ఉద్యోగులు, సిబ్బందిపై దురుసు ప్రవర్తన
- బదిలీపై వచ్చిన ఉద్యోగులకు బాధ్యతలు ఇవ్వరు
- ఎమ్మెల్యే చెప్పారన్న సాకుతో కావాలనే జాప్యం
- పారిశుధ్య సమస్య పక్కనపెట్టి వివాదాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/పెనమలూరు) : తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవానీ ప్రసాద్ వ్యవహారశైలిపై కార్యాలయ సిబ్బందితో పాటు అధికార పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు తరచూ కార్యాలయానికి వెళ్తున్న కూటమి పార్టీ నాయకులతో 'మీకు పనీపాటా లేదా.. ఎప్పుడూ మా కార్యాలయం చుట్టూ తిరుగుతుంటారు.' అని ఆయన వ్యాఖ్యానిస్తుండటంతో నాయకులంతా కంగుతింటున్నారు.

వివాదాస్పద నిర్ణయాలు

సిబ్బంది విషయంలోనూ కమిషనర్ తీరు వివాదాస్పదంగా ఉంటోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి టీపీఎస్‌లుగా శ్రీనివాసరావు, అరుణ తాడిగడప మున్సిపాలిటీకి వచ్చారు. ఏసీపీగా సీఆర్డీయే కార్యాలయంలో మిగతా 8లో..



గ్రహణం వీడని గుణదల ఆర్‌వోబీ

శంకుస్థాపన చేసి 15 ఏళ్లు పూర్తయినా అదే దుస్థితి

- గతంలో టీడీపీ ప్రభుత్వంలో కొంత కదలిక
- వైసీపీ పాలనలో కాల్వకట్టపై ఇళ్ల తొలగింపుతో సరి
- పోరాడుతూనే ఉన్న వామపక్షాలు
- ఆర్‌వోబీ నిర్మాణంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

8

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత 8


కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్‌లకు దుర్గమ్మ చిత్రపటాలు అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో కూటమి ప్రజా ప్రతినిధులు

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లు ఒకేసారి దర్శించుకున్నారు. వీరికి ఈవో రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగత సత్కారాలు అందజేశారు. దుర్గమ్మ దర్శనం అనంతరం నేతలకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, వైదిక కమిటీ సభ్యులు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రిలు పాల్గొన్నారు.

దుర్గమ్మ అనుగ్రహం, సీఎం కృషి వల్లే గిన్నిస్ రికార్డులు

అమ్మవారి దర్శనానంతరం ఎంపీ శివనాథ్ విలేకరులతో మాట్లాడుతూ, కనకదుర్గమ్మ ఆశీస్సులు, సీఎం చంద్రబాబు కృషి వల్లే డ్రోన్ హాకథాన్‌కు ఐదు గిన్నిస్ రికార్డులు లభించాయని పేర్కొన్నారు. చంద్రబాబు సంకల్పం, దుర్గమ్మ అనుగ్రహం వల్లనే దేశంలో మొదటిసారి ఇంతపెద్ద స్థాయిలో డ్రోన్ సమ్మిట్ అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయటం విశేషమని కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా కరుణాకటాక్షాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్టు నేతలు తెలిపారు.



అన్నవితరణకు, ఆలయ స్వర్ణ తాపడానికి దాతల విరాళం

ఏలూరుజిల్లా, కైకలూరులోని ఎన్జీవోస్ వీధికి చెందిన ఇందుకూరి సత్యనారాయణరాజు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం అన్నవితరణ నిమిత్తం ఆలయ అధికారులకు రూ.1,00,116లను చెక్కు రూపంలో అందజేశారు. కృష్ణాజిల్లా, గుడివాడకు చెందిన బోను నాగమణి కుటుంబసభ్యులతో కలిసి బుధవారం అన్నవితరణ నిమిత్తం ఎం.వెంకటేశ్వరరావు, సరోజినీదేవి పేరున రూ.1,00,116ల చెక్కు అందజేశారు. ఆలయ స్వర్ణ తాపడం నిమిత్తం రూ.1,00,116లు చెక్కు అందజేశారు.


వర్సిటీలో వివిధ అంశాలను తిలకిస్తున్న నాక్ బృందం

కృష్ణా వర్సిటీ సందర్శనలో నాక్ బృందం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణావిశ్వవిద్యాలయాన్ని బుధవారం నాక్ బృందం సందర్శించింది. వివిధ విభాగాల ప్రతినిధులు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న విద్యావిషయిక కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నాక్ బృందం చైర్మన్, మైసూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎన్‌కె లోక్‌నాథ్ అధ్యక్షతన వచ్చిన ప్రతినిధులకు కేయూ ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, డీన్‌లు బసవేశ్వరరావు, సుందరకృష్ణలు ఘనస్వాగతం పలికారు. నాక్ చైర్మన్ ఎన్‌కె లోక్‌నాథ్, సభ్యులు హర్యానా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రీచా మదన్, పంజాబ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సంజీవ్‌కుమార్‌శర్మ, బరోడా ఎఎస్‌విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రదీప్ దీటా, బనారస్ విశ్వవిద్యాలయంప్రొఫెసర్ ప్రకాష్ చంద్ర అసోం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సుపాటింరే, మహారాష్ట్ర సెయింట్ జార్జి బాబా విశ్వవిద్యాలయం డీన్ హేమత్ దీక్షముఖ్‌లు నాక్ బృందంలో ఉన్నారు. ముందుగా ఉపకులపతి శ్రీనివాసరావు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు. అనంతరం క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ నవీన లావణ్యలత తదితరులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. మూడురోజుల పాటు జరిగే పరిశీన కార్యక్రమంలో వివిధ కళాశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి నివేదికలను తయారు చేయనున్నారు.


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని, వేదికపై నెట్టెం రఘురాం, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి

టీడీపీకి కార్యకర్తలే ఆస్తి.. ఆలపాటిని గెలిపిద్దాం

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఆస్తి, వారి శ్రేయస్సే ముఖ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం చిట్టినగర్‌లోని మిల్క్ ప్రాజెక్టు ఫంక్షన్ హాల్‌లో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయం చేకూరుద్దామని, ఆ దిశగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో తనకు 50 వేలఓట్లు, ఎమ్మెల్యే సుజనాచౌదరికి 47 వేలఓట్ల మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. దీనివెనుక కార్యకర్తల కృషి ఎంతగానో ఉందన్నారు. అలాంటి వారికి పదవులు రావటం లేదనే ఆలోచన పెట్టుకోవద్దని, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తారన్నారు. నియోజకవర్గంలో భారీగా సభ్యత్వ నమోదు చేయించి ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి నామినేటెడ్ పదవులు అడుగుదామని తెలిపారు. త్వరలోనే ఎంఎస్ఎంఈ ద్వారా చిరు వ్యాపారులకు లోన్లు ఇచ్చే విధానం కేడర్‌కు సహాయ పడే కార్యక్రమం చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు తన గెలుపునకు కృషి చేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన నాయకుడు కేశినేని చిన్ని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్ మీరా, పార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కేడీసీఏ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, రవీంద్ర

విజయవాడ స్పోర్ట్సు : ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఐజీఎంసీలోని కేడీసీఏ కార్యాలయంలో రిటైర్డు గ్రూప్-1 అధికారి ఎ.వెంకట రమణ పర్యవేక్షణలో జరిగింది. కే డీసీఏ అధ్యక్షునిగా పొట్లూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా బండారు శ్రీనివాస్, కార్యదర్శిగా మేడసాని రవీంద్ర, జాయింట్ సెక్రటరీ వెలమర్తి రజనీకాంత్, ట్రెజరర్‌గా మొహ్మద్ సాదిక్, కౌన్సిలర్‌గా పఠాన్ బాజీ షరీఫ్‌ఖాన్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గం 2027 అక్టోబర్ 23 వరకు పదవిలో ఉంటుంది. నూతన కార్యవర్గాన్ని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు.

కాలు జారితే కాల్వలోకే..!

» వేల్పూరులో వంతెన కూలి నెల రోజులు
» ద్విచక్రవాహనాలు సైతం వెళ్ల లేని పరిస్థితి
» మూడొంతులకు పైగా కూలిన అప్రోచ్ రోడ్డు, వంతెన పిల్లరు
» రాకపోకలకు స్థానికుల అవస్థలు
» కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు

(వేల్పూరు/పమిడిముక్కల, ఆంధ్రజ్యోతి)

కనుమూరు నుంచి వేల్పూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న మురుగుకాల్వపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన అప్రోచ్‌రోడ్డు కోతకు గురై పిల్లరు చుట్టూ మట్టికొట్టుకుపోయింది. ఇటీవల వచ్చిన వరదలు, భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు, పిల్లరు కూలి కాల్వలో పడిపోయాయి. దీంతో రెండు గ్రామాలకు మధ్య రాకపోకలు నిలచిపో యాయి. మిగిలిన అప్రోచ్, పిల్లరు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో వంతెన పైనుంచి వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాల్వ పక్కన ఉన్న పొలాల్లో వ్యవసాయపనులకు వెళ్లేందుకు రైతులు, కూలీలు, కనుమూరు వైపు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు మిగిలి ఉన్న వంతెన పైనుంచి వెళ్లలేక ముళ్లపూడి, హనుమంతపురం, కపిలేశ్వరపురం మంటాడవైపు చుట్టూ తిరిగి వెళ్లవలసిరావడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. హనుమంతపురం, ముళ్లపూడి, వేల్పూరు గ్రామాల నుంచి కనుమూరు వైపు వెళ్లేందుకు ఇది దగ్గర కాగా వంతెన కూలిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు దూరాభారమైంది. ప్రత్యమ్నాయంగా కాల్వలో తూములు వేసి వంతెన పక్కన డైవర్షన్ రోడ్డు నిర్మిస్తే తాత్కాలికంగానైనా ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

> అది బ్రిటీషు కాలం నాటి వంతెన.. సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక కూలి ప్రమాదకర స్థితికి చేరింది.. చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండటంతో అటువైపు రైతులు, పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల వరదలకు అప్రోచ్ రోడ్డు, పిల్లర్ కూలిపోయాయి. వంతెనపై వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారు. వేల్పూరు-కనుమూరు రోడ్డులో మురుగు కాల్వ (ఐనంపూడి డ్రెయిన్)పై వంతెన దుస్థితిపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.


వేల్పూరు-కనుమూరు రోడ్డులో మురుగుకాల్వపై కూలిన వంతెన

డైవర్షన్ రోడ్డు వేస్తామంటున్నారు

- రత్నం దిలీప్ కుమార్, వేల్పూరు సర్పంచ్



వంతెన కూలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వంతెన వద్ద అప్రోచ్‌రోడ్డు కోతకు గురై భారీవర్షాలకు పిల్లరుకూడా కొట్టుకుపోయింది. కనుమూరు వైపు వెళ్లేందుకు దారిలేక చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తున్నది. ప్రజల అవస్థలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అధికారులతో మాట్లాడి ప్రత్యమ్నాయం ఏర్పాటుచేయాలని సూచించారు. డైవర్షన్ రోడ్డు వేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు.

పొలాలకు వెళ్లలేకపోతున్నాం..

- రాజులపాటి దుర్గారావు, రైతు



కాల్వ అవతల ఉన్న పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఎరువులు వేయాలంటే వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ట్రాక్టర్లు చుట్టూ తిప్పుకుని వచ్చి వంతెన అవల ఉంచవలసి వస్తున్నది. పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలి.

చుట్టు తిరిగి వెళ్లాలి..

- పాలపర్తి సుధాంజనేయులు, గ్రామస్థుడు



వంతెన కూలి నెలలు గడుస్తోంది. కనుమూరు వైపు వాహనాలు వెళ్లే వీలు లేక చుట్టుతిరిగి వెళుతున్నాం. అధికారులు ప్రత్యామ్నాయం చూపాలి. కూలిన వంతెనపై కాలినడకన వెళ్లాలన్నా భయపడుతున్నాం.

డైవర్షన్ రోడ్డు వేస్తున్నాం..

- బలరాం, డీఈ, ఆర్‌అండ్‌బీ ఉయ్యూరు

కూలిన వంతెన పక్కన డైవర్షన్ రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్‌ను పిలిచాం. త్వరలో రోడ్డువేసి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటాం. కొత్తవంతెన నిర్మాణానికి అంచనాలు తయారుచేసి నిధులు మంజూరైన అనంతరం వంతెన నిర్మాణం చేస్తాం.

పటిష్టమైన భద్రతా చర్యలు

» నూతన ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడతామని బుధవారం ఏఆర్ ఏఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణాజిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. గన్నవరం విమానాశ్రయంలో వీవీపీలకు, మంత్రులకు సెక్యూరిటీ వంటి కీలకమైన బాధ్యతలు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు చేస్తున్నారన్నారు. గతంలో కృష్ణాజిల్లాలో ఏఆర్ డీఎస్పీగా పనిచేశానన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావును సత్యనారాయణ కలిశారు.


ఎంపికైన క్రీడాకారులతో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్లు

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్‌కు కృష్ణావర్సిటీ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే కృష్ణాయూనివర్సిటీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్టు టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీబీ కృష్ణారెడ్డి, చైర్మన్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌లు తెలిపారు.పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల టోర్నీలో సత్తాచాటిన వారితో జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రవీణ్‌కుమార్, వై.నాగకళ్యాణ్, ఎస్.పోతురాజు, ఐ.ఈశ్వర్‌సాయి(సిద్ధార్థ డిగ్రీ కళాశాల), సాయికృష్ణ(ఎస్‌వీడీ సిద్ధార్థ లా కళాశాల), బి చిద్విరామ్(పవిత్ర డిగ్రీ కళాశాల), కె.విజయ విహారీ(వికాస్ కళాశాల)లు ఎంపికయ్యారు. ఎంపికలు వాసిరెడ్డి నాగేశ్వరరావు, రఘురామ్‌ల ఆధ్వర్యంలో చేపట్టినట్టు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి

» నీటితీరువా వసూలు వేగవంతం చేయాలి
» జిల్లాలో 302 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
» 9.80లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
» కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన జేసీ, డీఆర్వో

మచిలీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు, పారదర్శకంగా వ్యవహరించి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలిశర్మతో కలిసి రెవెన్యూ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూములకు సంబంధించిన సబ్‌డివిజన్, మ్యుటేషన్స్ తదితర అంశాలపై తహసీల్దార్లు దృష్టి సారించాలన్నారు. 'మీకోసం' అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు గ్రామాలవారీగా గ్రీవెన్స్ ప్రొఫైల్ తయారు చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూసదస్సులు నిర్వహించే తేదీలను ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని, దీనికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో అనధికార లేఅవుట్‌లను గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిఘా ఉంచాలన్నారు. ఇసుకరీచ్‌లో జేసీబీలు, యంత్రాలతో తవ్వకాలు జరగకుండా చూడాలని, అనధికార ఇసుకస్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఓటర్ల జాబితాల సవరణపై దృష్టి పెట్టండి

పొటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు బీఎల్‌వోలుగా ఉంటే, వారిని తొలగించి, సచివాలయ సిబ్బందిని వారిస్థానంలో నియమించాలన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు పూర్తి చేయలన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన అంశంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశ్రమల స్థాపనకోసం కేటాయించిన భూములను పరిశీలించాలని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే సంబంధిత భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. జాతీయరహదారుల అభివృద్ధికి సంబంధించి భూసేకణ పలుచోట్ల పెండింగ్‌లో ఉందని ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు.

9.80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి : జేసీ

జిల్లాలో ఈ ఖరీఫ్‌సీజన్‌లో 9.80లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, 302 కేంద్రాల ద్వారా జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. అధికారులు తగిన ప్రణాళికను తయారు చేయాలన్నారు. రైతు సేవాకేంద్రాలు, మిల్లులవద్ద ధాన్యంలో తేమశాతం కొలుస్తారని ఆమె అన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుల వద్ద ధాన్యం విక్రయించుకోవచ్చని, ఈ అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గన్నీబ్యాగుల కొరత లేకుండా చూడాలని, రైతుసేవాకేంద్రాల వద్ద టెక్నికల్ అసిస్టెంట్లను నియమించుకోవాలన్నారు. సచివాలయ సిబ్బందిని ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, బీఎస్ హేలాషారోన్, డీఎస్‌వో పార్వతి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సృజన, సర్వే విభాగం ఏడీ జోషిలా, ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

అందరి అభిప్రాయంతోనే అవనిగడ్డ ఇన్‌చార్జి నియామకం

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

అవనిగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అందరి అభిప్రాయంతోనే ఆమోదయోగ్యుడైన, సమర్థుడైన వ్యక్తిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తామని జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ స్పష్టం చేశారు. బుధవారం అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో కొనకళ్ల మాట్లాడుతూ, పార్టీని అధికారంలోకి తీసుకురావటంలో కార్యకర్తల సేవలు ఎనలేనివన్నారు. నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించటంతో కార్యకర్తలు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలని ఆందోళన చెందుతున్నారని, తాను ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ కార్యకర్తలకు అండగా ఉంటానని, వెంటనే స్పందిస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇప్పటికీ కొంతమంది అధికారుల వైఖరిలో మార్పు రాలేదని, అలాంటి వారిని ఊపేక్షించేది లేదన్నారు. టీడీపీకి కంచుకోటలాంటి నియోజకవర్గంలో ఈసారి కూడా సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలపాలని కనపర్తి సూచించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు తాము క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, చల్లపల్లి ఎంపీపీ కోట విజయరాధిక, రావి దుర్గావాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు తుమ్మల చౌదరిబాబు, మండవ బాలవర్థిరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రఘు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో

» ఉదయభానుపై ఆరోపణలు తగదు
» జనసేన నేత తుమ్మల ప్రభాకర్



జగ్గయ్యపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుపై టీడీపీ నేత నోముల రఘు చేసిన ఆరోపణలు, విమర్శలు పూర్తి నిరాధారమైనవని జనసేన నేత, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితరులు ఖండించారు. నోముల రఘు వ్యక్తిగత స్వలాభం కోసం తప్పుడు ఫిర్యాదులతో బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నాడని, అన్నారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమరవాణాపై ఉదయభాను జిల్లా సీపీకి ఫిర్యాదు చేశారని, అప్పటి నుంచి రఘు సోషల్ మీడియాలో ఉదయభానుకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నాడని, ఆయన జనసేన పార్టీలో చేరకుండా అడ్డుకునేందుకు ఈ కథంతా నడిపిస్తున్నారని ఆరోపించారు. పట్టణ జనసేన నేతలు ఆకుల బాజి, షేక్ సత్తార్, కాశీ కిశోర్, కాటగాని నరసింహారావు, షేక్ ఖాదర్ తదితరులు మాట్లాడారు. నోముల రఘుకు బీజేపీతో సంబంధం లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోలి రాఘవ చెప్పారు. 2021లోనే ఆయన బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాడన్నారు. రాజీనామా చేసిన పత్రాలను మీడియాకు విడుదల చేశారు. నోముల రఘుపై హత్యాయత్నం కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. జగ్గయ్యపేటలో విలేకరుల ప్రశ్నకు సమాధానమిస్తూ.. సమగ్ర విచారణ జరిపి నిందితులను పట్టుకోవాలని, వారి వెనుక ఎవరున్నారనేది నిగ్గుతేల్చాలని పోలీసులను కోరుతున్నామని చెప్పారు.

అక్షరాస్యతపై అధికారులు దృష్టి పెట్టాలి: జేసీ

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా నిర్వహించే ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 ఏళ్లకు పైబడి వారిలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దటం, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యులను పెంపొందించే ఉద్దేశ్యంతో నిర్దేశించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం అమలును బుధవారం కలెక్టర్ జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పాఠశాల, వయోజన విద్య, డీఆర్‌డీఏ, గ్రామ - వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్, సమాచార, పౌరసంబంధాల శాఖలకు చెందిన అధికారులతో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్‌వాడీ సహాయకులలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. తొలిదశలో జిల్లాలో 7 వేల మందిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. నవంబర్ నుంచి సాయంత్రం రెండు గంటల పాటు తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో ఉల్లాస్ కార్యక్రమం నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏపీవో ఎం.సింగయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత రాజరాజేశ్వరీపేట వాసుల సమస్యకు శాశ్వత పరిష్కారం

» ఎంపీ శివనాథ్ హామీ

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాత రాజరాజేశ్వరి పేట నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం 56వ డివిజన్ పరిధి పాత రాజరాజేశ్వరిపేటలో గత 50 ఏళ్లుగా ఉంటున్న స్థానికులను ఖాళీ చేయాలని ఇటీవల రైల్వే అధికారులు దండోరా వేయించడాన్ని నిరసిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ సమస్యపై తొలుత రైల్వే అధికారులు, విజయవాడ మునిసిపల్ అధికారులతో మాట్లాడి ముందుగా తాత్కాలిక పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చేస్తానన్నారు. ఎంపీ వెంట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, డివిజన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.

సీఎస్‌డబ్ల్యూ డీసీపీగా ప్రసాద్, హోంగార్డ్సు కమాండెంట్‌గా ఆనందబాబు

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ సిటీ సెక్యూరిటీ వింగ్ డీసీపీగా ఎస్వీడీ ప్రసాద్, హోంగార్డ్సు విభాగ కమాండెంట్‌గా టి.ఆనందబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం పోలీసు శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆనందబాబు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. కృష్ణా జిల్లా ఏఆర్‌లో ఏఎస్పీగా పనిచేస్తున్న ప్రసాద్‌ను నాన్ క్యాడర్ ఎస్పీ పదోన్నతిపై సీఎస్‌డబ్ల్యూకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇద్దరు అధికారులు పోలీసులు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వం మారినా ఇబ్బందులు తప్పవా!

» టీడీపీ ద్వితీయశ్రేణి నేతల ఆవేదన

తిరువూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో నేతలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇబ్బందులు తప్పటం లేదని టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో వెలుగు, ఉపాధి హామీ పథకాల్లో సిబ్బంది మార్పునకు సంబంధించి కొందరు టీడీపీ క్యాడరును కాదని వైసీపీలో అంటకాగిన వారికి, చంద్రబాబునాయుడుపై సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు పోటోలు పెట్టిన వారికి పోస్టింగులు ఇచ్చేందుకు కొందరు నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు వెలుగు, ఉపాధి పథకంలో బుక్‌కీపర్లు, ఎఫ్ఏలు, ఇతర విభాగాల్లో పనిచేశామని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమను తొలగించి, వైసీపీ చెందిన వారిని నియమించి తమపట్ల కక్షసాధింపుగా వ్యవహరించినట్టు పలువురు కార్యకర్తలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆయా గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీలు ఉపాధి, వెలుగు పథకాల్లో పార్టీకి చెందిన వారికి అవకాశం కల్పించాలని గ్రామపార్టీలు తీర్మానం చేసినా ఆచరణకు నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. టీడీపీ గ్రామస్థాయి కార్యకర్తల్ని విస్మరిస్తూ వైసీపీకి చెందిన వారికి అవకాశాలు కల్పిస్తున్న నేతలపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సిద్ధం అవుతున్నారు. త్వరలో పార్టీ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలు చెప్పుకుంటామని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, ద్వితీయశ్రేణి నేతలు చెపుతున్నారు.

హోరాహోరీగా ఐస్టా టెన్నిస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 27 : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ టెన్నిస్ కాంప్లెక్సులో ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్(ఐస్టా) పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వివిధ ఏజ్ గ్రూప్‌ల్లో బుధవారం పోటీల్లో 35+ సింగిల్స్‌లో ఈశ్వర్, నగేష్, అశోక్, అశ్విన్, 65+ డబుల్స్‌లో మన్మథ- ధనుంజయలు జోడి, శ్రీనివాస్- సన్యాసి జోడి, 70+ ప్లస్ డబుల్స్‌లో పట్నాయక్- వడివేలు జోడి, రాంబాబు- సెత్తుజోడి సెమీస్‌కు చేరారు. గురువారం పోటీలు ముగుస్తాయని నిర్వాహకులు కె.రాధాకృష్ణమూర్తి, టోర్నీ డైరెక్టర్ ఎం.మల్లిఖార్జునరావులు తెలిపారు. విజేతలకు రూ.4 లక్షల ప్రైజ్‌మనీ, ట్రోఫీలను ప్రదానం చేయనున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131, 140, 151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540



సీఎం సహాయనిధికి రూ.10లక్షల చెక్కు అందజేత



ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ తరుపున సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధికి రూ. 10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించినట్లు అసోసియేషన్ సలహాదారు సూరపనేని రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరద బాధితుల సహాయా ర్థం వినియోగిస్తామని సీఎం తెలిపినట్లు వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పీఎం రామకృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ జీఆర్‌కె రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. జయరామి రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాఖన్నా, పక్కన పూర్ణిమ

వృత్తి విద్యలో శిక్షణతో పరిశ్రమలు స్థాపించొచ్చు

మొగల్రాజపురం , అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జనశిక్షణా సంస్థాన్‌లో వృత్తి విద్యలో శిక్షణ పొందిన మహిళలు పరిశ్రమల స్థాపన ద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదగొచ్చని ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా చెప్పారు. మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న కార్యాలయంలో మహిళలచే పరిశ్రమల స్థాపన- ప్రాముఖ్యత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మహిళలు సమాజంలో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, అలాంటి వారిని చూసి ముందుకు వచ్చే వారికి జనశిక్షణా సంస్థాన్ వృత్తి విద్యలో శిక్షణ ఇస్తుందన్నారు. సంస్థ డైరెక్టర్ ఏ. పూర్ణిమ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులు తారతమ్యం లేకుండా అవకా శాలను అందిపుచ్చుకుంటున్నారని చెప్పారు.





బందరు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

● సమయం ఇస్తే స్వచ్ఛందంగా తొలగిస్తాం: బాధితులు ● నష్టపరిహారం ఇవ్వని 30 మందితో సమావేశం ఏర్పాటు చేస్తాం: సిటీ ప్లానర్

పటమట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పటమట రైతుబజార్ సమీపంలోని తోటవారి వీధి నుంచి బుధవారం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. వీఎంసీ సిటీ ప్లానర్ ప్రసాద్ ఆదేశాల మేరకు సర్కిల్ -3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు ఆధ్వర్యంలో బుల్‌డోజర్ల సహాయంతో షాపుల ముందు ర్యాంప్‌లు పగులకొట్టడం ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపుల నిర్వాహకులు, భవన యజమానులు తమకు కొంత సమయం ఇస్తే తామే స్వచ్ఛందంగా తమ వస్తువులను, ఇనుప వస్తువులను తొలగించుకుంటామని కార్పొరేషన్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణ బాధితులకు సుమారు 227 మందికి గతంలోనే టీడీఆర్ బాండ్స్, నగదు పరిహారం ఇచ్చామని, వారందరికీ వారం రోజులు ముందుగానే నోటీసులు జారీ చేశామన్నారు. భవనాలను, షాపులను తీసి వేస్తామని తెలిపారు. సుమారు 30 మందికి టీడీఆర్ బాండ్లు, నష్ట పరిహారం ఇవ్వలేదని, వారందరికీ త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, సమావేశం అనంతరం తదుపరి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బుధవారం మొదలెట్టిన బందరు రోడ్డు విస్తరణ పనులు నిరంతరంగా కొనసాగిస్తామన్నారు.





షాపుల ముందు ర్యాంప్‌లు పగలకొడుతున్న కార్పొరేషన్ అధికారులు, పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె

పనులను పరిశీలించిన గద్దె

బందరు రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. విస్తరణ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. విస్తరణలో బాధితులకు ఇబ్బందులు పడకుండా విస్తరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. విస్తరణ అంశంపై కమిషనర్, సీపీ ప్రసాద్‌తో చర్చించామని, విస్తరణ బాధితులతో త్వరలో సమావేశం జరుగుతుందని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ తెలిపారు.

అందరివాడు కాట్రగడ్డ బాబు



కాట్రగడ్డ బాబుకు నివాళులు అర్పిస్తున్న నేతలు, కుటుంబ సభ్యులు

పాయకాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందున్న కాట్రగడ్డ బాబు అందరివాడని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావులు అన్నారు. టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు(బాబు) తృతీయ వర్ధంతి కార్యక్రమం బుధవారం 64వ డివిజన్ కండ్రికలోని ప్రతిభ ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో వారు ముందుగా కాట్రగడ్డ బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అనంతరం వారిద్దరు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు అండదండగా ఉన్న మహోన్నత వ్యక్తి కాట్రగడ్డ బాబు అని కొనియాడారు. కాట్రగడ్డ బాబు పెద్దకుమారుడు కాట్రగడ్డ మోహన్ మాట్లాడుతూ గుణదలలోని విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో 500 మంది విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. నివాళులు అర్పించిన వారిలో కాట్రగడ్డ బాబు సతీమణి వినీత, కుటుంబ సభ్యులు సాయి సూర్య, అలేఖ్య, అయాన్ష్, టీడీపీ నేతలు బాబీ, టి. అప్పారావు తదితరులు ఉన్నారు.

వరద ప్రభావితం కాని ప్రాంతాల్లో

పన్నుల వసూలుపై దృష్టి పెట్టండి

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద ప్రభావితం కాని ప్రాంతాల్లో ఖాళీ స్థలాల పన్ను, ఆస్తిపన్ను, ఇతర పన్నుల వసూలుపై దృష్టి పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం పన్నుల వసూలుపై చర్చించారు. ఖాళీ స్థలాలు, ఆస్తిపన్ను, ఇతర పన్నుల వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. కొత్త భవనాలు, వాటిలో ఎన్ని ఫ్లోర్‌లు ఉన్నాయి తదితర వివరాలను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. నీటి పన్ను విషయంలో రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ డి.సృజన, జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

కమలా నెహ్రూ ఉమన్స్ హాస్టల్ ప్రహరీని త్వరగా నిర్మించండి

సూర్యారావుపేటలో ఉన్న కమలా నెహ్రూ ఉమన్స్ హాస్టల్ ప్రహరీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఇటీవల గోడ కూలటంతో కొత్తగా ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు. గోడ నిర్మాణ పనులను కమిషనర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అసౌకర్యం లేకుండా చూడాలని తెలిపారు. చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్‌ఈ పి. సత్యనారాయణ, ఈఈ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అనారోగ్య పరిస్థితిని ఎదుర్కొంటున్న 5వ డివిజన్ వాసులు ఇరువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేసే కార్యక్రమం బుధవారం అమ్మకల్యాణ మండపం ఎదురుగా ఉన్న మసీదు రోడ్డులో జరిగింది. పుప్పాల జాహ్నవికి రూ. 75వేల చెక్కు, కసపర్తి యశోదకు రూ. 27వేల చెక్కును అందజేశారు. చెక్కుతోపాటు స్వీటు బాక్సును అందజేసిన గద్దె వారి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో ఒక్క తూర్పులోనే రూ.16 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, చెన్నుపాటి ఉషారాణి, పడాల గంగాధర్, ఎ.రామకృష్ణ, వల్లి దుర్గాప్రసాద్, దోమకొండ రవి, కోడూరు సుబ్రహ్మణ్యం, పునుపుమాటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పటమట: విధుల్లో ఉండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగి మరియమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న మాకం మరియమ్మ మంగళవారం రాత్రి బస్సు శుభ్రం చేస్తుండగా గమనించని డ్రైవర్ బస్సు వెనుకకు నడుపుతుండగా జరిగిన ప్రమాదంలో ఆమె గాయపడగా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఆమె కుటుంబ సభ్యులు బుధవారం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గద్దె రామ్మోహన్ కలిసి విషయం తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి సాయం అందజేశారు. యాజమాన్యంతో మాట్లాడి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని కూడా ఇప్పించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పవర్‌లిఫ్టింగ్‌లో సతీష్‌కు స్వర్ణం

విజయవాడస్పోర్ట్సు,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడి నాల్గో సంవత్సరం చదువుతున్న టీడీవీఎం సతీష్ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణంతో సత్తా చాటాడు. ఈ నెల 20న కృష్ణా జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా ఈవెంట్‌లో సీనియర్ విభాగం 93 కిలోల పవర్ లిఫ్టింగ్‌లో సతీష్ ప్రథమ స్థానం సాధించాడు.ఈ సందర్భంగా సతీష్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత, పీడీ వినయ్‌శేఖర్‌లు అభినందించారు.



సతీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరలక్ష్మీనగర్, ఎల్‌ఐసీ కాలనీ, ప్రశాంతి నగర్, జయప్రకాష్‌నగర్, ఫిల్మ్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

'కాన్సెప్ట్ ఆఫ్ మోల్'పై వక్తృత్వ పోటీలు

లబ్బీపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్రంలో ప్రాథమికంగా కొలిచే యూనిట్ అవగాడ్రో సంఖ్య అని, దాని నుంచి మోల్ డే తేదీ, సమయం వెలువడిందని, అందుకే అక్టోబరు 23ను మోల్ డేగా జరుపుకొంటామని, అమెరికన్ కెమికల్ సొసైటీ నేషనల్ కెమిస్ట్రీ శాస్త్రవేత్తలు నిర్ణయించారని ఈ రోజున ఉదయం 6.02 గంటల నుంచి సాయంత్రం 6.02 గంటల వరకు జరుపుకోవాలని నిర్ణయించారని సిద్ధార్థ మహిళా కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి తెలిపారు. కళాశాలలో మోల్ డే సందర్భంగా బుధవారం కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కాన్సెప్ట్ ఆఫ్ మోల్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మోల్ భావనపై విద్యార్థులు పోటీల్లో ప్రసంగించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, రసాయన విభాగాధిపతి ఎం.సుభాషిణి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎం.గీతామాధురి ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి పైపు ధ్వంసం: వృథాగా పోతున్న నీరు



ఈఎస్ఐ ఆసుపత్రి సెంటర్ నుంచి గుణదలకు వెళ్లే పులేటి కాల్వ(పోస్టాఫీస్) రోడ్డులోని తాగునీటి పైపు ధ్వంసమైంది. వారం రోజులు గడిచినా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో కుళాయిలు వదిలిన ప్రతిసారి తాగునీరు వృధాగా పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - భారతీనగర్



పీజీ బాలికల హాస్టల్ ఎదుట వదిలేసిన వ్యర్థాలు

జిమ్ ఎదుట వదిలేసిన ఎండిన చెట్లు, చెత్త, రాళ్లు

విషసర్పాలకు ఆవాసంగా సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణం

● పిచ్చిమొక్కలు తొలగించి వదిలేశారు ● భయాందోళనలో విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణం విష సర్పాలకు ఆవాసంగా మారింది. దీంతో కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను ఇటీవలే తొలగించారు. అయితే తొలగించిన వ్యర్థాలను, పిచ్చి చెట్లను అక్కడే వదిలేయడంతో విష సర్పాలు ఆవాసంగా చేసుకొని సంచరించడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పీజీ బాలికల వసతి గృహం, బాలుర వసతి గృహం, జిమ్ ఎదుట, కళాశాల ఆవరణలో వదిలేసిన వ్యర్థాలతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మొక్కుబడి తంతుగా చెట్లను, వ్యర్థాలను తొలగించారే తప్ప పూర్తి స్థాయిలో వాటిని శుభ్రం చేయలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కళాశాల యాజమాన్యం వ్యర్థాలను బయటకు పంపి విష సర్పాల బారి నుంచి తమను కాపాడాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
& 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
& సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234









PLOT FOR SALE

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, మన్న నూజీవీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, APCRDA ప్లాట్స్ చ.గ. 1900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర. 93906 65999. AJB -106

WANTED

Front Office Managers for Girls' College in Kanuru & Kankipadu. We are hiring experienced Female Front Office Managers for our Girls' College. & 90109 86508. AJB -40

మణిపాల్ హాస్పిటల్ దగ్గర, తాడేపల్లి నందు గల ప్రముఖ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల డ్రైవర్స్ కావలెను. జీతం:18 వేలు - 20 వేలు. Contact: 81436 64504 AJB -194313

ప్రముఖ సహకార సంస్థ యొక్క పెట్రోలు బంకులలో 10వ తరగతి పాస్/ఫెయిల్ అయిన వారు పంపు బాయ్స్‌గా పనిచేయుటకు వెంటనే కావలెను. సంప్రదించవలసిన సెల్ నెం.78426 01817. AJB -194314

విజయవాడ పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు మగ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం., 8 గం. డ్యూటి, వయస్సు: 20-50 సం.మధ్య సంప్ర: 63002 05484, 73828 96676 AJB -557

For English & Social. Upto X Full time NCC 'C' Holder preference. బెజవాడ రాజారావు హైస్కూలు, అరవింద వీధి, విద్యాధరపురం, VJA-12 సంప్ర: 0866-2411914 AJB -194316

2 మోక్షజ్ఞ కన్సల్టెన్సీ, విజయవాడ సిటిలోని ప్రముఖ హాస్పిటల్‌లో డాక్టర్స్ : UG & PG, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, సెక్యాట్రీ, స్టాఫ్ నర్స్, GNM, B.Sc, మార్కెటింగ్ మేనేజర్స్, టెలికాలర్స్, హౌస్ కీపర్స్ కావలెను. సంప్ర॥ 8019343834. AJG-203520

అమ్మకము

2 రాయనపాడు కల్పతరువు వుడా వెంచర్ నందు గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ 200 గు॥ల ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 9492 901788. AJG-203426

SERVICES

ఖాళీ స్థలాలపై లోన్స్/హోమ్ లోన్స్/ ప్రోపర్టీ లోన్స్/ బిజినెస్ లోన్స్/ పర్సనల్ లోన్స్ చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర: 73968 33074. AJB -4464

షెడ్లు వేయబడును. రిపేరు చేయబడును. పసారా షెడ్లు, కార్ పార్కింగ్ షెడ్లు, బాల్కనీ రూఫ్ షెడ్లు, ఇండస్ట్రియల్ షెడ్లు, గోడౌన్ కమర్షియల్ షెడ్లు వేయబడును. కామారు. VJA: 95422 23449. AJB -562

TO-LET

విజయవాడ, సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్, కెనరా బ్యాంక్ ప్రక్కన 2nd ఫ్లోర్ 2,400 S.ft ఆఫీస్‌కు అద్దెకు కలదు. సెల్ : 98483 94515 AJB -194088

FAILED/INCOMPLETE

H B.Tech/Degree/Diploma ఇప్పుడు మీరు మీ డిగ్రీని ఆమోదిత విశ్వవిద్యాలయాలలో క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధనంలో పూర్తి చేయవచ్చును. ఆమోదిత సంస్థ - ప్రభుత్వ ఉద్యోగాలకు వర్తించును. సం॥ప్ర॥ 8330964279. AJW-199039


పోయినవి

2 బండారు నాగమల్లేశ్వరి W/o. సూర్య ప్రకాష్‌రావు, NTR జిల్లా, విజయవాడ, రాణిగారితోట, తారక రామనగర్‌కి చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం. 3430/2011 లింక్ డాక్యుమెంట్ 1794/1994పై నివాసములో ఉండగా వరదలో కొట్టుకు పోయినవి ఎవరికైనా దొరికిన యెడల తెలియజేయగలరు. AJG-203519

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, వల్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడీవిటి





గ్రహణం వీడని గుణదల ఆర్‌వోబీ



- కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసి 15 ఏళ్లు
- గతంలో టీడీపీ ప్రభుత్వంలో కొంత కదలిక
- వైసీపీ పాలనలో కాల్వ కట్టపై ఇళ్ల తొలగింపుతో సరి
- పోరాడుతూనే ఉన్న వామపక్షాలు
- ఆర్‌వోబీ నిర్మాణంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో వేసిన శంకుస్థాపన శిలాఫలకం, కింద పిల్లర్ల దశలో ఆర్‌వోబీ



విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గుణదల ఆర్‌వోబీ ఎంతో దోహదం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. అయితే ఆర్‌వోబీకి పట్టిన గ్రహణం వీడడం లేదు. 2009లో అధికారంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గుణదలలో ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.36 కోట్ల అంచనాతో శంకుస్థాపన చేసి వదిలేసింది. ఆతర్వాత టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయితే, ఆర్‌వోబీ అలైన్‌మెంట్ మార్పులు, కాల్వ గట్లపై నివాసాల తొలగింపు తదితర సమస్యలతో నిధులు చాలవనే భయంలో కాంట్రాక్టర్ పనులు వదిలేశాడు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్‌వోబీపై దృష్టి సారించిన దాఖలాలే లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్‌వోబీ నిర్మాణానికి చర్యలు చేపడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-గుణదల : విజయవాడ నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, పెరిగిపోతున్న జనాభాకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఆలోచనతో 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గుణదల ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.36 కోట్లతో అంచనాతో శంకుస్థాపన చేసి వదిలేసింది. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆర్‌వోబీ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే ఆర్‌వోబీ ఎలైన్‌మెంట్లో మార్పులు ఉన్నాయని చెప్పడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. నిధులు సరిపోవని, నివాసాల తొలగింపు, విద్యుత్ లైన్ల తొలగింపు లాంటి చాలా సమస్యలు న్యాయం టూ కాం ట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలి వెళ్లిపోయాడు. దీంతో పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటగా అడ్డంగా ఉన్న విద్యుత్ టవర్ లైన్లు తొలగింపు, కాల్వ కట్ట వెంబడి ఏలూరు రోడ్డుకు మధ్యలో ఉన్న నివాసాలు తొలగింపునకు చర్యలు చేపట్టారు. రైవస్ కాల్వ, ఏలూరు రోడ్డు కు మధ్యలో ఉన్న నివాసాలు గుణదల సెంటర్ నుంచి గుణదల వంతెన వరకు తొలగించింది. ఈ ప్రాంతంలో నివాసాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు ఇచ్చారు. ఇళ్ల తొలగింపు పనులు పూర్తికాగానే ఆర్‌వోబీ పనులు ప్రారంభిస్తామని ప్రగల్భాలు పలికిన వైసీపీ పాలకులు నాయకులు కిక్కురమనకుండా ఉండి పోయారు. దీంతో కమ్యునిస్టు పార్టీ నాయకులు ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పలు మార్లు ధర్నాలు చేశారు. ప్రస్తుతం ఆర్‌వోబీ నిర్మాణం విషయమై సమాధానం చెప్పే వారే లేరు. గుణదల వంతెనలకు అవతల భాగంలో రెండు దశాబ్దాల కాలంలో అనేక కాలనీలు ఏర్పడ్డాయి. నివాసాలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా తయారయింది. బుడమేరు, ఏలూరు కాల్వ, రైవస్ కాల్వలపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పదేళ్ల క్రితమే బుడమేరు కాల్వపై ఉన్న వంతెన కొంతభాగం కూలిపోయింది. తూములు వేసి తాత్కాలికంగా రాకపోకలు సాగించే చర్యలు తీసుకున్నారు.. బుడమేరు వంతెనపై రెయిలింగ్ కొట్టుకుపోయినా పట్టించుకునే వారు లేరు. తాజాగా వచ్చిన బుడమేరు వరదల్లో కూడా రెయిలింగ్ ధ్వంసం అయిపోయింది. తిరిగి రెయిలింగ్ ఏర్పా టు చేసే పనులు చేపట్టారు. ఆర్‌వోబీ నిర్మాణం జరగకపోవడం వల్ల గుణదల శివారు ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. కూటమి ప్రభుత్వం గుణదల ఆర్‌వోబీ నిర్మాణంపై దృష్టి సారిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.



ముందుగానే నివాసాలను తొలగించిన ప్రాంతం

ఎమ్మెల్యే చెబితే వినాలా..!

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్న రంగప్రసాద్ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి టౌన్‌ప్లానింగ్‌లో పని చేస్తున్న గిరి, మురళీగౌడ్ మరోచోటకు వెళ్లారు. సెప్టెంబరు 24న మున్సిపాలిటీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన టీపీఎస్ శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించడంలో కమిషనర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తెలియడంతో ఆయన కమిషనర్‌కు ఫోన్‌చేసి శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. దీన్ని మనసులో పెట్టుకున్న కమిషనర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఒక సమీక్ష సమావేశంలో శ్రీనివాసరావును ఉద్దేశించి వేలెత్తి చూపుతూ. 'ఎమ్మెల్యే చెబితే నేను వినాలా.. నీకు బాధ్యతలు అప్పగించేయాలా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన తర్వాత పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మున్సిపాలిటీలో పని చేస్తున్న గుమాస్తాకు ఆర్ఐ పోస్టు ఇవ్వాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించగా, ఇప్పటికిప్పుడు కుదరదని, ఓ రెండు నెలలు ఆగితే చూస్తానని ఎమ్మెల్యేకు నిర్లక్ష్యంగా చెప్పారు.

పారిశుధ్య సమస్యలు వదిలేసి..

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే క్లాప్ వాహన డ్రైవర్ల జీతాల చెల్లింపుల విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభనతో వారంతా ఆందోళనకు దిగారు. దీంతో తాడిగడప మున్సిపాలిటీలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. గతంలో పనిచేసిన కమిషనర్ జీతాల చెల్లింపులో జాప్యాన్ని నివారించడానికి మున్సిపల్ ఫండ్ నుంచి కొద్ది మొత్తంలో డ్రైవర్లకు చెల్లింపులు జరిపి పనిచేయించుకునేవారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్య తీవ్రం కాకుండా చూసుకునేవారు. ప్రస్తుత కమిషనర్ మాత్రం.. క్లాప్ వాహన డ్రైవర్ల జీతాల సమస్య తనకు సంబంధం లేదని బహిరంగంగానే చెబుతున్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల విషయంలోనూ చొరవ చూపడం లేదు. డ్రెయినేజీ రోజువారీ పూడిక తొలగింపు ప్రక్రియ కూడా నిలిచిపోయింది. దీంతో వర్షాలకు ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగుతున్నాయి. గతంలో భవానీప్రసాద్ పనిచేసిన పొన్నూరు, మదనపల్లి, హిందూపురం, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల్లోనూ సిబ్బంది, స్థానిక నాయకులతో వివాదాల కారణంగా స్వల్పకాలంలోనే బదిలీ అయ్యారని తెలుస్తోంది.

అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

గుణదల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల పురుషుల విభాగం కబడ్డీ పోటీలు బుధవారం నిర్వహించారు. మొత్తం 11 కళాశాలల నుంచి విద్యార్థులు తరలిరాగా, పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. వివిధ కళాశాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ యుగంధర్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి

సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



ధర్నాచౌక్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు తక్షణమే అమలు చేయాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు పోలవరం ప్రాజెక్టు మరో వందేళ్లయినా పూర్తి వదన్నారు. పోలవరం రాజకీయ నేతలకు వరంలా మారిందని విమర్శించారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగితేనే దేశంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న చోట బీజేపీ ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తుందని ఆరోపించారు. విభజన తర్వాత రాష్ట్రం బాగా నష్టపోయిందని, కనీసం బడ్జెట్ ప్రవేశపెట్టే పరిస్థితి లేదన్నారు. హరియాణలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ఆ పార్టీ నాయకుల ఓవర్ కాన్ఫిడెన్స్, ఈవీఎంల ట్యాంపరింగ్ కారణమన్నారు.

పంపిణీదారుల పట్ల విప్రో వైఖరి సరికాదు



ధర్నాచౌక్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : పంపిణీదారుల పట్ల విప్రో కంపెనీ వైఖరి సరికాదని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ప్రొడక్ట్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సి.ఎస్.ప్రసాద్, అఖిల భారత పంపిణీదారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ నగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ నేతల సమావేశం జరిగింది. అనంతరం వీరు విలేకరులతో మాట్లాడుతూ భయభ్రాంతులకు గురిచేసే ఆంక్షలు విధిస్తూ వారి విధి విధానాలను తరచూ మారుస్తూ పంపిణీదారులను కోలుకోలేని నష్టాల్లోకి నెట్టారని ఆరోపించారు. సంస్థ యాజమాన్యం తమ వైఖరి మార్చుకోకుంటే కొనుగోళ్లను నిలిపివేసేందుకు నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించకుంటే ధర్నా చేస్తాం

-ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు



ధర్నాచౌక్, అక్టోబర్ 23: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భూ సమస్యలు పరిష్కరించాలని లేదంటే నవంబర్ మొదటి వారంలో విజయవాడలో భారీ ధర్నా చేపడతామని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి పేదలకు ఇచ్చేందుకు, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేసి భూమి లేని పేద కుటుంబాలకు భూ పంపిణీ చేయాలని కోరాయి. 'భూ సమస్యలు-- చట్టాల అమలు- ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రీసర్వేపై టీడీపీ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఆలిండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, భారత కేత్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, దడాల సుబ్బారావు, కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, నేత రాధాకృష్ణ పాల్గొన్నారు.

రఫీ హత్య వెనుక ఏం జరిగింది?

- నరసింహరాజుపై మృతుడి కుటుంబం తీవ్ర ఆరోపణలు
- మంచివాడే అంటున్న నరసింహరాజు సన్నిహితులు
- ఆర్థిక వ్యవహారాలపై పోలీసుల ఆరా



విజయవాడ, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): అయోధ్యనగర్ లోటస్‌లో జరిగిన మహ్మద్ రఫీ హత్య వెనుక కుట్రలు ఉన్నాయా? ఇద్దరూ ప్రాణ స్నేహితులే అయినా వారి మధ్య వివాదాలు నడుస్తున్నాయా? ఇద్దరూ వ్యాపా రంలో భాగస్వాములుగా ఉన్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు. లోటస్ ల్యాండ్ మార్క్‌లో మహ్మద్ రఫీని తన స్నేహితుడు సాగి వెంకట నరసింహరాజు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రఫీ కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆరోపణలు చేస్తుండడంతో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో నరసింహరాజుపై మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. అతడి స్నేహి తులు, పరిచయస్తులు నరసింహరాజు మంచి వాడని చెబుతున్నారు. నరసింహరాజు మందుల షాపును నిర్వహిస్తున్నాడు. ఆయన కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. విజయవాడలో ఉన్న మందుల షాపు వ్యవహారాలను బంధువులకు అప్పగించాడు. ఆయన నెలలో రెండు, మూడు సార్లు వచ్చి షాపు వ్యవహారాలను చూసుకుంటాడు. పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన మహ్మద్ రఫీతో పాఠశాల స్థాయి నుంచి స్నేహం ఉంది. అది మొన్నటి వరకు కొన సాగింది. రఫీ తాడిగడపలో మీసేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్నేహపూర్వకంగా ఉండే ఈ రెండు కుటుంబాల మధ్య రఫీ హత్య చిచ్చు పెట్టింది. తనను తాను రక్షించుకునే ప్రయత్నంలోనే నరసింహరాజు రఫీని హత్య చేశాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. నరసింహరాజు తన భర్తతో మద్యం తాగించి చంపేశాడని రఫీ భార్య అజ్మీర ఆరోపిస్తోంది. ఆయనకు మద్యం తాగే అలవాటు లేదని స్నేహితులు చెబుతున్నారు. పోలీసులు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. నరసింహరాజు ఎప్పుడు హైదరా బాద్ నుంచి వచ్చినా ఇద్దరూ కలుసుకుంటారని, రఫీ మద్యం తీసుకుని వెళ్తాడని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. రఫీ కుటుంబానికి నరసింహ రాజు అవసరమైనప్పుడు ఆర్థికసాయం చేస్తాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. రఫీ భార్య అజ్మీర మాత్రం వ్యాపార భాగస్వామ్యంతోనే హత్య చేశాడని ఆరోపిస్తోంది. నరసింహరాజు మెడికల్ షాపు నిర్వహిస్తున్నందున, ఇందులో రఫీ పెట్టుబడి పెట్టాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రఫీ కుటుంబానికి ఆర్థికసాయం చేసేవాడినని నరసింహరాజు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పాడు. ఈ విష యాన్ని మాత్రం రఫీ కుటుంబం అంగీకరి ంచడం లేదని తెలిసింది. తన బావ, నరసిం హరాజు వ్యాపార భాగస్వాములుగా ఉన్నారని రఫీ బావమరిది చెబుతున్నాడు. వ్యాపారంలో ఉన్న వివాదాలను సెటిల్ చేసుకుందామని ఇంటి కి పిలిపించి, మద్యం తాగించి హత్య చేశాడని ఆరోపించాడు. హంతకుడికి పోలీసులు రాచమ ర్యాదలు చేస్తున్నారని, ఆవేశంలో చంపానని నరసింహరాజు చెబుతున్నదంతా అబద్ధమని కొట్టిపా రేస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగా అతి క్రూరంగా చంపాడని తీవ్రమైన ఆరోపణలు చేశాడు.

డబ్బులు అడిగినందుకే హత్య

-రఫీ భార్య అజ్మీర

వ్యాపార భాగస్వామ్యంలో ఉన్న డబ్బులు అడినందుకు నరసింహరాజు నా భర్తను హత్య చేశాడు. నన్ను, పిల్లలను రోడ్డున పడే లా చేశాడు. నా భర్త శవాన్ని చూడకుండా పోలీసులు అడ్డుకున్నారు. హత్య చేసిన వ్యక్తికి రక్షణ కల్పించి పిల్లలను, నన్ను అడ్డుకున్నారు. రఫీని నరసింహరాజు మో సం చేసి చంపేశాడు. పోలీసులు ముందుగా కేసు నమోదు చేయలేదు. మా బంధువు లంతా కలిసి గొడవ చేసిన తర్వాత కేసు నమోదు చేశారు. హంతకుడికి ఫోన్ మా ట్లాడుకునే వెసులుబాటును పోలీసులు కల్పి ంచారు. ఆయనను కలవడానికి బంధు వులను అనుమతించారు. మమ్మల్ని కనీసం స్టేషన్ లోపలకు రానివ్వలేదు. మా ఫిర్యా దును పోలీసులు పట్టించుకోలేదు. వారికి ఇష్టం వచ్చినట్టుగా రాసుకున్నారు. మేమంతా గట్టిగా నిలదీస్తే అప్పుడు మార్చారు.

వారంలోపే రైతుల ప్లాట్లు రిజిస్ట్రేషన్

రాజధాని రైతులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ భరోసా



ప్లాట్ కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల లోపలనే రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయి స్తామని సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్‌చంద్ రైతులకు భరోసా ఇచ్చారు. లాటరీలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు ఎక్కడా అంతరాయం లేకుండా సంబంధిత కాంపిటెంట్ అథారిటీ రిజిస్ట్రేషన్ చేయిస్తుందని చెప్పారు. విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం తొలిరోజు కార్యక్రమంలో గతంలో రిటర్నబుల్ ప్లాట్లు అందుకొనని రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ట్రయల్ రన్ అనంతరం ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. కాంపిటెంట్ అథారిటీలు ప్లాట్ల కేటాయింపు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ వారంలోపే రిజిస్ట్రేషన్లు చేయిస్తామన్నారు. మౌలిక సదుపాయాల పనులు డిసెంబర్ నుంచి ప్రారంభమవుతాయన్నారు. జీఐఎస్ బృందం గ్రామాల మ్యాప్‌ల ద్వారా ప్లాట్ల ప్రదేశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది గ్రామాలకు చెందిన 23 మంది రైతులకు 68 రిటర్నబుల్ ప్లాట్లను అందజేశారు. సీఆర్‌డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ డి.ఎల్.ఎస్.రాజ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు డేవిడ్ రాజు, విశ్వేశ్వరనాయుడు, భీమారావు, స్వర్ణమేరి, సాయి శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా నవులూరు- 1, 2, నిడమర్రు - 1, 2లకు గురువారం మధ్యాహ్నం 2 గంల నుంచి 4 గంటల వరకు లాటరీ తీస్తారు. బోరుపాలెం, రాయపూడి - 1, నెక్కలు, నేలపాడు, వెలగపూడి, వెంటపాలెం, అనంతవరం గ్రామాలకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు లాటరీ తీయనున్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- మధురానగర్ కాల్వ గట్టు వద్ద గొడవ
- ఇరిగేషన్, వీఎంసీ అధికారులపై దాడికి యత్నం
- పోలీస్ బందోబస్తు కోసం వెళ్తే మొండి చెయ్యి
- తొలగించిన తరువాత మరలా ఆక్రమణలు



కృష్ణుడి గుడి వద్ద గోడను తొలగించే ప్రయత్నం చేస్తున్న అధికారులు

మధురానగర్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ ఏరియా వీవీ నరసరాజు రోడ్డులోని కాల్వ గటు ఆక్రమణల కథ రోజుకో మలుపు తిరుగుతోంది. ఒకే ప్రాంతంలో రెండు ఫర్లాంగుల దూరంలో దసరా ఉత్సవాల పేరుతో తాత్కాలిక పందిర్లు వేసుకుని ఒక చోట అమ్మవారి విగ్రహం పెట్టి ఒకరు సిమెంట్ రాళ్లతో గోడలు కడితే, ఇంకోక చోట ఉత్సవాలు చేసిన ప్రాంతంలో అమ్మవారు వెలిసిందని గోడలు కట్టి హడావుడి చేశారు. ఈ రెండు తతంగాల మీద స్థానికుల నుంచి వీఎంసీ, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడం మూడు రోజుల క్రితం వారు రావడం పాక్షికంగా తొలగించడం మరల సోమవారం వస్తామని వెళ్లడం జరిగింది. మరల బుధవారం ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ నేతృత్వంలో అధికారులు, వీఎంసీ అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి రాంబాబు, టీపీవో రమణారెడ్డి సిబ్బందితో ఎస్కవేటర్‌లతో వచ్చి ప్రార్థనా మందిరాల పేరిట వేసిన తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు. ఇదే రోడ్డులో ఫ్లైవోవర్ పక్కన ఆరెళ్ల క్రితం కట్టిన కృష్ణమందిరం వద్దకు అధికారులు వెళ్లారు. ఈ మూడు చోట్ల ఆక్రమణ దారులు పెద్ద ఎత్తున అధికారుల చర్యలకు అడ్డు తగిలారు. ఒక దశలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు ఈ రెండు ఆక్రమణలకు మధ్య కూత వేటు దూరంలో ఉన్న గుణదల పోలీస్ స్టేషన్‌కు వె ళ్లి బందోబస్తు అడిగారు. వారు తమకు పై నుంచి అనుమతి లేదని తప్పించుకున్నారు. దీంతో చేసేది లేక ఉద్రికత్తల మధ్య ఆక్రమణలను తొలగించారు. అధికారులు వెళ్లిన తరువాత ఆక్రమణదారులు మరల విగ్రహాలు పెట్టి పరదాలతో పందిరి వేశారు.

అమ్మవారి విగ్రహం మాయం

నేతాజీ రోడ్డు చివర కట్ట మీద భూమిలో వెలిసిన అమ్మవారి విగ్రహం రెండు రోజులుగా కనిపించడం లేదు. బుధవారం ఆక్రమణలు తొలగించడానికి వచ్చిన వీఎంసీ అధికారులకు అక్కడ వేరే చిన్న విగ్రహం ఉండటం గమనించారు. అమ్మవారి విగ్రహాన్ని పురావస్తు అధికారులు వచ్చి పరిక్షిస్తారని రెండు రోజుల క్రితం అధికారులు హెచ్చరించడంతో ఆక్రమణలకు పాల్పడిన వారే దాచేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

స్వచ్ఛతా అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్

రైల్వే స్టేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైల్ చౌపాల్ పేరిట స్వచ్ఛతా అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ ప్రయాణికులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రయాణికులు స్టేషన్‌లో పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల గురించి ప్రశంసించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ సౌకర్యాల కల్పనలో ప్రయాణికుల సహకార ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అనంతరం ప్రయాణికులకు క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెస్‌లో దూసుకెళ్తున్న తెలుగు రాష్ట్రాల ప్లేయర్స్



విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా జరుగుతున్న బీఎస్‌కేయూ ఫౌండేషన్ తొలి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్‌లో తెలుగు రాష్ట్రాల ప్లేయర్స్ రెండో రోజు దూకుడు పెంచారు. నాలుగు రౌండ్ల పోరు ముగిసే నాటికి చాలా మంది క్రీడాకారులు నాలుగు పాయింట్లతో ముందంజ వేశారు. మాస్టర్స్‌తో పాటు రెండో బోర్డులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ కౌత్సవ్ కుండు(2429), తమిళనాడుకు చెందిన రాజు ఎస్(1872) మధ్య అత్యంత ఆసక్తికరంగా మ్యాచ్ సాగగా, కౌత్సవ్ కుండు విజయం సాధించాడు. అనేక మంది ఇంటర్నేషనల్ మాస్టర్స్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఫిడే మాస్టర్ ఆదిత్య వరుణ్ గంప(2194), జ్ఞానసాయి సంతోష్(2078), తెలంగాణకు చెందిన ఫిడే మాస్టర్లు మట్టా వినయ్‌కుమార్(2159) నాలుగు పాయింట్లతో ముందంజలో నిలిచారు. క్రీడా పోటీలను టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీం, చీఫ్ ఆర్బిటర్ వసంత్‌కుమార్,టోర్నీ డైరెక్టర్ విత్తనాల కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద వరద బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నియోజకవర్గంలో వరద బాధితులందరికీ పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ సీపీఎం బుధవారం ఆందోళనకు దిగింది. సుమారు ఆర్థిక సహాయం అందని 200 మంది బాధితులతో కలసి అజిత్‌సింగ్‌నగర్‌లోని నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా కార్యాలయం ఆవరణలోకి నేతలు వరద బాధితులతో కలిసి దూసుకెళ్లారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వరద సహాయం అందని బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్. బాబురావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కాశీనాథ్, రమణారావు, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం చౌకబారు రాజకీయాలు మానుకోవాలి : ఎమ్మెల్యే బొండా



సీపీఎం నేతలు కాలం చెల్లిన చౌకబారు రాజకీయాలు మానుకోవాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా ధ్వజమెత్తారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సీపీఎం నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరాన్ని ఫ్లాష్ ఫ్లడ్ ముంచెత్తిందని, అయినా కూడా కూటమి ప్రభుత్వం ప్రజలకు సకాలంలో భోజనం, మంచినీరు, నిత్యావసర సరుకులను అందజేసి ఆదుకుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆహారాన్ని ఇళ్లకు సరఫరా చేసిన ఘనత సీఎం దక్కుతుందన్నారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల పరిధిలోని ఎనిమిది డివిజన్లు కలిపి 70 వేల కుటుంబాలకు నేరుగా ఆర్థిక సహాయాన్ని బ్యాంకు ఖాతాల్లోకి వేయడం జరిగిందన్నారు. ఇంకా కొద్ది మందికి మాత్రం బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డుల్లో స్పష్టత లేనందున సహాయం అందడంలో జాప్యం జరిగినట్లు చెప్పారు. దీనిని ఆసరాగా చేసుకున్న సీపీఎం నేత బాబురావు అమాయక ప్రజలను రెచ్చగొట్టి రోడ్లపైకి తెచ్చి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక సహాయం అందని ప్రజలు ఓర్పుగా ఉండాలని త్వరలోనే అందరి ఖాతాలకు డబ్బులు అందుతాయని సూచించారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో అక్రమాలు

- మాజీ ఎంపీ శ్రీధర్ కార్యవర్గంపై విచారణ చేయండి
- వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 23 : ఎంపీ పదవి అడ్డం పెట్టుకుని కోటగిరి శ్రీధర్ దౌర్జన్యం చేసి వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో చొరబడి అక్రమ రీతిలో ఎన్నికలు నిర్వహించారని, ఇకనైనా వారి ఆగడాలకు చంద్రబాబు ప్రభుత్వం, శాప్ కల్పించుకుని అడ్డుకట్ట వేయాలని, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడలో ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అక్రమాలపై విచారణ కమిటీ వేయాలన్నారు. క్రికెట్ అసోసియేషన్ తరహాలో తమ అసోసియేషన్‌ను సైతం వైసీపీ నేతల కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగించాలని సీఎం చంద్రబాబును అభ్యర్థించారు. మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, డేనియల్ ప్రదీప్‌లు శాప్, ఫుట్‌బాల్ అసోసియేషన్‌లలో ప్రాథమిక సభ్యత్వం లేకుండానే వివిధ జిల్లాల్లో దొంగ సొసైటీ రిజిస్ట్రేషన్లతో నమోదు చేశారని ఆరోపించారు. కోటగిరి శ్రీధర్‌తో సహా ఏడుగురు రెండు లేదా అంతకంటే ఎక్కువ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్లలో సభ్యులుగా ఉన్నారని కొసరాజు తెలిపారు. రగ్బీ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్న రామాంజనేయులు ఫుట్‌బాల్ అసోసియేషన్లో ఓటరుగా ఉండటం విడ్డూరమన్నారు. అక్రమ ప్రవేశాలను నిలుపుదల చేయించి నిజమైన క్రీడా సంఘాలకు జీవం పోయాలని కొసరాజు గోపాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.







ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 24 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com


వరదరాజన్ జీవిత నేపథ్యం



రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివకార్తియేన్, సాయి పల్లవి నటించిన మూవీ 'అమరన్'. కమల్ హాసన్, మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈనెల 31న చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సినీ నటుడు నాని థియేట్రికల్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ మేజర్ ముకుంద్ వరదరాజన్ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని ట్రైలర్ పరిచయం చేస్తుంది. వరదరాజన్ పాత్రలో శివ కార్తికేయన్, అతని భార్యగా సాయి పల్లవి నటించారు. సినీ నటుడు నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి, సోదరి నిఖితా రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై విడుదల చేయనున్నారు.

ఆ కామెంట్స్ నన్నెంతో బాధించాయి

ఇటీవలే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సాయిపల్లవి మీడియాకు ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. గ్లామరస్ పాత్రలు చేయకపోవడంపై అడిగిన ప్రశ్నకు 'తాను కావాలనే ఆ నిర్ణయం తీసుకున్నట్లు' చెప్పారు. 'సినిమాల్లోకి రాకముందు వైద్య విద్య కోసం జార్జియా వెళ్లా. అక్కడ టాంగో డ్యాన్స్ నేర్చుకున్నా. డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా ఒక కాస్ట్యూమ్ ఉంటుంది. సౌకర్యంగా ఫీలయ్యాకే ఆ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నా. కొంతకాలానికి 'ప్రేమమ్'లో అవకాశం వచ్చింది. ఆ సినిమా విడుదలయ్యాక.. టాంగో డ్యాన్స్ వీడియోను పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. నెగటివ్ కామెంట్స్ చేశారు. అవి నన్నెంతో బాధించాయి. సినిమాల్లో శరీరం కనిపించే దుస్తులు వేసుకోకూడదని నియమంగా పెట్టుకున్నా' అని సాయి పల్లవి తెలిపారు.






తమిళ.. హిందీ భాషల్లో ఒకేసారి

డైరెక్టర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గజినీ' చిత్రం అప్పట్లో ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ సినిమాను మొదట తమిళ్‌లో సూర్యతో తెరకెక్కించి.. ఆ తర్వాత తెలుగులోనూ డబ్ చేశారు. రెండు భాషల్లోనూ సూపర్ హిట్‌గా నిలిచిందీ చిత్రం. ఇదే చిత్రాన్ని.. నిర్మాతలు అల్లు అరవింద్, మధు మంతెన మాతృక దర్శకుడు మురుగదాస్‌తో.. హిందీలో ఆమీర్‌ఖాన్ హీరోగా ఒరిజినల్ టైటిల్‌తోనే రీమేక్ చేశారు. ఈ సినిమా అక్కడా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. తాజాగా, ఈ సినిమా సీక్వెల్ పనులు మొదలయ్యాయి. నిర్మాతలు అల్లు అరవింద్, మధుమంతెన రెండో భాగానికి అవకాశం ఉందని సూర్యకు.. ఆమిర్‌ఖాన్‌కు చెప్పడంతో ఇద్దరూ ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. వచ్చే ఏడాదిలో స్క్రిప్టు పూర్తయ్యే అవకాశం ఉంది. స్క్రిప్టు పనులు పూర్తయ్యాక.. తమిళంలో సూర్యతో.. హిందీలో ఆమిర్‌ఖాన్‌తో ఒకేసారి షూటింగ్‌ను ప్రారంభిస్తారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ సినిమాను రెండు భాషల్లో ఒకేరోజు రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు 'దృశ్యం' ఫ్రాంఛైజీని కూడా ఇదే విధంగా మలయాళంలో.. హిందీలోనూ ఒకేసారి తెరకెక్కించాలని మేకర్స్ అనుకుంటున్నారు.

రూ. రెండు వేల కోట్లు వస్తే..

మాకు కోటే ఇచ్చారు





రెజ్లర్ బబితా ఫోగాట్ జీవిత కథ ఆధారంగా ఆమిర్‌ఖాన్ నటించిన 'దంగల్' చిత్రం 2016 డిసెంబర్ 23న విడుదలై వసూళ్ల పరంగా దుమ్ము రేపింది. ఆ సినిమా రూ.రెండు వేల కోట్లు కలెక్ట్ చేస్తే తమ కుటుంబానికి కోటి రూపాయలు మాత్రమే ఇచ్చారని బబిత ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'దంగల్' సక్సెస్ అయిన తర్వాత ఆమీర్‌ఖాన్ టీమ్‌ని తన తండ్రి మహావీర్ సంప్రదించారనీ, తమ గ్రామంలో అకాడెమీ నిర్మించడానికి సాయం చేయమని కోరితే, పట్టించుకోలేదని బబిత ఆరోపించారు. 'దంగల్' సినిమా ఎలా పుట్టిందో ఆమె వివరిస్తూ 'చండీగఢ్‌కు చెందిన ఓ విలేకరి నాన్న గురించి, మా అక్క గీత గురించి, నా గురించి ఓ ఆర్టికల్ రాశారు. అది చదివి దర్శకుడు నితీశ్ తివారీ టీమ్ నాన్నను సంప్రదించింది. మొదట్లో మా గురించి ఓ డాక్యుమెంటరీ తీస్తానని ఆయన చెప్పారు. తర్వాత మళ్లీ ఆయనే వచ్చి డాక్యుమెంటరీ కాదు.. సినిమా తీస్తామని చెప్పారు. కథ కూడా చెప్పారు. అది విని ఎంతో ఉద్వేగానికి లోనయ్యాం. అయితే సినిమాలో మా పేర్లు ఉండవనీ, మారుస్తున్నామనీ నితీశ్ చెప్పారు. కానీ నాన్న ఒప్పుకోలేదు.. మా పేర్లు ఉండాల్సిందేనన్నారు. 'దంగల్' సినిమా రిలీజ్ అయ్యాక మా ఫ్యామిలీ అంతా కలసి చూశాం. నా చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చాయి' అని బబిత చెప్పారు.

వరుడు ఎలా ఉండాలంటే...



విక్రాంత్, చాందినీ చౌదరి నటించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధురశ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం చాందినీ చౌదరి పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె ఓరుగంటి అనే పాత్రలో నటిస్తున్నారు. ఇందులో ఆమె పాత్ర.. తనకు కాబోయే వరుడు ఎలా ఉండాలో పెట్టిన షరతులు ఆసక్తికరంగా ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది ఈ చిత్రం.

వింటేజ్ లుక్‌లో రాజాసాబ్



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం 'రాజా సాబ్' పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనరుపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో అందరిలోనూ ఆసక్తి ఏర్పడింది. ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ 'రాజా సాబ్ ' మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రాజా సాబ్‌గా ప్రభాస్ వింటేజ్ లుక్ అదిరిపోయింది. 'హారర్ ఈజ్ ద న్యూ హ్యూమర్' అనే కాప్షన్ మోషన్ పోస్టర్ చివరిలో వేయడం ద్వారా ఒక కొత్త ట్రెండ్ సెట్ చేసే హారర్ ప్లస్ కామెడీ చిత్రమిది మేకర్స్ తెలియజేశారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 10న 'రాజా సాబ్' విడుదల కానుంది.

ఎడ్జ్ ఆఫ్ ద సీట్ థ్రిల్లర్



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు ఆంఢ్రూ బాబు. లండన్ గణేష్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మాతలు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఎడ్జ్ ఆఫ్ ద సీట్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం లండన్‌లో జరుగుతోంది. త్వరలోనే టైటిల్‌ను విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

కొత్తగా..

తండ్రీ కూతుళ్ల కథ



రమేశ్ చెప్పాల దర్శకత్వంలో సాయి రోనక్, ప్రగ్యా నాగ్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లగ్గం'. నిర్మాత వేణుగోపాల్ రెడ్డి. నేపథ్య సంగీతం మణిశర్మ. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. నటుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'లగ్గం చిత్రం ఒక తండ్రీ కూతుళ్ల కథ. ఈ చిత్రంలో తెలంగాణ బిడ్డగా నటించడం నా అదృష్టం' అని అన్నారు. 'ఎంతో మంది కలిసి పనిచేస్తేనే ఒక సినిమా పూర్తవుతుంది. లగ్గం చిత్రంతో ఒక మంచి మెసేజ్‌ని అందంగా చెప్పాలని అనుకున్నాం' అని చిత్ర నిర్మాత వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 'ఈ సినిమా అరిటాకులో వడ్డించిన విందు భోజనంలా ఉంటుంది' అని దర్శకుడు రమేశ్ చెప్పాల తెలిపారు.

మనసును మెలిపెట్టేలా...



శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వంలో టి.జి.విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా శివకుమార్ రామచంద్రవరపు, నితిన్‌ప్రసన్న మీడియాతో ముచ్చటించారు. శివకుమార్ రామచంద్రవరపు మాట్లాడుతూ "ఈ చిత్రంలో 'సత్య' అనే పాత్రలో నటించాను. నటుడు కావాలనే కోరికతో మొదలెట్టిన నా పాత్ర ప్రయాణం ఎలాంటి ఆసక్తికర మలుపులు తిరిగిందనేది కథాంశం' అని చెప్పారు. "ఈ సినిమాలో నా పాత్రకు మంచి గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉంది. దర్శకుడు రాసిన కథ, సంభాషణలు, సృష్టించిన పాత్రలు ప్రేక్షకులను మొదటి ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు కట్టిపడేసేలా ఉంటాయి" అని అన్నారు నితిన్ ప్రసన్న.

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 24 అక్టోబరు 2024

హర్మన్‌కు పరీక్ష



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్

నేడు తొలి పోరు

మ్యాచ్ మ. 1.30 నుంచి స్పోర్ట్స్ 18లో...

అహ్మదాబాద్: టీ20 ప్రపంచ కప్‌లో అంచనాలను అందుకోలేకపోయింది హర్మన్‌ప్రీత్ కౌర్ సేన. ఈనేపథ్యంలో వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్‌పై మన మహిళలు దృష్టి సారించారు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ ద్వారా మెగా టోర్నమెంట్ సన్నాహకాలను ఆరంభించనున్నారు. మొదటి మ్యాచ్ గురువారం జరగనుంది. తదుపరి రెండు వన్డేలకూ అహ్మదాబాదే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సిరీస్ కెప్టెన్ హర్మన్‌కు ఎంతో కీలకం. కారణం..ఇటీవలి ప్రపంచ కప్‌లో హర్మన్ సారథ్యంలో జట్టు గ్రూప్ దశనుంచే వెనుదిరగడం. పైగా..టీ20 వరల్డ్ కప్ గ్రూప్ ఆరంభ మ్యాచ్‌లో ఇదే న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడడం టోర్నీలో జట్టు అవకాశాలను దెబ్బతీసింది. మరోవైపు న్యూజిలాండ్ ప్రపంచ కప్‌ను కైవసం చేసుకొని ఉత్సాహంతో భారత్‌లో అడుగుపెట్టింది. టీ20 ప్రపంచ కప్‌లో దారుణ వైఫల్యం దరిమిలా హర్మన్ కెప్టెన్సీపై వేటు పడుతుందని అంచనా వేసినా..సెలెక్టర్లు ఆమెపై నమ్మకముంచారు. పైగా..ఇటీవలి కాలంలో 35 ఏళ్ల హర్మన్ సారథ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక..కివీస్‌తో సిరీస్‌కు రిచా ఘోష్, ఆల్‌రౌండర్ ఆశా శోభన అందుబాటులో ఉండడంలేదు. సీమర్ పూజా వస్త్రాకర్‌కు విశ్రాంతి నిచ్చారు. దాంతో పలువురు అన్‌క్యాప్డ్ క్రికెటర్లకు జట్టులో చోటు కల్పించారు. ఓపెనర్లు షఫాలీ వర్మ, మంధాన, జెమీమా, కౌర్‌లాంటి స్టార్లంతా పూర్తిస్థాయి ప్రదర్శన కనబరిస్తే తప్ప న్యూజిలాండ్‌ను అడ్డుకోవడం అంత సులభంకాబోదు.



2 టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత బ్యాటర్‌గా రికార్డుకు రోహిత్ రెండు సిక్సర్ల దూరంలో ఉన్నాడు.

పిచ్/వాతావరణం

పుణె పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. నల్లమట్టి వికెట్ కావడంతో పేసర్లకు పెద్దగా సహకరించే చాన్సులు లేవు. మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారవచ్చు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది. వాతావరణం సాధారణంగా ఉండనుంది.

ఒత్తిడిలో భారత్

- రెండో టెస్ట్ నేటి నుంచే
- గిల్‌కు చోటు.. ఫిట్‌గా పంత్

చరిత్ర కోసం కివీస్



పుణె: మొదటి టెస్ట్‌లో అనూహ్య పరాజయంతో ఉలిక్కిపడిన భారత్.. కసిగా బదులు తీర్చుకోవాలనుకొంటోంది. గురువారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే కీలక రెండో టెస్ట్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. మూడు టెస్టల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా 0-1తో వెనుకబడింది. సిరీస్‌ను సొంతం చేసుకోవాలంటే విగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవడం తప్పనిసరి కావడంతో రోహిత్ సేనపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అయితే, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో కూడా టీమిండియా ఇలాగే తొలి టెస్టులో ఓడినా.. ఆ తర్వాత చెలరేగి సిరీస్‌ను సొంతం చేసుకొంది. బెంగళూరు మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలడంతో కోలుకోలేక పోయిన భారత్.. చివరకు 8 వికెట్లతో పరాజయం పాలైంది. కానీ, వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టేబుల్‌లో టీమిండియా ఇంకా టాప్‌లోనే కొనసాగుతోంది. రాబోయేది ఆస్ట్రేలియా టూర్ కావడంతో.. స్వదేశంలో మిగిలిన రెండు టెస్టుల్లో విజయాలు సాధించి గెలుపు శాతాన్ని పెంచుకొంటేనే డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు బలపడతాయి. ఈ నేపథ్యంలో సొంతగడ్డపై ఉన్న అనుకూలతను భారత్ సొమ్ము చేసుకోవాలనుకొంటోంది. ఇందులో భాగంగా పుణెలో స్పిన్‌కు సహకరించే మందకొడి వికెట్‌తో లాభం పొందాలని చూస్తోంది. కానీ, గతంలో టర్నింగ్ వికెట్ వ్యూహం బెడిసికొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎనిమిదేళ్ల క్రితం పుణెలో జరిగిన టెస్ట్‌లో ఆసీస్ 8 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జట్టు కూర్పుపై మేనేజ్‌మెంట్ దృష్టిసారించింది.

సర్ఫరాజ్ లేదా రాహుల్: మెడ నొప్పితో తొలి మ్యాచ్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్‌కు తుది జట్టులో చోటు ఖాయం కావడంతో.. కేఎల్ రాహుల్, సర్ఫరాజ్‌లో ఒకరు బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశం ఉంది. బెంగళూరు టెస్ట్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో సర్ఫరాజ్ గట్టిపోటీ ఇస్తుండగా.. రాహుల్ వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. కానీ, కోచ్ గంభీర్ మాత్రం రాహుల్‌కు మద్దతుగా నిలుస్తుండడం విశేషం. ఇక, రోహిత్‌కు శుభారంభాలు దక్కినా.. భారీస్కోర్లుగా మలచలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2019-20లో దక్షిణాఫ్రికాపై కోహ్లీ (254 నాటౌట్) ఇదే వికెట్‌పై డబుల్ సెంచరీ చేశాడు. దీంతో అతడు మరోసారి తన బ్యాటింగ్ మ్యాజిక్‌ను ప్రదర్శించాలని ఫ్యాన్స్ బలంగా కోరుకొంటున్నారు. వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఫిట్‌గా ఉన్నట్టు గంభీర్ చెప్పడంతో తుది జట్టులో అతడికి చోటుదక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సిరాజ్ ఆకట్టుకోలేక పోతుండడంతో అతడి స్థానంలో ఆకాశ్‌దీప్‌కు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. అశ్విన్‌తోపాటు జడేజా, కుల్దీప్‌తో స్పిన్ విభాగం బలంగా ఉంది. ఒకవేళ ఆల్‌రౌండర్ సుందర్‌ను తీసుకోవాలనుకొంటే అశ్విన్‌ను పక్కన బెట్టే అవకాశం లేకపోలేదు. మరోవైపు ఊహించని రీతిలో బోణీ కొట్టిన న్యూజిలాండ్.. ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈ మ్యాచ్‌తోపాటు సిరీస్‌ను సొంతం చేసుకొని చరిత్ర సృష్టించాలనుకొంటోంది. స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ లేకపోయినా.. కాన్వే, లాథమ్, యంగ్‌తోపాటు రచిన్ రవీంద్ర అద్భుత బ్యాటింగ్‌తో చిరస్మరణీయ విజయాన్ని అందించారు. స్పిన్ పిచ్ కావడంతో బౌలింగ్ విభాగంలో మార్పులు చేసే చాన్సులున్నాయి. సౌథీని పక్కనబెట్టి శాంట్నర్‌ను జట్టులోకి తీసుకోవచ్చు.

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో ..

జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రోహిత్, గిల్, కోహ్లీ, రిషబ్ పంత్, రాహుల్/సర్ఫరాజ్, జడేజా, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్/ఆకాశ్‌దీప్,

న్యూజిలాండ్: టామ్ లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్ రవీంద్ర, మిచెల్, బ్లండెల్ (వికెట్ కీపర్), ఫిలిప్స్, శాంట్నర్, సౌథీ/ఓ రోర్క్, హెన్రీ, ఎజాజ్ పటేల్.

టీ20ల్లో 344/4

అత్యధిక స్కోరుతో జింబాబ్వే ప్రపంచ రికార్డు



నైరోబీ: టీ20 క్రికెట్‌లో అత్యధికంగా 344 పరుగులు సాధించిన జట్టుగా జింబాబ్వే చరిత్ర సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ సబ్ రీజినల్ ఆఫ్రికా క్వాలిఫయర్స్ గ్రూప్-బిలో బుధవారం గాంబియాతో మ్యాచ్‌లో జింబాబ్వే 290 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 4 వికెట్లకు 344 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ క్రమంలో గతేడాది ఆసియా క్రీడల్లో మంగోలియాపై నేపాల్ సాధించిన 314 పరుగుల రికార్డును అధిగమించింది. సికందర్ రజా (43 బంతుల్లో 7 ఫోర్లు, 15 సిక్సర్లతో 133 నాటౌట్)తోపాటు టి.మరుమణి (19 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 62), క్లైవ్ మడండే (53 నాటౌట్), బ్రియాన్ బెన్నెట్ (50) రాణించారు. జింబాబ్వే తరపున టీ20ల్లో శతకం సాధించిన తొలి ఆటగాడిగా రజా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇక ఛేదనలో గాంబియా 14.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. రిచర్డ్ ఎన్‌గర్వ, బ్రండన్ మవుటా చెరో 3 వికెట్లు పడగొట్టాడు.

103 బంతుల్లో డబుల్ సెంచరీ



కివీస్ క్రికెటర్ వరల్డ్ రికార్డు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ ఓపెనర్ చాడ్ బౌస్ లిస్ట్ 'ఏ' క్రికెట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అతి తక్కువ బంతుల్లో డబుల్ సెంచరీ చేసిన ఘనత అందుకున్నాడు. న్యూజిలాండ్ దేశవాళీ ఫోర్డ్ ట్రోఫీ వన్డే టోర్నీలో కాంటర్‌బ్రీ తరపున ఒటాగోపై ఆడిన బౌస్ కేవలం 103 బంతుల్లో ద్విశతకం చేశాడు. దాంతో 50 ఓవర్ల ఫార్మాట్‌లో.. భారత బ్యాటర్ నారాయణన్ జగదీశన్, ఆసీస్ ఆటగాడు ట్రావిస్ హెడ్ (114 బంతులు) పేరిట ఉన్న గత రికార్డులను బౌస్ బద్దలు గొట్టాడు. కాగా..205 పరుగులకు బౌస్ అవుటయ్యాడు. 32 ఏళ్ల బౌస్ గతంలో వన్డే, టీ20లలో న్యూజిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

చాంపియన్‌కు తలైవాస్ షాక్

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఇక్కడ జరిగిన పోరులో తలైవాస్ 35-30తో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్‌కు షాకిచ్చింది. తలైవాస్ రైడర్లు నరేందర్ కండోలా 9, సచిన్ 8 పాయింట్లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక, పుణెరి జట్టులో రైడర్ మోహిత్ గోయత్ 13 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. ఇక.. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యు ముంబా జట్టు 33-27తో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది.

కోహ్లీని దాటేసిన పంత్



దుబాయ్: న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఒక్క పరుగుతో సెంచరీ చేజార్చుకున్న వికెట్‌కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లాడు. బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టేసిన పంత్.. ఏకంగా మూడు స్థానాలు మెరుగుపరచుకొని ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. కోహ్లీ ఓ స్థానం కోల్పోయి 8వ స్థానంలో నిలిచాడు. యశస్వీ జైస్వాల్ నాలుగో ర్యాంక్‌తో భారత్ నుంచి టాపర్‌గా ఉన్నాడు. కెప్టెన్ రోహిత్ 15వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. జో రూట్ టాప్‌లో ఉన్నాడు. బౌలింగ్ ర్యాంకుల్లో బుమ్రా నెంబర్‌వన్‌లో ఉండగా, అశ్విన్ 2, జడేజా 7 స్థానాలు నిలబెట్టుకున్నారు.

కష్టాల్లో బంగ్లాదేశ్

దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

మీర్పూర్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఓటమి దిశగా పయనిస్తోంది. మ్యాచ్‌కు మూడోరోజైన బుధవారం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 283 పరుగులు చేసింది. చేతిలో మరో 3 వికెట్లే మిగిలివున్న పరిస్థితుల్లో బంగ్లా కేవలం 83 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 101/3తో బ్యాటింగ్ కొనసాగించిన బంగ్లా జట్టులో మెహ్దీ హసన్ (87 బ్యాటింగ్), జాకెర్ అలీ (58) అర్ధ శతకాలతో రాణించారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 138 పరుగులు జోడించడంతో ఆతిథ్య జట్టు కోలుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106, దక్షిణాఫ్రికా 308 పరుగులు చేశాయి.

హాకీలో భారత్‌కు నిరాశ

న్యూఢిల్లీ: జర్మనీతో రెండు మ్యాచ్‌ల హాకీ టెస్ట్ సిరీస్‌ను భారత్ పరాజయంతో ప్రారంభించింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 0-2తో ఓటమి పాలైంది. రెండో మ్యాచ్ గురువారం జరగనుంది.

కుర్రాళ్లకు తొలి ఓటమి: సుల్తాన్ జోహర్ కప్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న భారత జూనియర్ జట్టుకు ఆస్ట్రేలియాకు ఝలకిచ్చింది. బుధవారం జరిగిన పోరులో యువ భారత్ 0-4 తేడాతో చిత్తయింది.

'ఎమర్జింగ్' కప్‌లో భారత్ హ్యాట్రిక్

అల్ అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ నేషన్స్ కప్ టీ20 టోర్నమెంట్‌లో యువ భారత్ హ్యాట్రిక్ విజయంతో అదరగొట్టింది. ఇప్పటికే సెమీఫైనల్లోకి ప్రవేశించిన భారత్ 'ఏ' బుధవారం జరిగిన గ్రూప్ 'బి' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 6 వికెట్లతో ఒమన్‌ను చిత్తుచేసింది. మొదట ఒమన్ 20 ఓవర్లలో 140/5 చేసింది. ఛేదనలో భారత్ 15.2 ఓవర్లలో 146/4 స్కోరు చేసింది. బదోనీ (51), కెప్టెన్ తిలక్ వర్మ (36 నాటౌట్) మెరిశారు. శుక్రవారం జరిగే సెమీస్‌లో అఫ్ఘానిస్థాన్‌తో భారత్ తలపడనుంది. మరో సెమీస్‌లో శ్రీలంక, పాకిస్థాన్ జట్లు ఢీకొంటాయి.

బిజినెస్



ఈ స్మార్ట్‌వాచ్ రూ.86,990

స్విట్జర్లాండ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్మార్ట్ టెక్నాలజీ ఉత్పత్తుల కంపెనీ గార్మిన్ బుధవారం భారత మార్కెట్లోకి ఫీనిక్స్ 8 సిరీస్ స్మార్ట్‌వాచ్‌లను ప్రవేశపెట్టింది. రెండేళ్ల వారంటీతో లభించే ఈ ప్రీమియం మల్టీ స్పోర్ట్ జీపీఎస్ స్మార్ట్‌వాచ్ ప్రారంభ ధర రూ.86,990. క్రీడాకారులు, సాహసయాత్రలు చేపట్టేవారి కోసం అత్యాధునిక కమ్యూనికేషన్, ట్రాకింగ్ ఫీచర్లతో ఈ వాచ్‌ను డిజైన్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది.

హెరిటేజ్ ఫుడ్స్ ఆర్థిక ఫలితాలు అదుర్స్

క్యూ2లో రూ.48.6 కోట్ల నికర లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ సెప్టెంబరు త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,019.5 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.83.2 కోట్ల స్థూల లాభం, రూ.48.6 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 4.2 శాతం మాత్రమే పెరిగినా, స్థూల లాభం 76.8 శాతం, నికర లాభం 117 శాతం పెరిగాయి. ఒక త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1,000 కోట్లు మించడం ఈ సంవత్సరం ఇది రెండోసారని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కంపెనీ రూ.2,052.2 కోట్ల ఆదాయంపై రూ.177 కోట్ల స్థూల లాభం, రూ.107.1 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 7.9 శాతం మాత్రమే పెరిగినా, స్థూల లాభం 102.7 శాతం, నికర లాభం 173 శాతం పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ రోజుకు సగటున 16.4 లక్షల లీటర్ల పాలు సేకరించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11.46 శాతం అధికం.

కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకోవచ్చు

పేటీఎంకు ఎన్‌పీసీఐ అనుమతి

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేటీఎం కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకునేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. గత కొంతకాలంగా వరుస సమస్యలతో సతమతమవుతున్న పేటీఎంకు ఇది ఊరటనిచ్చే అంశం. ఎందుకంటే, ఈ ఏడాది జనవరిలో పేటీఎం అనుబంధ కంపెనీ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌పై (పీపీబీఎల్) ఆర్‌బీఐ పలు ఆంక్షలు విధించింది. పీపీబీఎల్ డిపాజిట్లు స్వీకరించకుండా నిషేధించడంతోపాటు కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతోపాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది. ఎన్‌పీసీఐ తాజా అనుమతులతో పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు బీఎస్ఈలో ఏకంగా 8.40 శాతం ఎగబాకి రూ.745 వద్దకు చేరుకుంది.

మూడో రోజూ నష్టాలే

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 138.74 పాయింట్ల నష్టంతో 80,081.90 వద్ద, నిఫ్టీ 36.60 పాయింట్ల నష్టంతో 24,435.50 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 80,000 పాయింట్ల దిగువకు పడిపోయి 79,891.68 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. ఉదయం కొద్ది పాటి లాభాలతో ప్రారంభమైన సూచీలు, మధ్యాహ్నం నుంచి ఆటో, ఫార్మా, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలతో నష్టపోయాయి.

ఇండోఫాస్ట్ ఎనర్జీతో రాపిడో భాగస్వామ్యం

హైదరాబాద్: దేశంలోని ప్రధాన నగరాల్లో పియాజియో స్వాపబుల్ విద్యుత్ త్రీ వీలర్లు ప్రవేశపెట్టడానికి ఇండోఫాస్ట్ ఎనర్జీతో రాపిడో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద రాబోయే 24 నెలల కాలంలో వివిధ నగరాల్లో 10 వేల ఈ-సిటీ మ్యాక్స్ త్రీవీలర్లు ప్రవేశపెడతారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నింటికీ ఈ భాగస్వామ్యం విస్తరిస్తుంది. ఇండోఫాస్ట్‌తో భాగస్వామ్యం వల్ల తాము ఈవీ ప్లాట్‌ఫారం విస్తరించేందుకు వీలు కలుగుతుందని రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి అన్నారు.

బిగ్ సి దీపావళి డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ రిటైలింగ్‌లో అగ్రగామి బిగ్ సి దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తమ కస్టమర్లకు డబుల్ ధమాకా ఆఫర్లు ప్రకటించింది. కస్టమర్లకు తాము నాలుగు ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ బాలు చౌదరి చెప్పారు. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 విలువ గల మొబైల్ ప్రొటెక్షన్, రూ.12 వేల వరకు తక్షణ క్యాష్‌బాక్, రూ.5,999 విలువ గల కచ్చితమైన బహుమతి అందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. అలాగే ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్ కొనుగోలు చేసే సదుపాయం కూడా కల్పించినట్టు చెప్పారు. అంతే కాదు...వివో, ఒప్పో, ఎంఐ, రియల్ మీ ఫోన్ల కొనుగోలుపై లక్కీ డ్రాలో కార్లు, బైక్‌లు, మొబైల్ సహా మరెన్నో బహుమతులు అందిస్తున్నామన్నారు. ఇవి కాకుండా కచ్చితమైన బైబ్యాక్ ఆఫర్, జోడీ ఆఫర్, స్మార్ట్ టీవీ ఆఫర్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్, స్మార్ట్ టీవీ, లాప్‌టాప్, ఏసీ కొనుగోలు ఆఫర్ అందిస్తున్నామన్నారు.

ఏడీఐఏ నుంచి రూ.6,300 కోట్ల రుణం: జీఎంఆర్ గ్రూప్

న్యూఢిల్లీ : అబు దాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) నుంచి రూ.6,300 కోట్ల రుణాలుసమీకరించనున్నట్టు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. రెగ్యులేటరీ సంస్థల అనుమతులకు లోబడి జీఎంఆర్ గ్రూప్‌నకు ఏడీఐఏ ఈ రుణం సమకూర్చనుంది. ఈ నిధులను జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఈపీఎల్) విదేశీ రుణాల చెల్లింపుకు ఉపయోగిస్తామని కంపెనీ తెలిపింది. జీఈపీఎల్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) కంపెనీ ప్రమోటర్ కూడా. జీఏఎల్ ప్రస్తుతం దేశంలో హైదరాబాద్, ఢిల్లీ, గోవా ఎయిర్‌పోర్టులతో పాటు ఇండోనేషియా, ఫిలిప్పీన్స్‌లో రెండు విమానాశ్రయాలు నిర్వహిస్తోంది.

హెచ్‌యూఎల్ డివిడెండ్ బొనాంజా

ఒక్కో షేరుకు రూ.29 చెల్లింపు

క్యూ2 లాభం రూ.2,595 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయాయి. సెప్టెంబరు త్రైమాసికానికి హెచ్‌యూఎల్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 2.33 శాతం తగ్గి రూ.2,595 కోట్లకు పరిమితమైంది. ఖర్చులు పెరగడంతోపాటు అర్బన్ మార్కెట్లో వస్తు గిరాకీ మందగించడం ఇందుకు కారణం. అయితే కంపెనీ విక్రయాలు మాత్రం 2.36 శాతం పెరిగి రూ.15,703 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం వ్యయాలు 3.03 శాతం పెరుగుదలతో రూ.12,581 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.19 మధ్యంతర డివిడెండ్‌తోపాటు రూ.10 ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించింది. అంటే, వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.29 డివిడెండ్ లభించనుంది. ఇప్పటివరకు కంపెనీ ఒక త్రైమాసికంలో చెల్లిస్తున్న అత్యధిక డివిడెండ్ ఇదే. ఇందుకు నవంబరు 6ను రికార్డు తేదీగా, 21ని చెల్లింపుల తేదీగా నిర్ణయించింది. కంపెనీ డివిడెండ్ రూపంలో వాటాదారులకు మొత్తం రూ.6,814 కోట్లు చెల్లించనుంది.

ఐస్‌క్రీమ్ వ్యాపార విభజన: ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని విభజించాలని హెచ్‌యూఎల్ బోర్డు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఈ ఏడాది చివరినాటికి ఖరారు చేయనున్నట్టు కంపెనీ సీఈఓ రోహిత్ జావా చెప్పారు. మార్కెట్లో లభించే క్వాలిటీ వాల్స్ ఐస్‌క్రీమ్ బ్రాండ్ ఈ కంపెనీదే. కంపెనీ మొత్తం టర్నోవర్‌లో ఈ విభాగం వాటా 3 శాతంగా ఉంది.

టీవీఎస్ మోటార్ లాభం 41% అప్

సెప్టెంబరు త్రైమాసికంలో టీవీఎస్ మోటార్ కంపెనీ ఏకీకృత నికర లాభం 41.4 శాతం వృద్ధితో రూ.588.13 కోట్లకు చేరుకుంది. కంపెనీ రికార్డు స్థాయిలో వాహన విక్రయాలు జరపడం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ ఆదాయం సైతం రూ.11,301.68 కోట్లకు ఎగబాకింది. కాగా, వ్యయాలు సైతం రూ.10,427.64 కోట్లకు పెరిగాయి. ఈ జూలై-సెప్టెంబరులో టీవీఎస్ మొత్తం 12.28 లక్షల యూనిట్ల ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను విక్రయించింది. కంపెనీ చరిత్రలో అత్యధిక త్రైమాసిక విక్రయాలివి.

ఎస్‌బీఐ లైఫ్ లాభం రూ.529 కోట్లు

రెండో త్రైమాసికంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 39 శాతం వృద్ధి చెంది రూ.529 కోట్లకు ఎగబాకింది. మొత్తం ఆదాయం రూ.40,015 కోట్లకు పెరిగింది. కంపెనీ నికర ప్రీమియం వసూళ్లు రూ.20,266 కోట్లుగా నమోదయ్యాయి. తొలి ఏడాది ప్రీమియం ఆదాయం రూ.4,916 కోట్లుగా ఉంది. కాగా, సెప్టెంబరు 30 నాటికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల 28 శాతం పెరుగుదలతో రూ.4.4 లక్షల కోట్లకు చేరుకుంది. కంపెనీ నెట్‌వర్త్ 16 శాతం పెరిగి రూ.16,260 కోట్లుగా నమోదైంది.

నష్టాల్లో సాగర్ సిమెంట్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక సాగర్ సిమెంట్స్ రెండో త్రైమాసికంలో రూ.4,79.96 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.56.98 కోట్ల నష్టం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ సిమెంట్ అమ్మకాలు 13.12 లక్షల టన్నుల నుంచి 12 శాతం తగ్గి 11.6 లక్షల టన్నులకు పడిపోయాయి. దీంతో ఆదాయం 19 శాతం తగ్గింది. ఇదే సమయంలో కంపెనీ నష్టాలు రూ.10.85 కోట్ల నుంచి రూ.56.98 కోట్లకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కూడా ఆదాయం రూ.1,133.14 కోట్ల నుంచి ఏడు శాతం తగ్గి రూ.1,048.86 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ నష్టాలు రూ.53.13 కోట్ల నుంచి రూ.89.18 కోట్లకు చేరాయి.

కార్యాలయ స్థలం సగటు అద్దె రూ.101

కొలియెర్స్ నివేదిక



న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల సగటు అద్దె కొవిడ్ ముందు కాలంలో ఉన్న స్థాయి కన్నా పైకి చేరింది. చదరపు అడుగు సగటు అద్దె రూ.100 దాటింది. గత ఐదు సంవత్సరాల కాలంలో సగటు అద్దె 2 శాతం మేరకు పెరిగి రూ.101.3కి చేరిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కోలియెర్స్ ఇండియా తాజా నివేదికలో తెలిపింది. 2019 సంవత్సరంలో ఇది రూ.99.5 ఉంది. అయితే కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కాలంలో కార్యాలయ స్థలాలకు డిమాండు గణనీయంగా పడిపోవడంతో 2023లో ఇది రూ.97.1కి దిగజారింది. 2021లో మరింత తగ్గి రూ.94.8కి పడిపోయింది. కాని కొవిడ్ ప్రభావం తగ్గిన అనంతరం 2022 నుంచి కార్యాలయ అద్దెల్లో ఎగువకు కదలిక ప్రారంభమయిందని, అద్దెలు క్రమంగా పుంజుకుంటూ ఇప్పుడవి ఈ స్థాయికి చేరాయని పేర్కొంది.

హైదరాబాద్‌లో రూ.76.7: చదరపు అడుగు అద్దె రూ.151.6తో ముంబై ఆరు నగరాల్లో అగ్రస్థానంలో నిలవగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రూ.105.9 ఉంది. ఇతర నగరాల విషయానికి వస్తే బెంగళూరులో రూ.96.7, పుణెలో రూ.81.6, చెన్నైలో రూ.77.8 ఉండగా హైదరాబాద్‌లో రూ.76.7 పలుకుతోంది. అయితే ఇందులో కామన్ ఏరియా మెయింటెనెన్స్ లేదా పన్నులు కలిసి లేవు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,070 ▲	73,500 ▲	1,12,000 ▲
ముంబై	78,690 ▲	72,080 ▲	98,860 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	568	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	124
కర్నూలు	120	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	130		



పదేళ్ల కష్టం పది నిమిషాల్లో కరిగిపోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి పతకానికి అడుగు దూరంలో నిష్క్రమించింది. ఓటమి నుంచి నేర్చుకున్న గుణపాఠంతో మరో ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు నడుం బిగించింది. పరాజయానికి సాకులు వెతుక్కోకుండా కొత్త చరిత్రను రాసే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించేందుకు సన్నద్ధమవుతోంది. ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ **నిఖత్ జరీన్** పారిస్ ఒలింపిక్స్ విశేషాలతో పాటు తన భవిష్యత్ ప్రణాళికల గురించి 'నవ్య'తో పంచుకుంది.

నాకు తెలిసింది నలుగురికీ పంచుతా..

"ఓటమి నుంచి పుట్టే బాధ, కసి తప్పకుండా ఏదొక రోజు విజయానికి దగ్గర చేస్తాయి. మూడు నెలల విరామం తర్వాత తిరిగి ప్రాక్టీసు ప్రారంభించా. పారిస్ ఒలింపిక్స్‌లో ఎదురైన ఓటమితో పదేళ్ల శ్రమ, కష్టం, కాలం, చేసిన త్యాగాలన్నీ ఒక్క క్షణంలో చేతుల్లో నుంచి జారిపోయినట్టు అనిపించింది. టోక్యో ఒలింపిక్స్ బెర్త్ అందినట్టే అంది చేజారిన తర్వాత పారిస్ ఒలింపిక్స్‌పై గంపెడు ఆశలు పెట్టుకున్నా. అందుకు తగ్గట్టే సాధన చేశా. కానీ కొన్ని ప్రతికూల పరిస్థితులు పతకానికి దూరం చేశాయి. ఏదేమైనా 2028 ఒలింపిక్స్‌లోనైనా దేశానికి బాక్సింగ్‌లో పతకం అందించేందుకు మరో నాలుగేళ్లు శ్రమిస్తా.

క్రీడలను కెరీర్‌గా ఎంచుకోండి..

ఒకప్పుడు క్రీడలంటే అత్యధిక శాతం మంది కేవలం కాలక్షేపంగా చూసేవారు. ఆడపిల్లలు ఆడతామంటే 'మగరాయుడిలా నిక్కర్లు వేసుకొని గ్రౌండ్లో ఉరుకులు-పరుగులు పెడతావా?' లాంటి మాటలతో క్రీడలకు దూరం చేసేవారు. ఈ రకమైన దృక్పథం ఉన్న తల్లిదండ్రులు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాలి. మగ, ఆడ అనే తేడా లేకుండా క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందుకు పిల్లలను ప్రోత్సహించాలి. నేను బాక్సర్‌గా 12 ఏళ్ల పాటు పడిన కష్టానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో నాకు డీఎస్పీ ఉద్యోగమిచ్చింది. వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ అయ్యా. కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించా. క్రీడల ద్వారా కూడా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు అనే దానికి నేనే ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

బాడీ షేమింగ్ పట్టించుకోవద్దు...

నేను బాక్సింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంటానని ఇంట్లో చెప్పినప్పుడు మా అమ్మ చాలా వారించింది. నీ ముఖానికి దెబ్బలు తగిలితే నిన్ను ఎవరు పెళ్లి చేసుకుంటారని బాధపడింది. నువ్వు చేసే వ్యాయామాలకు నీ శరీర ఆకృతి మగవారిలా మారిపోతుందేమోనని ఆందోళన చెందింది. అవన్నీ అపోహలేనని నేను ఆమెతో చెప్పా. వారివారి శరీర నిర్మాణం, కండరాలు, హార్మోన్లు బట్టే శరీర ఆకృతిలో మార్పులు వస్తాయి తప్ప మరొకటి కాదు. నేను బాక్సింగ్‌లో రాణిస్తూ ఒక్కో మెట్టు ఎక్కేకొద్దీ ఆమె ఆలోచనా సరళి మారిపోయింది. ఇప్పుడామె నాకు పెద్ద మద్దతుదారు. సోషల్ మీడియాలో నటీమణులు సమంత, రష్మిక మందాన లాంటి వారిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేస్తూ పలువురు నెటిజన్లు పెట్టే కామెంట్లు చూసి నాకు ఒళ్లు మండుతుంది. జీవితంలో ఏమీ సాధించలేని, చేతకాని వారు, పనీ పాట లేనివారే అలాంటి చెత్త వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తుంటారు. అలాంటి దిక్కుమాలిన వారి మాటలను అసలు పట్టించుకోవద్దు. లక్ష్యాలను చేరుకోవాలంటే పట్టుదలతో కష్టపడి పని చేయడం ఒక్కటే మార్గం.

> **పటియాలా వెళ్లాల్సిందే...**
> బాక్సింగ్‌లో ప్రాథమిక శిక్షణ ముగిశాక ప్రావీణ్యం సాధించాలంటే పటియాలలోని 'సాయ్' కేంద్రం లేదంటే బళ్లారిలోని జేఎస్‌డబ్ల్యూ అకాడమీలకు వెళ్లాల్సిందే. సాయ్ సెంటర్‌లో ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వడానికి అవకాశం లేదు. అక్కడ ఒక్కొక్కరిపై వ్యక్తిగతంగా దృష్టి కేంద్రీకరించి చెప్పేంత సిబ్బంది లేరు. బళ్లారిలోని జేఎస్‌డబ్ల్యూ శిక్షణ కేంద్రం విషయానికొస్తే నెలకు లక్షన్నర ఖర్చు పెట్టి శిక్షణ తీసుకోవాలి. డైట్, ఇతరత్రా ఖర్చులు అదనం. నాలాంటి అంతర్జాతీయ బాక్సర్లకు సైతం దేశంలో శిక్షణ తీసుకోవాలంటే ఈ రెండే ఆప్షన్స్

కచ్చితంగా అలవర్చుకోవాలి...

క్రీడలు, చదువు, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. విద్య, వ్యాపార, ఉద్యోగాల ద్వారా కొంత మేర ఆర్థిక స్వావలంబన, స్వేచ్ఛ సాధించారు. అయితే, రెండు అంశాల్లో మాత్రం అలక్ష్యం వహిస్తున్నారు. ఒకటి ఫిట్‌నెస్‌ను పట్టించుకోకపోవడం, రెండోది ఏదైనా ఆపద ఎదురైతే తమను తాము రక్షించుకునే విషయంలో ఇప్పటికీ వేరేవారిపై ఆధారపడడం. అలా కాకుండా రోజూ ఉదయం కొద్దిసేపు వ్యాయామం చేయడం అలవర్చుకోవాలి. దీంతో పాటు కరాటే, తైక్వాండో వంటి ఏదైనా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే విపత్కర పరిస్థితుల్లో పోరాడడానికి, ఆత్మరక్షణకు ఉపకరిస్తాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారికి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించేందుకు ముందుకు రావాలి. మరో ముఖ్యమైన విషయమేంటంటే స్వేచ్ఛ అవసరమే కానీ కొన్ని విషయాల్లో జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. కొత్త ప్రదేశాలకు వెళ్తున్నప్పుడు, స్నేహితులతో పార్టీలకు వెళ్లేప్పుడు ఇంట్లో ఎవరికైనా సమాచారం ఇచ్చి వెళ్తే ఊహించని ఇబ్బందులు ఎదురైనప్పుడు వారు వెంటనే స్పందించి, సహాయం చేయడానికి వీలుంటుంది.

2028 ఒలింపిక్స్ కోసం మార్పులు...

వచ్చే ఒలింపిక్స్‌లో 54 కిలోల వెయిట్ కేటగిరీలో పోటీ పడాలని నిర్ణయించుకున్నా. ఇది కొంచెం కష్టమైనా అందుకు తగ్గట్టు ఇప్పటినుంచి నా శరీరాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉంది. పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో ఎదురైన ఓటమికి సాకులు చెప్పదలచుకోలేదు. సీడింగ్‌లో వ్యత్యాసాలతో పాటు వెంటవెంటనే బౌట్లు రావడంతో కావాల్సినంత విశ్రాంతి దొరకలేదు. శక్తి కోసం నిర్దిష్ట డైట్ తీసుకోవాలి. పోటీకి ముందు బరువు పెరగకుండా జాగ్రత్తగా ఉండాలి. వీటన్నింటితో పాటు క్వార్టర్స్, ప్రీక్వార్టర్స్ బౌట్‌కు నడుమ 12 గంటలే వ్యవధి ఉండడంతో సరిగ్గా సన్నద్ధం కాలేకపోయా. దాంతో గతంలో నేను ఓడించిన బాక్సర్లు సెమీస్, ఫైనల్‌కు వెళ్లారు. ఒలింపిక్స్‌లో నేను పతకం సాధించలేకపోవడానికి ఈ రెండే కారణాలు.

అకాడమీ పెట్టే ఆలోచన ఉంది...

పటియాలా, బళ్లారి మినహా దేశంలో మరెక్కడా బాక్సింగ్‌లో హైలెవల్ శిక్షణ తీసుకునే ఆస్కారం లేకపోవడంతో నేను కూడా తరచూ అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. సామాన్య, వర్ధమాన బాక్సర్లకైతే ఇక్కడ శిక్షణ తీసుకోవడం ఆర్థికంగా చాలా భారంతో కూడిన విషయం. ఈ విషయంలో కెరీర్ ప్రారంభంలో నేను అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. ప్రభుత్వం ముందుకొచ్చి చేయూతనిస్తే అకాడమీ నెలకొల్పుతా. వచ్చే ఒలింపిక్స్‌కు నేను ఇక్కడ నుంచే సాధన చేస్తూ నాతో పాటు మరికొందరు తెలంగాణ బాక్సర్లకు అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడానికి అవకాశముంటుంది. ఉత్తరాదిలో వెటరన్ బాక్సర్లు మేరీకోమ్, విజేందర్‌సింగ్ అకాడమీలు నెలకొల్పడానికి స్థానిక ప్రభుత్వాలు సాయం చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ముందుకొస్తే హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీ ఏర్పాటు చేసి, నేను నేర్చుకుంది.. నాకు తెలిసింది నలుగురికీ పంచుతా. ప్రతిభావంతులైన పేదపిల్లలకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు నా వంతు కృషి చేస్తా.

● సంజయ్ ఎస్ఎస్‌బి

> సోషల్ మీడియాలో నటీమణులు సమంత, రష్మిక మంధాన వంటి వారిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేస్తూ పలువురు నెటిజన్లు పెట్టే కామెంట్లు చూసి నాకు ఒక్కోసారి ఒళ్లు మండుతుంది. జీవితంలో ఏమీ సాధించలేని చేతకాని వారు, పనీ పాట లేని వారే అలాంటి చెత్త వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తుంటారు.




బాధ్యతను పెంచింది

నాకు ఐఏఎస్ స్థాయి ఉద్యోగమిస్తానన్నా పోలీసు డిపార్టుమెంటు అంటే ఉన్న ఇష్టంతో స్వీకరించలేదు. పోలీసు ఉద్యోగం అంటే బాల్యం నుంచి ఇష్టం. ఆపదలో ఉన్నవారికి సహాయం చేసే గొప్ప వృత్తిగా దానిపై నాకు గౌరవం. ఇటీవలే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించా. ఇది నాపై మరింత బాధ్యతను పెంచింది. ప్రస్తుతానికి పోస్టింగ్ ఇంకా ఇవ్వలేదు. ఆ ప్రాసెస్ నడుస్తోంది. పూర్తి స్థాయిలో బాధ్యతలు తీసుకున్నాక నా పరిధిలోకి వచ్చే సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి బాధితలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తా.

బ్లౌజ్ మేనియా!

పండగ వచ్చిదంటే కొత్త ట్రెండ్స్ కోసం మహిళలందరూ ఎదురుచూస్తూ ఉంటారు. ఈ పండగకు రకరకాల బ్లౌజ్ డిజైన్లు మార్కెట్లోకి ప్రవేశించాయి. ఆ డిజైన్స్ ఏమిటో.. అవి ఎలాంటి చీరలపై ధరించటానికి పనికొస్తాయో చూద్దాం..

మిర్రర్ వర్క్ బ్లౌజ్‌లు



బ్లౌజ్‌లపై అద్దాలను కుట్టడం ఒకప్పటి ఫ్యాషన్. మళ్లీ అది ఒక ట్రెండ్‌గా మారింది. ఈ బ్లౌజ్‌లను చీరలపైనే కాకుండా లెహంగాలపై కూడా వేసుకోవచ్చు. ఈ బ్లౌజ్‌లు కుట్టించుకోవటానికి అనువైన బ్లౌజ్ పీస్‌లు మార్కెట్లో అందుబాటులో లభిస్తున్నాయి.



డోరీ బ్లౌజ్

పార్టీలకు వెళ్లినప్పుడు- అందరిని ఆకర్షించటానికి వేసుకొనే బ్లౌజ్ ఇది. దీనిని ఏ చీర మీద ధరించినా బావుంటుంది.



ఫుల్ స్లీవ్ బ్లౌజ్

ఈ బ్లౌజ్ వేసుకుంటే హుందాతనం దానంతట అదే వచ్చేస్తుంది. వీటిని చీరలపైనే కాకుండా లెహంగాలపై కూడా ధరించవచ్చు. కొందరికి చేతులపై చిన్న చిన్న మచ్చలు ఉంటాయి. ఇలాంటి వారు ఈ బ్లౌజ్‌లను ధరిస్తే మచ్చలు బయటకు కనిపించవు.

బ్లౌజ్ భలే!

చీర అందమంతా బ్లౌజ్ స్టిచింగ్‌లోనే దాగి ఉంటుంది. కాబట్టి బ్లౌజ్ కుట్టించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

కొలతలు కచ్చితంగా: సాధారణంగా బ్లౌజ్ కుట్టించాలనుకున్నప్పుడు ఆది బ్లౌజ్ టైలర్‌కి ఇచ్చేస్తూ ఉంటాం. కానీ ఒంటి తీరు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. కాబట్టి కుట్టించే ప్రతిసారీ కొలతలు ఇవ్వడం తప్పనిసరి. అలాగే ఉపయోగించే బ్రాసరీ కొలతలు, టైలర్ కుట్టబోయే బ్లౌజ్ కొలతలు మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి.

హుకప్ బటన్స్: బ్లౌజ్ లోపలి నుంచి బ్రాసరీ బయటకు తొంగి చూసే వీలు లేకుండా బ్లౌజ్ భుజాల దగ్గర హుకప్ బటన్స్ కుట్టమని టైలర్‌కు చెప్పాలి.

మ్యాచింగ్ బ్లౌజ్: చీరతో పాటు వచ్చే బ్లౌజ్ పీస్‌కు బదులు విడిగా ఎంచుకోవాలనుకుంటే చీర మెటీరియల్‌తో బ్లౌజ్ మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. అలాగే ఎంచుకునే లైనింగ్ నాణ్యతదై ఉండాలి. లేదంటే ఉతికిన తర్వాత కుంచించుకుపోయి బ్లౌజ్ ముడతలు పడే అవకాశాలుంటాయి.

కాంబినేషన్: మ్యాచింగ్ బ్లౌజ్‌లకు కాలం చెల్లింది. ఇప్పుడంతా డిజైనర్ బ్లౌజులదే హవా. అయితే హెవీ ఎంబ్రాయిడరీ పనితనం ఉన్న చీరలకు ప్లెయిన్ డిజైనర్ బ్లౌజులు, ప్లెయిన్ చీరలకు సెక్విన్ వర్క్ ఉన్న బ్లౌజులు ఎంచుకోవాలి. కంజీవరం పట్టు చీరలకు బ్రొకేడ్, సిల్క్ లేదా వెల్వెట్ వెరైటీ బ్లౌజులను ప్రయత్నించవచ్చు.





కటౌట్ బ్లౌజ్

నైట్ పార్టీలకు ఎక్కువ మంది ఈ డిజైన్‌ను ఎంపిక చేసుకుంటారు. ఈ బ్లౌజ్ వేసుకుంటే శరీరాకృతి స్పష్టంగా కనిపిస్తుంది.

స్వీట్‌హార్ట్ బ్లౌజ్

ప్రస్తుతం ట్రెండింగ్‌లో బ్లౌజ్ డిజైన్ ఇది. దీనిపై రకరకాల పూసలు వేసి కుట్టడం కూడా ఒక ఫ్యాషన్‌గా మారింది. ఇది వయస్సు పైబడిన వారికి కాకుండా అమ్మాయిలకు ఎక్కువగా నప్పుతుంది.





స్పగాటీ స్ట్రాప్ బ్లౌజ్

ఈ మధ్యకాలంలో చీరలను కూడా రకరకాల పద్ధతులు కడుతున్నారు. వీటికి కొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను జోడిస్తున్నారు. ఇలాంటి చీరలకు ఈ స్పగాటీ స్ట్రాప్ బ్లౌజ్ నప్పుతుంది.

ఎదగడానికి ఏదీ.. అవరోధం కాదు

అరుదైన వ్యాధి ఆమెను చక్రాల కుర్చీకే పరిమితం చేసింది. కానీ... అంతటితోనే జీవితం ముగిసిందని కుంగిపోలేదు. అచంచలమైన ఆత్మవిశ్వాసం... సానుకూల దృక్పథంతో... వైకల్యాన్ని అధిగమించారు. నవలా రచయితగా... అపురూప రచనలెన్నో చేశారు. ఒక టీచర్‌గా విద్యార్థులకు ప్రేరణగా నిలిచారు. పురస్కారాలెన్నో గెలుచుకుని... తనలాంటి ఎంతోమందికి స్ఫూర్తి మంత్రమయ్యారు. 39 ఏళ్ల **రష్మీరేఖ భుయాన్** ప్రయాణం ఇది.



"సంకల్ప బలం ఉంటే వైకల్యం అడ్డుగోడ కాదనేది నా నమ్మకం. అందుకే దాన్ని సాకుగా చూపి సానుభూతి పొందాలనుకోలేదు. అందరితో పోటీపడి చదువుకున్నాను. అందరిలా నేనూ స్నేహితులు, సన్నిహితులతో కలిసి తిరిగాను. వికలాంగురాలిననే అనభూతి నాకు ఎప్పుడూ కలగలేదు. మా అమ్మానాన్నలు నన్ను అలా పెంచారు. ఏది అడిగితే అది కాదనకుండా ఇచ్చారు. అసోమ్‌లోని సూటియా గ్రామం మాది. అమ్మానాన్న ఉపధ్యాయులుగా చేసి రిటైరయ్యారు. చిన్నప్పటి నుంచి వారు నన్ను సాహిత్యం వైపు ప్రోత్సహించారు. దానివల్ల నా ఆలోచనలు, అనుభవాలు, అనుభూతులు... అన్నీ అక్షరబద్ధం చేయడం అలవాటుగా మారింది. వయసుతో పాటు సాహిత్యం పట్ల నాకు మక్కువ కూడా పెరుగుతూ వచ్చింది.

పత్రికలకు రచనలు పంపి...

నేను రాసే విధానం ఇంట్లోవాళ్లకే కాదు, నా స్నేహితులకూ ఎంతో నచ్చేవి. వారందరి ప్రోద్బలంతో అసోమ్ దినపత్రికలు, వారపత్రికలు, మ్యాగజైన్లకు కథనాలు, కథలు రాయడం మొదలుపెట్టాను. వాటికి మంచి ఆదరణ లభించింది. క్రమంగా ఆ అభిరుచి నన్ను నవలా రచన వైపు మళ్లించింది. 2013లో నా తొలి నవల 'మేఘే ఢేకా అకాక్సర్ జూన్' విడుదలైంది. తొలుత దీన్ని ఒక అస్సామీ దిన పత్రిక సీరియల్‌గా ప్రచురించింది. 2016లో 'జీబన్ బీనర్ సుర్' రాశాను. రెండేళ్ల తరువాత 'గిగోలో', గత ఏడాది 'మటి ఐశ్వర్' నవలలు విడుదలయ్యాయి. అవే కాకుండా నేను రాసిన కథలన్నిటితో ఒక సంకలనం తీసుకువచ్చాను.

ప్రశంసలు ఎన్నో...

నేను రాసిన తొలి మూడు నవలలు 'సాహిత్య అకాడమీ యువ పురస్కార్'కు పంపించాను. కానీ అవార్డుకు ఎంపిక కాలేదు. అయితే ప్రముఖ సంస్థ 'దేవ్‌సన్స్ గ్రూప్' వారి 'దేవ్‌సన్స్ బిక్సెక్స్ సాహిత్య ప్రతిభా అవార్డు' అందుకున్నాను. దాంతోపాటు మరి కొన్ని అవార్డులు, ప్రముఖుల ప్రశంసలు లభించాయి. కుముద్ చంద్ర హజారికా అలియాస్ రంజూ హజారికా, సాహిత్య అకాడమీ అవార్డు విజేత మమోనీ రైసోమ్ గోస్వామి, హోమెన్ బోర్గోహెయిన్ నా అభిమాన రచయితలు. వారి స్ఫూర్తితోనే నేను నవలా రచన మొదలుపెట్టాను. ముఖ్యంగా రంజూ హజారికా పుస్తకాలు అనేకం చదివాను. ఆయనలా రాయాలనేది నా కోరిక. హోమెన్ బోర్గోహెయిన్ నాకు పెదనాన్నలా. ఆయన్ను పెదనాన్న అనే సంబోధిస్తాను. నవలా రచన వైపు ఆయన నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

పెళ్లి తరువాత...

చాలామంది వికలాంగులను చూశాను... వారు పెళ్లి, పిల్లలకు దూరంగా ఉండాలనుకొంటారు. అందరిలా సాధారణ జీవితం గడపడానికి తమ వైకల్యం అవరోధం అనుకోవడమే అందుకు కారణం కావచ్చు. అయితే ఈ ఆలోచన సరైంది కాదు. నన్నే చూడండి... చక్రాల కుర్చీలో ఉన్నానని నా అభిరుచులను, విద్యాభ్యాసాన్ని, వైవాహిక జీవితాన్ని వదులుకోలేదు. గువహటి విశ్వవిద్యాలయం నుంచి పొలిటికల్ సైన్స్‌లో పీజీ పట్టా సాధించాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యం, ఎంతటి లక్ష్యాన్నయినా సాధించగల ఆత్మవిశ్వాసం విద్యార్థి దశలోనే పెంపొందాలి. అందుకే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలతో పాటు జీవితంలో ఎదిగేందుకు కావాల్సిన విలువలు, నైపుణ్య అంశాలు కూడా నేర్పిస్తున్నాను. వారిలోని ఆలోచనశక్తికి పదును పెడుతున్నాను.

నాలానే నా చెల్లి కూడా...

ఊహ తెలిసినప్పటి నుంచి నేను వీల్‌చైర్‌లోనే ఉన్నాను. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే అరుదైన వ్యాధి వల్ల ఈ పరిస్థితి అని వైద్యులు చెప్పారు. కానీ నేను బాధపడుతూ, ఇంట్లోవాళ్లను బాధపెట్ట దలుచుకోలేదు. చదువుకున్నాను. నాకు నచ్చిన రంగంలో కొనసాగుతున్నాను. తోటి అమ్మాయిల్లా పెళ్లి చేసుకున్నాను. ఒక బిడ్డకు జన్మనిచ్చాను. విశేషమేమంటే... మా రాష్ట్రంలో ఎస్ఎంఏతో బాధపడుతున్న వారు నలుగురు. వారిలో ముగ్గురు మహిళలు. నేను, నా చెల్లి, మరొక అమ్మాయి. వాళ్లెవరూ పెళ్లి చేసుకోలేదు. మా చెల్లి కూడా తన వైకల్యాన్ని చూసి కుదేలవ్వలేదు. తనూ రచయితే. అసోమ్‌లోని నేటి తరం ప్రముఖ రచయితల సరసన నా పేరు కూడా చేరినందుకు ఎంతో గర్వంగా భావిస్తున్నా. అయితే వికలాంగులకు ముఖ్యంగా కావల్సింది కుటుంబ సహకారం. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. మా అమ్మానాన్న, మావారు, స్నేహితులు, బంధువులు... అందరూ నన్ను ఒక సాధారణ అమ్మాయిలానే చూశారు. చివరగా... నాలాంటి వికలాంగులకు నేను చెప్పేది ఒక్కటే... మీరు ఎవరికీ తీసిపోరు. మీ వైకల్యం మీ లక్ష్య సాధనకు అవరోధం కాదు. ఇది అర్థమైతే మీరు కూడా మీ జీవితాన్ని ఆసాంతం ఆస్వాదించగలరు."



ఒత్తిడిని జయించండి ఇలా

పని ఒత్తిడి.. ఈ మాట ప్రతి రోజూ వింటూ ఉంటాం. ఆఫీసు పనితో పాటుగా ఇంటి పని కూడా ఉంటుంది కాబట్టి మహిళా ఉద్యోగులకు ఈ ఒత్తిడి మరింతగా ఉంటుంది. ఈ ఒత్తిడిని నియంత్రణలో పెట్టుకోకపోతే అనేక రకాల మానసిక సమస్యలతో పాటుగా శారరీక సమస్యలు కూడా వస్తాయంటున్నారు నిపుణులు. ఈ ఒత్తిడిని నియంత్రించటానికి కొన్ని మార్గాలను కూడా సూచిస్తున్నారు.

- పని చేస్తూనే మధ్యలో బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు వంటివి చేస్తే ఒత్తిడి తగ్గుతుంది. ఇలా క్రమం తప్పకుండా ప్రతి రోజు చేయటం వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు ఎన్నో ఉంటాయి.
- మనకు ఇష్టమైన వ్యక్తుల ఫోటోలు లేదా బొమ్మలను డెస్క్ మీద పెట్టుకోవటం వల్ల- వాటిని చూసినప్పుడల్లా మన ఆలోచనలు మారతాయి. దీని వల్ల ఒత్తిడి తగ్గుతుంది.
- సమయం చిక్కినప్పుడు కుటుంబ సభ్యులతోను.. స్నేహితులతోను ఫోన్‌లో మాట్లాడితే పని ఒత్తిడి తగ్గుతుంది. అయితే పని వదిలేసి ఫోన్లలో మాట్లాడటం మొదలెడితే ఒత్తిడి తగ్గదు సరికదా.. పెరుగుతుంది.
- ఎక్కువ సేపు ఆఫీసులోనే గడుపుతారు కాబట్టి రోజుకు కనీసం రెండు లీటర్ల నీళ్లైనా తాగాలి. దీని వల్ల శరీరానికి అదనంగా ఆక్సిజన్ లభిస్తుంది. ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది.
- ఉదయాన్నే లేచిన వెంటనే యోగా చేయటం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది.



ఆఫీసులో చేయగలిగిన ఎక్సర్‌సైజ్‌లు

- కుర్చీలో కూర్చోండి. కళ్లు మూసుకొని మీ తల పైభాగంలో ఒక అద్భుతమైన శక్తి ఉన్నట్లు భావించండి. అది శరీరంలోని అన్ని భాగాలకు వ్యాపిస్తున్నట్లు ఊహించుకోండి. ఇలా రోజుకు నాలుగైదు సార్లు చేస్తే ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.
- దూరంగా ఉన్న ఏదైనా ఒక వస్తువును ఏకాగ్రతతో చూడండి. ఆ తర్వాత కళ్లు మూసుకొని ఆ వస్తువును ఊహించుకోండి. అన్ని ఆలోచనలను వదిలేసి కేవలం ఆ వస్తువుపైనే దృష్టి ఉండేలా చూసుకోండి. ఇలా ప్రతి రోజు రెండు సార్లు చేస్తే ఆలోచనలపై నియంత్రణ వస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది.
- ఒక కుర్చీలో ప్రశాంతంగా కూర్చుని- ముక్కు కుడి రంధ్రాన్ని మూసివేసి ఎడమ రంధ్ర నుంచి గాలిని పీల్చండి. ఆ తర్వాత ఎడమ రంధ్రాన్ని మూసివేసి కుడి రంధ్రం నుంచి గాలి పీల్చండి. ఇలా పది సార్లు చేయండి. దీని వల్ల ఆలోచనలు తగ్గుతాయి. ఒత్తిడి తగ్గుతుంది.



ఇది డ్రోన్ యుగం!

డ్రోన్ సమ్మిట్‌లో బహుముఖ ప్రయోజక విహంగాలు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది.. డ్రోన్ టెక్నాలజీ రయ్‌మంటూ దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ప్రతి రంగాన్నీ డ్రోన్ ప్రభావితం చేయనుంది. చేరుకోలేని దూరాల్ని, అందుకోలేని ఎత్తుల్ని సులువగా చేరుకోవడమే కాకుండా.. పనులన్నీ సులభతరం చేయడంలో డ్రోన్ టెక్నాలజీ కీలకపాత్ర పోషించనుంది. ఇటీవల వరదల సమయంలో విజయవాడ వరద బాధితులకు విశేష సేవలందించిన డ్రోన్ టెక్నాలజీ సాధారణ ప్రజా జీవితంలో అంతకుమించిన సేవలు అందిస్తోంది. కానీ ఆ వాస్తవం ప్రజలకు చేరడంలోనే సమస్య ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్ ఆ సమస్యలను పరిష్కరించింది. ఇప్పటికే విస్తరించిన డ్రోన్ టెక్నాలజీ అందిస్తున్న సేవల గురించి, భవిష్యత్ డ్రోన్‌లదే అనే అంశాన్ని ప్రజలకు తెలిసేందుకు అవకాశం లభించింది. ఈ డ్రోన్ సమ్మిట్‌లో అనేక మంది యువ ఇంజనీర్లు అనేక రకాల డ్రోన్లను ప్రదర్శించారు. రైతులకు, వ్యాపారులకు, వైద్య సేవలకు అవి ఎలా ఉపయోగపడతాయో వివరించారు.

ఇండస్ట్రియల్ ఇన్‌స్పెక్షన్ డ్రోన్లు..

పరిశ్రమల్లో వినియోగించేందుకు ప్రత్యేకంగా ఈ డ్రోన్ల రూపకల్పన చేశారు విశాఖకు చెందిన ప్రవీణ్ అనే యువ ఇంజనీర్. ఇవి మూడు రకాలు. యంత్రాల బయటి భాగాల్లో సమస్యలు గుర్తించడానికి ఎక్స్‌టర్నల్ డ్రోన్స్‌ను వినియోగిస్తారు. ఇవి ప్రమాదకర వాయువుల లీకేజీని గుర్తిస్తాయి. ఇన్‌సైడ్ డ్రోన్లు యంత్రాల లోపలి భాగాల్లోని సమస్యలను గుర్తిసాయి. ఇక పైపుల్లో ఉండే సమస్యలను కూడా గుర్తించేందుకు సూక్ష్మ డ్రోన్లను రూపొందించారు.

ఆంధ్రులు స్థాపించిన స్టార్టప్.. వ్యోమిక్..

గోదావరి జిల్లాకు చెదిన ముగ్గురు యువ ఇంజనీర్లు హేమంత్, సాయిచరణ్, హనుమ కలిసి హైదరాబాద్ కేంద్రంగా స్టార్టప్ కంపెనీ వ్యోమిక్‌ను ఏర్పాటు చేసి రైతుల కోసం డ్రోన్లు సప్లై చేస్తున్నారు. ఇవి పూర్తిగా బ్యాటరీతో నడిచే డ్రోన్లు. ఒకసారి చార్జింగ్‌కు 15 నిమిషాల సమయం పడుతుంది. ఎకరం పొలంలో స్ప్రే చేయడానికి 6, 7 నిమిషాలు సమయం సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ ప్రోత్సాహాలు చూశాక తిరిగి ఏపీకి రావాలని నిర్ణయించుకున్నామని వ్యోమిక్ వ్యవస్థాపకులు చెప్పారు. ప్రస్తుతం 80 డ్రోన్లు ఆపరేట్ చేస్తున్నామని, 2025 నాటికి ఒక్క ఏపీలోనే 2000 డ్రోన్లు ఆపరేట్ చేస్తామని చెప్పారు.

125 కి.మీ వేగం.. 150 కి.మీ. దూరం!

తంజావూరుకు చెందిన ఏకాంత్ వైద్య సేవల కోసం ఒక డ్రోన్‌ను సిద్ధం చేశారు. 7 కిలోల బరువు మోయగల ఈ డ్రోన్ 125 కి.మీ వేగంతో 150 కిలోమీటర్ల వరకూ వెళ్లగలదు. మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వుండే లగేజ్ బాక్సులో మందులు, మానవ అవయవాలు కూడా భద్రం చేసుకునే వీలుంది. అత్యవసరంగా సరఫరా చేయాల్సిన మందులు, అవయవాలను ఈ డ్రోన్ ద్వారా త్వరితగతిన గమ్యస్థానాలకు చేర్చవచ్చు.

రెవెన్యూ సేవలకు.. స్కై హెప్టర్ వీటీఓఎల్

వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ (వీటీఓఎల్) అంటే డ్రోన్‌లాగా నిట్టనిలువుగా టేక్ ఆఫ్ అవుతుంది. ఆ తరువాత నాలుగు వైపులా ఫ్యాను మోటార్లు ఆగిపోయి విమానంలా ముందుకు వెళతుంది. ఇది రెవెన్యూ శాఖ మ్యాపింగ్‌కు ఉపయోగపడుతుంది. ఈ సంస్థ తమిళనాడు ప్రభుత్వంతో అనుబంధ సేవలందిస్తోంది. ఇందులో కెమెరాలు వేగంగా ఫొటోలు తీసి భూముల సర్వేను సులభతరం చేస్తాయి.

డ్రోన్ బాల్‌తో సేఫ్టీ

చిన్న పిల్లలు, శిక్షణ లేకుండా డ్రోన్లు నడిపే వారు వాటిని ఢీకొట్టించే ప్రమాదం వుంది. దీంతో లక్షల రూపాయల విలువ చేసే డ్రోన్లు దెబ్బతినే ప్రమాదం వుంది. ఈ ప్రమాదాల నుంచి డ్రోన్లను రక్షించేందుకు వీలుగా శిక్షక డ్రోన్లను రూపొందించారు. డ్రోన్ చుట్టూ తేలికపాటి ప్లాస్టిక్, రబ్బర్ రక్షక వలయం వుంటుంది. దీంతో డ్రోన్ దేనికైనా గుద్దుకున్నా అది దెబ్బతినకుండా ఉంటుంది.

లాజిస్టిక్ డ్రోన్.. వరదల్లో సాయం..

ఈ డ్రోన్‌ను కూడా గోపీనే రూపొందించారు. దీని ద్వారా సరుకులు రవాణా చేయవచ్చు. పది కిలోమీటర్ల పరిధిలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ డెలివరీలను కూడా ఇవ్వవచ్చు. వరదల సమయంలో విజయవాడలో బాధితులకు ఈ డ్రోన్ల ద్వారా ఆహారాలు, మందులు అందజేశామని గోపి చెప్పారు.

వ్యవ'సాయం' కోసం హైబ్రిడ్ డ్రోన్..

రైతులకు సేవలందించే లక్ష్యంతో ఎన్టీఆర్ జిల్లా నెప్పల్లెకు చెందిన యువ ఇంజనీర్ గోపి వెంకట కృష్ణ ఒక డ్రోన్ తయారు చేశారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదివిన ఆయన ఎరువులు, పురుగు మందులు చల్లడానికి, విత్తనాలు వెదజల్లడానికి వీలుగా ఈ డ్రోన్‌ను రూపొందించారు. ఇది పెట్రోల్, బ్యాటరీతో నడుస్తుంది. ఆరు లీటర్ల పెట్రోలుతో 16 లీటర్ల పురుగుమందులను పిచికారీ చేయగలదు. ఆయిల్ అయిపోతే వెంటనే ల్యాండ్ అవడానికి వీలుగా బ్యాకప్ బ్యాటరీ ఉంటుంది.





విజ్ఞాన్ విద్వత్తు.. ఐదు డ్రోన్లు..

విజ్ఞాన్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు ఐదు రకాల డ్రోన్లు తయారు చేశారు. కోయాక్సిల్ డ్రోన్‌తో తక్కువ ఏరియాలో ఎక్కువ పేలోడ్ తీసుకువెళ్లేలా చేశారు. స్వామ్ టెక్నాలజీ డ్రోన్లు.. ఒకే డ్రోన్ ద్వారా ఒకేసారి అనేక డ్రోన్లను ఒక్కరే ఆపరేట్ చేసేలా రూపొందించడమే ఈ డ్రోన్ ప్రత్యేకత. వీటిలో మాస్టర్ డ్రోన్, స్లేవ్ డ్రోన్లు వుంటాయి. రెస్క్యూ ఆపరేషన్లకు ఉపయోగపడే ఫస్ట్ పర్సన్ వ్యూ, అగ్రికల్చర్ డ్రోన్, 3డీ ప్రింటింగ్ డ్రోన్లనూ రూపొందించారు.




ఎస్ఆర్ఎం విద్యార్థుల స్పెషల్ డ్రోన్లు..

రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో బీటెక్ చదువుతున్న మణికంఠ, పుష్పక్, అజిత్.. మెడిసిన్ డ్రోన్లు రూపొందించారు. 10 కి.మీ. పరిధిలో మందులు అందజేసేలా వాటిని రూపొందించారు. వెబ్‌ఇంటర్‌ఫేజ్‌లో వినియోగదారుడు మందులు ఆర్డర్ చేస్తే వారు ఇచ్చిన అడ్రెస్‌కు చేరవేస్తుంది. ఇది 2కిలోల వరకు సరుకులు అందించగలదు.

ఇంజనీర్ల మేథస్సు.. డిజైనర్ల కష్టం.. ప్రోగ్రామర్ల శ్రమ
అమరావతి డ్రోన్ షో సక్సెస్ వెనుక సాంకేతిక కష్టం

ముందే ప్రోగ్రామింగ్, పక్కా ప్రణాళికతో ఘన విజయం

వినీలాకాశంలో డ్రోనుల విందు!



అమోఘం.. అద్భుతం.. అద్వితీయం.. అమరావతి డ్రోన్ షోను వర్ణించడానికి ఇలాంటి పదాలేవీ సరిపోవు! ఒక్క డ్రోన్ గాల్లోకి ఎగిరితేనే మనం ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోతాం.. అలాంటిది వేలాది డ్రోన్లు ఆకాశంలోకి ఎగిరి రకరకాల చిత్రాలను ఆవిష్కరిస్తుంటే.. ప్రతి చిత్రం ఓ మధురానుభూతిని పంచుతుంటే.. ఆ దృశ్యం కనుల విందుగా ఉంటుంది. అలాంటి అపురూప ఘట్టాన్ని మనకు పరిచయం చేసింది అమరావతి డ్రోన్ సమ్మిట్. రికార్డు స్థాయిలో 5,500 డ్రోన్లతో వేలాదిమంది టెక్నీషియన్లు చేసిన విన్యాసాలు ఏపీ ప్రజలను కట్టిపడేశాయి. అయితే అందరికీ ఆకాశంలోకి ఎగిరిన డ్రోన్లు.. రంగురంగుల లైట్లు మాత్రమే కనిపించాయి. కానీ.. ఇంతటి మెగా షో వెనుక కంటికి కనిపించని సాంకేతిక కష్టం దాగి ఉంది. ఎందరో ఇంజనీర్ల మేథస్సు, డిజైనర్లు, ప్రోగ్రామర్ల శ్రమ ఈ షో ఘన విజయానికి కారణమైంది. ఈ నేపథ్యంలో.. అసలు ఈ డ్రోన్ షో అంటే ఏమిటి..? దాన్ని ఎలా ప్రోగ్రామింగ్ చేస్తారు..? ఎలా ప్రదర్శిస్తారు..? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం..

డ్రోన్ లైట్ షో అంటే ఏమిటి..?

డ్రోన్ లైట్ షో అనేది రాత్రి వేళ ఆకాశంలో కొన్ని వందలు, వేల డ్రోన్లు ఏకకాలంలో క్రమపద్ధతిలో కదులుతూ అద్భుత దృశ్యాలను సృష్టించేలా ప్రోగ్రామ్ చేసిన ఒక అద్భుత ప్రదర్శన. 2012లో అమెరికాలోని పెన్సిల్వేనియా స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ అప్లైడ్ సైన్సెస్ డీన్ విజయ్ కుమార్ ఆలోచన నుంచి పుట్టిందే ఈ డ్రోన్ షో. మానవరహిత వైమానిక వాహనాలు (డ్రోన్లు) గాల్లోకి ఎగిరి.. ఒక రూపంగా ఎలా మారగలవో ఆయన ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అలా మొదలైన డ్రోన్ షో... యూనివర్సిటీల్లోని ప్రయోగశాలలను దాటుకుని నేడు ప్రపంచవ్యాప్తమైంది. సూపర్ బౌల్ హాఫ్ షో, ఒలింపిక్స్ ఇంకా వివిధ రకాలా మెగా ఈవెంట్లలో నిర్వహించిన డ్రోన్ షోలు ప్రజాదరణ పొందడంతో వీటికి ఎక్కడలేని క్రేజ్ వచ్చింది. ముఖ్యంగా ఇంటెల్, సెర్డ్ ఏరో వంటి సంస్థలు డ్రోన్ లైట్ షోలకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. కంపెనీ లోగోల నుంచి వాస్తవిక రూపాల వరకూ.. వ్యాపార ప్రకటనల నుంచి మనసు దోచే చిత్రాల వరకూ అనేక నమూనాలను ప్రదర్శించాయి. తాజాగా.. ఏపీ రాజధాని అమరావతిలో నిర్వహించిన డ్రోన్ షో కూడా ప్రజల మనసు దోచుకుంది.

ఎలా సింక్రనైజ్ చేస్తారు..?

డ్రోన్లను కింద నుంచి ఒక పైలట్ ఆపరేట్ చేస్తుంటారు. అయితే డ్రోన్లు ప్రదర్శించాల్సిన చిత్రాలను ముందుగానే ప్రోగ్రామింగ్ చేస్తారు. షోకు ముందు రిహార్సల్స్ నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్ చేసినట్టుగానే డిస్‌ప్లే అవుతుందా లేదా అని నిర్ధారించుకుంటారు. ప్రదర్శనలో పాల్గొనే ప్రతి డ్రోన్.. టేకాఫ్ నుంచి ల్యాండింగ్ దాకా ప్రోగ్రామ్‌కు అనుగుణంగా పనిచేస్తుందా లేదా అని చెక్ చేసుకుంటారు. బ్యాకప్ డ్రోన్లను కూడా సిద్ధం చేసుకుంటారు. ఒకసారి డ్రోన్లు ఆకాశంలోకి ఎగిరిన తర్వాత.. అవి అంతర్నిర్మిత ఉపగ్రహ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా నేవిగేట్ అవుతాయి. ఈ వ్యవస్థ అవి గాలిలో ఒకదానికొకటి ఢీకొనకుండా నిరోధిస్తుంది. రియల్ టైమ్ కైనమాటిక్ (ఆర్‌టీకే) అనే టెక్నాలజీ గాలిలోకి ఎగిరిన డ్రోన్‌కు గ్రౌండ్ స్టేషన్ నుంచి నిరంతరం డేటాను సేకరిస్తుంది. తద్వారా డ్రోన్లు దారితప్పకుండా ఆధీనంలోనే ఉండేలా చూసుకుంటుంది.

డ్రోన్ షో టీమ్ పాత్ర..?

డ్రోన్ షో టీమ్.. ఇంజనీర్లు, డిజైనర్లు, త్రీడీ యానిమేటర్లు, పైలట్ల కలయికతో ఉంటుంది. ఇంజనీర్లు, డిజైనర్లు ఈ డ్రోన్లను డిజైన్ చేస్తారు. త్రీడీ యానిమేటర్లు.. షోలో ప్రదర్శించే చిత్రాలను డిజైన్ చేస్తారు. ఇక పైలట్లు ప్రదర్శనకు ముందు వాటిని నిశితంగా పరీక్షిస్తారు. ఇక డ్రోన్లలో రంగు రంగుల ఎల్‌ఈడీలు, బ్యాటరీలు, యాంటెన్నాలు ఉంటాయి. డ్రోన్లకు నావిగేషన్ వ్యవస్థ తప్పనిసరి. నేల మీద నుంచి డ్రోన్ పైలట్లు.. ఇచ్చిన కమాండ్లకు అనుగుణంగా, ముందుగానే అందించిన కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఆధారంగా అవి ఆకాశంలో ఎగురుతూ లైట్ల ద్వారా వివిధ ఆకృతులను ప్రదర్శిస్తాయి.

- సెంట్రల్ డెస్క్



ఎలా నిర్వహిస్తారు..?

డ్రోన్ షో వెనుక సాంకేతిక సాయంతోపాటు.. ఎంతో కఠోర శ్రమ దాగి ఉంటుంది. డ్రోన్ షోలో గ్రాఫిక్స్‌ది కీలక పాత్ర. ముందుగా ప్రదర్శించాల్సిన చిత్రాల గ్రాఫిక్స్ రూపొందించుకుంటారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా కొన్ని చిత్రాలను రూపొందించి వాటిని అనుసంధానిస్తారు. ఫ్లైట్ కమాండ్స్ ద్వారా ఆ చిత్రాలను ఆకాశంలో ప్రదర్శిస్తారు.

ఒక షోకు ఎన్ని డ్రోన్లు కావాలి..?

ఒక షోకు ఎన్ని డ్రోన్లు కావాలి అనేది.. నిర్వహించే ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది. ఆకాశంలో భారీ ఆకారాలను ప్రదర్శించాలంటే, బహుళ చిత్రాలను ఆవిష్కరించాలంటే సుమారు 500పైనే డ్రోన్లు అవసరమవుతాయి. విజయవాడలో నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో 5,500 డ్రోన్లను వినియోగించారు. సైబర్‌డ్రోన్ దుబాయ్‌లో 2వేల డ్రోన్లతో అద్భుత ప్రదర్శన నిర్వహించింది.

ఖర్చు తగ్గాలి!


డ్రోన్ల నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉంటోంది

డ్రోన్ సదస్సులో పలువురి అభిప్రాయం



అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల వినియోగం పెరగాలంటే వాటిపై ఖర్చు తగ్గాలని పలువురు వినియోగదారులు అభిప్రాయపడ్డారు. వాటి నిర్వహణకు ఎక్కువగా వ్యయం చేయాల్సి వస్తోందని చెప్పారు. మంగళగిరిలో అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 రెండో రోజైన బుధవారం ఏడు అంశాలపై ప్యానెల్ చర్చించింది. డ్రోన్ల ద్వారా సంక్షేమ పథకాల అందజేతపై డీజీ సెంథిల్ కుమార్ అధ్యక్షతన ప్యానెల్ డిస్కషన్ జరిగింది. ఈ ప్యానెల్‌లో ఏపీపీ, న్యూస్పేస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీస్ అశ్విన్ శాస్త్రి, డ్రోనెక్స్ టెక్నాలజీస్ డైరెక్టర్ ఎ.ప్రగదీశ్, జన్నెటి టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు జాన్ లివింగ్‌టన్, యూనీ స్ట్రింగ్ టెక్ సొల్యూషన్స్ ఎండీ నాగేంద్ర, బిగ్‌బాంగ్ బూమ్ గౌరవ్ శర్మ పాల్గొన్నారు. "ఇన్వెస్టర్స్ ఇన్‌సైట్స్ ఆన్ ఛాలెంజెస్ అండ్ ఫండింగ్ ఆపర్చునిటీస్" అంశంపై జరిగిన ప్యానల్ డిస్కషన్‌లో ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, బ్లజ్ ఏరోస్పేస్ కోఫౌండర్ అమరదీప్ శ్రీవత్సవ, ఎయిర్ బౌండ్ కో ఫౌండర్ నమన్ పుష్ప, ఐఐటీ తిరుపతి సీఈవో మేజర్ జనరల్ ఎం. రాజేంద్రన్, ఐఎఫ్‌సీఐ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సునీత్ శుక్లా, మౌంట్ టెక్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ అంకిత్ హర్షల్ పాల్గొన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్ల ద్వారా ప్రభుత్వ సాయాన్ని చేరవేసిన విధానం గురించి ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.దినేష్‌కుమార్ వివరించారు.

ముగిసిన సదస్సు : రెండు రోజులపాటు నిర్వహించిన 'అమరావతి డ్రోన్ సమిట్ -2024' బుధవారం విజయవంతంగా ముగిసింది. సమిట్‌కు అంచనాలకు మించి స్పందన లభించిందని, సీఎం చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా ఈవెంట్ పూర్తిస్థాయిలో విజయవంతమైందని ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.దినేష్‌కుమార్ చెప్పారు. సదస్సుకు మొత్తం 11 వేలకు పైగా హాజరై, డ్రోన్ ప్రదర్శనను తిలకించారని తెలిపారు.



జీఎస్టీ రద్దు చేయాలి

డ్రోన్ యాజమాన్య నిర్వహణ వ్యయంతో కూడుకున్నది. తయారీ సంస్థలకు జీఎస్టీని రద్దు చేయాలి.

- తయారీ సంస్థల యజమానులు

25% పెట్టుబడి రాయితీ

తయారీ సంస్థలకు పెట్టుబడి రాయితీ 25 శాతం.. అదేవిధంగా జీఎస్టీ రాయితీ ఐదేళ్లపాటు ఇచ్చేలా డ్రోన్ పాలసీ ఉంటుంది.

- ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్

వైద్య సేవల్లో మెరుగైన ఫలితాలు

సుదూర ప్రాంతాలకు వైద్య సేవలందించే సమయంలో డ్రోన్ సేవలు వినియోగించుకునే వీలుంది. అవయవదానానికి ఫ్లైట్లకంటే డ్రోన్ సేవలే బెటర్.

- ఎస్ఏపీపీ సీఈవో లక్ష్మీషా

కొన్నాక కష్టాలు ఎక్కువయ్యాయి..

డ్రోన్లను కొనుగోలు చేశాక నానా కష్టాలూ పడాల్సి వస్తోంది. కేంద్రం ఆంక్షల సడలిస్తే తప్ప.. ఈ రంగం అభివృద్ధి చెందే అవకాశం కనిపించడం లేదు.

- పలువురు వినియోగదారులు

బ్యాటరీకి గ్యారెంటీ లేదంటున్నారు

వ్యవసాయ పనులు వేగంగా అవుతాయనే ఆశతో డ్రోన్లలను కొంటే.. వాటి బ్యాటరీల నిర్వహణ భారంగా మారింది. ఒక్కో బ్యాటరీ రూ. 50,000 ఉంటోంది. రీప్లేస్‌మెంట్, గ్యారెంటీ లేదని కంపెనీలు చెబుతున్నాయి. పది బ్యాటరీలు కొనుక్కుని నష్టపోయిన వాళ్లు ఉన్నారు.

- పలువురు రైతులు

తరచూ క్రాష్ అవుతున్నాయి

డ్రోన్‌లతో 13లక్షల ఎకరాలు సర్వేచేశాం. సర్వే విభాగం 20డ్రోన్లు కొనుగోలు చేసింది. ఈ డ్రోన్లు తరచూ క్రాష్ అవుతున్నాయి.

- సర్వే విభాగం అధికారి ఏవీఎస్ ప్రసాద్



ఆసుపత్రిలో జగన్‌కు అభివాదంతో కార్యకర్తల హల్‌చల్

జీజీహెచ్‌లో జగన్ రచ్చ

భారీగా కార్యకర్తలతో రాక

- ఆస్పత్రి పరిసరాల్లో వైసీపీ శ్రేణుల హల్‌చల్
- మార్చురీ వద్ద సైతం సీఎం..సీఎం..నినాదాలు
- గేటు దూకి, మొక్కలను తొక్కి.. బీభత్సం

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ దాడిలో మృతి చెందిన యువతి సహన కుటుంబసభ్యుల పరామర్శకు వచ్చిన మాజీ సీఎం జగన్ పర్యటన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రచ్చరచ్చగా మారింది. పరామర్శకు వెళుతున్నామన్న కనీస స్పృహ లేకుండా.. వందలాదిమంది కార్యకర్తలతో ఆయన జీజీహెచ్‌కు వచ్చారు. అత్యుత్సాహంతో కార్యకర్తలు రెచ్చిపోయారు. జై.. జగన్ అని నినాదాలు చేస్తూ.. ఆస్పత్రి లోపల, వెలుపల హల్‌చల్ సృష్టించారు. సీఎం సీఎం అంటూ కేకలు, అరుపులతో హోరెత్తించారు. మూసిన ఆస్పత్రి గేట్లు ఎక్కి కొందరు లోపలకు దూకారు. మరికొందరు ఆస్పత్రి లోపల ఏర్పాటుచేసిన మొక్కలను, చెట్లను తొక్కి నాశనం చేశారు. జగన్ ఆస్పత్రిలో ఉన్నంత సేపు.. ఆస్పత్రి వెలుపల వైసీపీ కార్యకర్తల అరాచకపర్వం కొనసాగింది. ఆస్పత్రిలోకి వెళ్లే ప్రధాన ద్వారానికి అడ్డంగా నిలబడ్డారు. బయటకు వెళ్లే వాహనాలు, అంబులెన్స్‌లకు దారి ఇవ్వకుండా ఇబ్బందిపెట్టారు. దీంతో సామాన్య రోగులు, వారి కుటుంబ సభ్యులు నరకయాతన అనుభవించారు.

రోగులకు తప్పని ఇబ్బందులు

మాజీ సీఎం జగన్ రాక సందర్భంగా ఉదయం 9 గంటల నుంచే ఆస్పత్రి ప్రధాన ద్వారం మూసివేశారు. తన పర్యటన ముగించుకొని ఆయన మధ్యాహ్నం 12.15 గంటలకు బయటకు వెళ్లే వరకు బయట వారిని లోనికి, లోపల వారిని బయటకు అనుమతించ లేదు. మెయిన్ గేటు పక్కనే అత్యవసర వైద్య విభాగం క్యాజువాల్టీ ఉంది. ఎమర్జెన్సీ కేసుల్లో క్యాజువాల్టీకి వచ్చే రోగులకు మూడు గంటల పాటు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. క్యాజువాల్టీకి వెళ్లే దారి వైసీపీ కార్యకర్తలతో కిక్కిరిసిపోవడమే దీనికి కారణం. ఆస్పత్రిలోకి వచ్చిన రోగులు వార్డులోకి వెళ్లలేక 108 అంబులెన్స్ వాహనాల్లో చాలాసేపు ఉండిపోయారు. కుమార్తెను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో సహన కుటుంబం ఉంటే జగన్ అనుచరులు మార్చురీ వద్ద కూడా సీఎం... సీఎం అంటూ నినాదాలు చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. కాగా, జగన్ పర్యటనలో సందిట్లో సడేమియాగా కొందరు జేబు దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. కొందరి జేబులకు కత్తెర వేశారు. ఇదిలాఉండగా, బాధిత యువతికి ప్రభుత్వం న్యాయం చేయాలంటూ కొందరు జై భీమ్ కార్యకర్తలు జీజీహెచ్ ఎదుట కొద్దిసేపు ఆందోళనకు దిగారు. ప్రభుత్వాస్పత్రిలోకి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఇదిలాఉండగా, అంతమంది వైసీపీ కార్యకర్తలు ఆస్పత్రిలోకి రావడం చూసిన పోలీసులు వెంటనే అప్రమత్తం కాలేదు. వారిని అదుపు చేయడంలో వైఫల్యం చెందారు. జగన్ వెంట ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, తలశిల రఘురామ్, వరుదు కళ్యాణి, మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు ఉన్నారు.

మహిళలకు రక్షణ లేదు

నాలుగున్నర నెలల్లో 77 అత్యాచారాలు

నిందితులంతా టీడీపీ నాయకులే

అందుకే ఎవరిపైనా చర్యలు లేవు: జగన్

గుంటూరు మెడికల్, బద్వేలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, శాంతిభద్రతలు క్షీణించాయని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తోందన్నారు. తెనాలిలో రౌడీషీటర్ దాడిలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన సహన అనే యువతి భౌతికకాయాన్ని ఆస్పత్రిలో చూడటానికి వెళ్లినప్పుడు, ప్రేమోన్మాది ఘాతుకానికి బలైన బాలిక కుటుంబాన్ని బద్వేలులో పరామర్శించిన సమయంలో బుధవారం జగన్ మీడియాతో మాట్లాడారు. పరామర్శకు వెళ్లిన ఆయన.. ఆ రెండు చోట్లా రాజకీయ విమర్శలకు లంఘించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు అనిత, లోకేశ్‌ను ఉద్దేశించి ఏకవాక్య ప్రయోగం చేస్తూ, తిట్ల దండకం వినిపించారు. మహిళలు, యువతులపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు కళ్లెదుటే కనిపిస్తున్నా నిందితులపై ఎటువంటి చర్యలు లేవన్నారు. నిందితులు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కావడమే దీనికి కారణమని, సహన హంతకుడు నవీన్ కూడా టీడీపీకి చెందిన వ్యక్తేనని ఆరోపించారు. "కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నర నెలల్లో రాష్ట్రంలో 77 అత్యాచారాలు జరిగాయి. ఏడుగురు మహిళలు హత్యకు గురయితే, మరో ఐదు మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాధితుల కుటుంబాలను సీఎం చంద్రబాబు బహిరంగంగా క్షమాపణలు కోరాలి. తక్షణం రూ.10 లక్షల సాయం ప్రకటించాలి. వైసీపీ తరఫున సహన కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తాం" అని జగన్ తెలిపారు.

వాళ్లకు బుద్ధి, జ్ఞానం ఉన్నాయా?

నాడు తాను తెచ్చిన మహిళలకు దిశ యాప్ రక్షణగా నిలిచిందని జగన్ అన్నారు. "దిశ యాప్‌ను మంత్రులు లోకేశ్, అనిత తగులబెట్టారు. వారికి బుద్ధి, జ్ఞానం లేవు. సీఎం చంద్రబాబు....చరిత్రహీనుడౌతారు" అంటూ జగన్ దూషణలకు దిగారు. కాగా, బద్వేలులో ఘటన శనివారం జరిగితే ఇప్పటివరకు పట్టించుకున్నవారు లేరని, తాను వస్తున్నానని తెలిసి బుధవారం బాలిక కుటుంబానికి సహాయం అందించారని జగన్ ఆరోపించారు. ఇలాగే పరిపాలన కొనసాగితే చంద్రబాబుకు ప్రజలు బుద్ధిచెప్పే పరిస్థితి వస్తుంది." అని జగన్ అన్నారు.



సహన కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న మంత్రి మనోహర్

24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశాం: మంత్రి మనోహర్

తెనాలిలో సహన కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

తెనాలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్తు ఉన్న సహన(25) మరణం బాధాకరమని మంత్రి నాదెండ్లమనోహర్ అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం తెనాలిలోని ఆమె నివాసానికి భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. మంత్రి మనోహర్ అక్కడకు చేరుకుని ఆమెకు నివాళులర్పించారు. సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షల చెక్కును వారికి అందజేశారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారని మంత్రి తెలిపారు.

నా కొడుకును రౌడీని చేసింది వైసీపీ నేతలే

- సహనా కేసు నిందితుడు నవీన్ తల్లి కుమారి ఆరోపణ

కొల్లిపర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల వల్లే తన కుమారుడు రౌడీషీటర్‌గా మారినట్లు సహన కేసులో నిందితుడు రాగి నవీన్ తల్లి కుమారి ఆరోపించారు. "నా కుమారుడు వైసీపీ నాయకుల వెంట పదిహేనేళ్లుగా తిరుగుతున్నాడు. సహన కుటుంబంతో మాకు బంధుత్వం ఉంది. గతంలో నవీన్, సహన... ఇద్దరూ ఇష్టపడటంతో వారికి పెళ్లి చేయాలని అనుకున్నాము. ఇటీవల వారి మధ్య ఏమి జరిగిందో తెలియదు. సహన చనిపోవడం బాధాకరమే. కానీ, వైసీపీ నాయకులు దీన్ని రాజకీయంగా వాడుకుంటున్నారు. ఈ కేసు విషయంలో మమ్మల్ని వేధింపులకు గురిచేస్తున్నారు" అని కుమారి ఆరోపించారు. రాజకీయ స్వలాభం కోసం తన కుటుంబాన్ని వేధించవద్దని, సరైన రీతిలో దర్యాప్తును సాగించాలని ఆమె వేడుకున్నారు.

మమకారం మాయమైంది!

షర్మిలకు కృతజ్ఞత లేదు.. వాటాలు, గిఫ్ట్‌డీడ్‌లు రద్దు చేస్తున్నా... ఎన్‌సీఎల్టీలో జగన్ పిటిషన్



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నా అక్కలూ, నా అమ్మలూ, నా చెల్లెమ్మలూ అని ఎన్నికల సమయంలో మైకు పట్టుకుని ఊదరగొట్టిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల మీదే కేసు వేశారు! వారిద్దరినీ ఎన్‌సీఎల్టీ బోనులో నిలబెట్టేందుకు పావులు కదిపారు. విజయలక్ష్మి సరస్వతీ పవర్‌లో తన వాటాను షర్మిలకు అప్పగించాలని నిర్ణయించుకోవడమే దీనికి కారణం! 'నేను నీకు గిఫ్టుగా ఇచ్చిన వాటాను షర్మిలకు ఎలా ఇస్తావు?' అంటూ తల్లిని ప్రశ్నించి, గద్దించి, ఏకంగా ఎన్సీఎల్టీలో పోరాటం మొదలుపెట్టారు. గతంలో కేవలం ప్రేమాభిమానాలతో షర్మిలకు కొన్ని ఆస్తులు ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ... ఇప్పుడు ఆ ఆలోచనను విరమించుకుంటున్నట్లు తెలిపారు. పిటిషన్‌లో జగన్ వాదన ఇదీ...

- గ్రంధి ఈశ్వరరావు, గ్రంధి శశికళ, గ్రంధి సతీశ్ స్థాపించిన సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఎంతో కష్టపడి ఈ స్థాయికి తీసుకొచ్చాం. ఆ కంపెనీ ఎదుగుదలలో మా కష్టం ఎంతో ఉంది.
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్వార్జితంతోపాటు వారసత్వ ఆస్తులను భార్య, పిల్లలకు పంచారు. ఆ తర్వాత నేను (జగన్) నా సొంత సామర్థ్యంతో, తెలివితేటలతో వ్యాపారాలు చేశాను. ఇలా సంపాదించిన ఆస్తుల్లో కొన్నింటిని కేవలం 'ప్రేమ, అభిమానం'తో భవిష్యత్తులో షర్మిలకు ఇద్దామని భావించాను. ఇలా ఇవ్వాలనుకున్న ఆస్తుల జాబితాతో 2019 ఆగస్టు 31వ తేదీన షర్మిలతో ఎంవోయూ చేసుకున్నాను. ఈ ఆస్తులు నాకు, నా సతీమణికి చెందినవి. అయినప్పటికీ... చెల్లి అనే మమకారంతో షర్మిలకు ఇద్దామనుకున్నాను.
- ఈడీ, హైకోర్టు కేసులు ఉన్న నేపథ్యంలో.. వాటి నుంచి బయటపడిన తర్వాత మాత్రమే వాటిని షర్మిలకు ఇచ్చేలా ఎంవోయూలో రాసుకున్నాం.
- సరస్వతీ పవర్ కంపెనీలో నా పేరుతో ఉన్న షేర్లను 2021లో మా తల్లికి బదిలీ చేశాం. భారతీ రెడ్డి షేర్లు కూడా బదిలీ అయ్యాయి. దీంతో ఆ కంపెనీలో విజయలక్ష్మికి 48.99 శాతం వాటా వచ్చింది. తదుపరి ఏడాది కంపెనీ వార్షిక రిటర్న్‌లో ఈ మేరకు మార్పులు కనిపించాయి. ఆ తర్వాత 2021 జూలై 26న నేను, భారతి కలిసి మాకున్న మిగిలిన షేర్లను కూడా విజయలక్ష్మికి గిఫ్ట్‌డీడ్ చేశాం. వాటిని భవిష్యత్తులో మా అనుమతితో షర్మిలకు బదిలీ చేయాలే తప్ప.. ఇప్పుడే షర్మిలకు ఇచ్చేసినట్లు కాదు.
- విజయలక్ష్మి తన పేరుతో ఉన్న ఆస్తులు ఎవరికైనా ఇవ్వొచ్చు. కానీ, ఈ ఆస్తులు లిటిగేషన్‌లో ఉన్నాయి. అందువల్ల ప్రస్తుతానికి సరస్వతీ పవర్‌లో మెజారిటీ వాటా ఇంకా మాకే (జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ) ఉన్నట్టు పరిగణించాలి.
- ఇప్పటిదాకా మేం షేర్ ట్రాన్స్‌ఫర్ పత్రాలు ఇవ్వలేదు. గిఫ్టడీడ్ మాత్రమే జరిగింది. అంటే భవిష్యత్‌లో షర్మిలకు బదిలీ కావాల్సిన షేర్లకు విజయలక్ష్మి ట్రస్టీగా మాత్రమే ఉంటారు.
- ప్రేమాభిమానాలు కరిగిపోవడం వల్ల ఎంవోయూను ముందుకు తీసుకెళ్లి షర్మిలకు ఆస్తులు పంచాలనే ఆలోచనను ఉపసంహరించుకున్నాం. ఆస్తులు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఎంవోయూ, గిఫ్టడీడ్ చేసుకున్నాం కానీ... వాస్తవమైన పంపకాలు జరగలేదు.
- షర్మిల, విజయలక్ష్మి, చాగర్రి జనార్దన్‌కు (0.25 శాతం వాటాదారు) సరస్వతి పవర్ కంపెనీ షేర్లపై ఎటువంటి హక్కు లేదు. వారికి వాటాలూ లేవు. ఈ ఏడాది జూలై 6వ తేదీన జరిగిన షేర్ల బదిలీ చట్టవిరుద్ధం. అది చెల్లదు.



తల్లీ చెల్లిపై జగడాల జగన్!

ఎన్‌సీఎల్టీలో పిటిషన్‌తో రచ్చ

- అంతకుముందు షర్మిలకు జగన్ లేఖ
- ఆస్తుల పంపిణీకి సరే అంటూనే... షరతులు
- తమ గురించి, అవినాశ్ గురించి మాట్లాడొద్దని కండిషన్
- ఆమోదయోగ్యం కాదంటూ షర్మిల మౌనం
- దీంతో... అసలు ఆస్తులే ఇవ్వనంటూ జగన్ పిటిషన్
- ఆ వెంటనే సోదరుడికి ఘాటుగా షర్మిల జవాబు
- తండ్రి వైఎస్ పరువు తీస్తున్నారంటూ ధ్వజం
- తన మాటా అదేనంటూ లేఖపై విజయలక్ష్మి సంతకం
- రాజీ కోసం శ్రేయోభిలాషుల ప్రయత్నాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మమకారం మాయమైపోయింది. అభిమానం కరిగిపోయింది. ప్రేమ ద్వేషంగా మారింది! అందువల్ల... ఇవ్వాల్సిన ఆస్తులు ఇవ్వను!' ఇది... చెల్లెలు వైఎస్ షర్మిలపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వైఖరి! చెల్లిపైనే కాదు... తల్లి విజయలక్ష్మిపైనా పోరాటమే! తల్లీ చెల్లిపై ఎన్‌సీఎల్టీపై ఆయన వేసిన పిటిషన్ ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. సరస్వతీ పవర్‌పై షేర్ల బదిలీ గురించి ప్రధానంగా ప్రస్తావిస్తూ... అసలు షర్మిలకు ఆస్తుల్లో వాటాలే ఇచ్చేది లేదని జగన్ తేల్చి చెప్పడం గమనార్హం. అసలు ఆస్తుల విషయంలో వైఎస్ చెప్పిందేమిటి, జగన్ చేసిందేమిటి?

వైఎస్ చెప్పిన వాటాల లెక్క ఇది...

ఆస్తులను నాలుగు సమాన వాటాలు చేసి... తన మనవళ్లు, మనవరాళ్లకు (షర్మిల పిల్లలు, జగన్ పిల్లలు) ఇవ్వాలని వైఎస్ పేర్కొన్నారు. కానీ... జగన్ సీఎం అయ్యాక ఇందుకు ససేమిరా అన్నారు. 60 శాతం తమకే దక్కాలని, 40 శాతం మాత్రమే షర్మిలకు దక్కుతుందని తేల్చేశారు. దీనికి అంగీకరించేది లేదని షర్మిల స్పష్టం చేశారు. ఐదుశాతం అటూ ఇటైయినా పర్వాలేదుకానీ... 60:40 ఫార్ములా సరికాదని విజయలక్ష్మి కూడా చెప్పారు. అయినా జగన్ పట్టించుకోలేదు. అవన్నీ తన సొంత కష్టం, తెలివితేటలతో సంపాదించిన ఆస్తులని వాదించారు. అందులో షర్మిలకు హక్కు లేదంటూ... కేవలం 'ప్రేమాభిమానాలతో' ఇవ్వబోయే ఆస్తుల జాబితా అంటూ జగన్ ఒక ఎంవో యూ రూపొందించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన కొత్తలోనే (2019 ఆగస్టులో) దీనిని రాసిపెట్టారు. కానీ... వాటి పంపకానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎంవోయూ రాశారేకానీ... దాని అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆస్తుల్లో వాటా కోసం షర్మిల చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.

షరతులకు లోబడి...

షర్మిల కాంగ్రెస్‌లో చేరి... పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నపై రాజకీయ యుద్ధం మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఆమె విమర్శలు, ఆరోపణలు తాజా ఎన్నికల్లో జగన్‌ను బాగా ఇబ్బంది పెట్టాయి. ఈ నేపథ్యంలో... గత నెల మొదటి వారంలో చెల్లితో రాజీ ప్రయత్నాలు మొదలుపెడుతూ, షర్మిలకు ఒక లేఖ రాశారు. ఆస్తుల పంపిణీకి అంగీకరిస్తూనే, అనేక షరతులు విధించారు. "భవిష్యత్తులో నా గురించి, భారతి గురించి ఏమీ మాట్లాడొద్దు. వైఎస్ అవినాశ్ రెడ్డి ప్రస్తావన తీసుకురావొద్దు" అంటూ కండీషన్లు పెట్టారు. అంటే... షర్మిల రాజకీయాల నుంచి తప్పుకోవాలని, వివేకా హత్య గురించి మాట్లాడొద్దని చెప్పడమే! ఈ షరతులు ఆమోదయోగ్యం కాకపోవడంతో షర్మిల దీనిపై స్పందించకుండా మౌనంగా ఉండిపోయారు. దీంతో... చెల్లికి వాటాల్లేవు, తల్లికి షేర్లు లేవు అంటూ గతనెల 9వ తేదీన జగన్ ఎన్‌సీఎల్టీలో పిటిషన్ వేశారు. ఈ విషయం తెలియగానే షర్మిల మండిపడ్డారు. 12వ తేదీన అన్న జగన్‌కు ఘాటుగా లేఖ రాశారు. తన రాజకీయ భవిష్యత్తును నిర్దేశించడమేమిటంటూ మండిపడ్డారు. 'ఆస్తుల్లో సమాన వాటా ఇవ్వాలన్నది నాన్న వైఎస్ రాజశేఖర రెడ్డి ఆకాంక్ష' అని గుర్తు చేశారు. 'నాన్న ఆశలూ.. ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సాక్షి మీడియాలోనూ నాకు తీరని ద్రోహం చేశారు. నాన్న కలలో కూడా ఊహించని విధంగా నాపైనా, అమ్మపైనా కేసులు పెట్టారు" అంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. 'సరస్వతీ పవర్‌లో అమ్మకు ఇచ్చిన షేర్లు మీరు రాసిచ్చినవి కావా?' అని నిలదీశారు. "ఆస్తులలో నాకు ఎలాంటి హక్కులూ లేకుండా చేయాలన్న మీ దుర్బుద్ధి అర్థమైంది. మీరు ఎన్ని చేసినా నా ప్రయాణాన్ని అడ్డుకోలేరు" అంటూ తన లేఖలో సూటిగా చెప్పారు. 'నా అభిప్రాయమూ ఇదే' అంటూ ఈ లేఖపై విజయలక్ష్మి కూడా సంతకం చేయడం గమనార్హం!



చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న రాయబారాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం

రాయ'బేరానికి' కారణం!?

ఎన్‌సీఎల్టీలో జగన్ పిటిషన్, తల్లి విజయలక్ష్మినీ అందులో చేర్చడం, అన్నా చెల్లెళ్ల మధ్య లేఖాస్త్రాలు, ఇతర పరిణామాలతో వైఎస్ కుటుంబ శ్రేయోభిలాషులు కలత చెందారు. తల్లీ చెల్లితో గొడవ వద్దని... జగన్‌కు వీరు సర్దిచెప్పినట్లు తెలిసింది. దీంతో... తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లితో రాజీకి జగన్ అంగీకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే బెంగళూరు ప్యాలెస్ వేదికగా పలువురితో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనంలో బయటపెట్టిన సంగతి తెలిసిందే. జగన్ ఎన్‌సీఎల్‌టీలో వేసిన పిటిషన్ వచ్చేనెల 8వ తేదీన విచారణకు రానుంది. ఈ లోపే ఆస్తి పంపకాల్లో రాజీ కుదిర్చి, రచ్చకు తెరదించాలని వైఎస్ కుటుంబ శ్రేయోభిలాషుల యోచన! కానీ.. జగన్ వైఖరిపై షర్మిల తీవ్రంగా మండిపడుతుండటంతో వీరి ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయన్నది సందేహాస్పదంగా మారింది.

ఇదీ సరస్వతీ పవర్ కథ

సరస్వతీ పవర్‌లో జగన్, ఆయన సతీమణి భారతికి కలిపి 47 శాతం వాటా ఉండేది. క్లాసిక్ రియల్టీ, సండూర్ పవర్‌కు కలిపి మరో 52 శాతం.. వైఎస్ విజయలక్ష్మికి ఒక శాతం వాటా ఉండేవి. అయితే... జగన్ దంపతులు తమ వాటా 47 శాతాన్ని తల్లి విజయలక్ష్మికి గిఫ్ట్ డీడ్ కింద రాసిచ్చారు. మిగిలిన 52 శాతం సండూర్, క్లాసిక్ రియల్టీ పేరుతో ఉన్నాయి కాబట్టి... ఆ షేర్లు ఇవ్వలేనని జగన్ స్పష్టం చేశారు. అయితే... విజయలక్ష్మి రూ.32 కోట్లు చెల్లించి ఆ షేర్లు కొనుగోలు చేశారు. దీంతో... సరస్వతీ పవర్ మొత్తం విజయలక్ష్మికి బదిలీ అయినట్లే. దీనిని సరస్వతీ పవర్ సంస్థ బోర్డు సమావేశం కూడా ఆమోదించింది. అయితే... అందులో నుంచి తన కుమార్తె అయిన షర్మిలకు వాటా ఇవ్వాలని విజయలక్ష్మి భావించారు. దానిని జగన్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'నేను నీకు గిఫ్టుగా ఇచ్చిన వాటాలను షర్మిలకు ఇవ్వడమేమిటి?' అనేది ఆయన ప్రశ్న. సండూర్ పవర్, క్లాసిక్ రియల్టీ షేర్లను విజయలక్ష్మి రూ.32 కోట్లు పెట్టి కొనుగోలు చేశారు. ఆ విషయాన్ని జగన్ దాచిపెట్టారు. ట్రైబ్యునల్‌ను కూడా తప్పుదారి పట్టించేలా... తల్లీ, చెల్లిపై కేసు వేశారు.

రచ్చకెక్కిన రగడ

వైఎస్ కుటుంబంలో వివాదాలు బహిరంగ రహస్యమే అయినప్పటికీ... ఆస్తుల విషయంలో ఇప్పటిదాకా రచ్చకెక్కలేదు. ఇప్పుడు తల్లీ చెల్లిపై జగన్ ఏకంగా ఎన్‌సీఎల్టీలో కేసు వేశారు. పరస్పరం లేఖాస్త్రాలు సంధించుకున్న సంగతి బయటపడింది. మరీ ముఖ్యంగా సరస్వతీ పవర్ విషయంలో తనను ట్రైబ్యునల్‌కు లాగడంపై షర్మిల తీవ్రంగా మండిపడుతున్నట్లు తెలిసింది. "ఈ విషయంలో నాకు సంబంధమేమిటి? మా అమ్మకు గిఫ్టడీడ్‌గా వాటాలు రాసిచ్చింది జగన్ దంపతులే కదా! మధ్యలో నన్ను ఎందుకు బద్నాం చేస్తున్నారు" అని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. పైగా... తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పరువును షర్మిల బజారుకీడుస్తున్నారంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. దీనిపైనా షర్మిల తీవ్రంగా స్పందిస్తున్నారు. తల్లిపైనే పిటిషన్ వేసిందెవరు? తండ్రి పరువు తీస్తున్నదెవరు. అని ప్రశ్నిస్తూ... ఆస్తుల పంపిణీకి సంబంధించి తొలి నుంచీ ఆడుతున్న 'జగన్నాటకాన్ని' బయటపెట్టాలని షర్మిల నిర్ణయించుకున్నట్లు తెలిసింది. రేపోమాపో దీనిపై ఆమె బహిరంగంగానే నోరు విప్పే అవకాశం కనిపిస్తోంది.

నాన్నకు మాటిచ్చి తప్పావ్

(మొదటి పేజీ తరువాయి)

వారి తల్లి విజయలక్ష్మి కూడా సంతకం చేయడం విశేషం. తన మరణానికి ముందు ప్రారంభించిన భారతి సిమెంట్స్, సాక్షి, తదితర సంస్థల్లో మనుమడు, మనుమరాళ్లకు సమాన వాటా ఇవ్వాలని నాన్న సుస్పష్టంగా ఆదేశించారని.. అందుకు జగన్ కూడా అంగీకరించారని లేఖలో ప్రస్తావించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు తమ మధ్య జరిగిన చర్చలు, లావాదేవీలకు అమ్మ సాక్షి మాత్రమే కాదు.. వాటిని దగ్గరగా గమనించింది కూడానని తెలిపారు. తనకు జగన్ ఇటీవల రాసిన లేఖపై షర్మిల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దానికి ఘాటుగా బదులిచ్చారు. షర్మిల లేఖలో ముఖ్యాంశాలివీ..



12 September 2024

Sri Y.S. Jaganmohan Reddy
House No. 12-352/2/9,
FarrVille 52, Katna Katta,
Revenue Ward No. 12,
Tadepalli-522501
AP.

Dear Jagan Anna,

1. I take serious objection to the letter you recently sent me. It is important to remind you that our late father unambiguously instructed that all the properties acquired with the family resources during his lifetime should be divided equally amongst his four grandchildren. You agreed to that command and assured him and us that you would obey his word; but, after our late father's death, you refuse to stand by that commitment. Our father was unequivocal in his instructions that all four of his grandchildren are to share equally in all assets that existed during his lifetime, whether they pertain to Bharathi Cements, Sakshi, or any other ventures initiated prior to his passing. Our mother was not only a witness to these explicit instructions but also observed all interactions and agreements between us to date.
2. The assets mentioned in the Memorandum of Understanding (MoU) as being transferred to me out of "love and affection" were, in truth, only in partial fulfillment of our father's directives. I must emphasize "partial," as you insisted on retaining a majority share in Bharathi Cements and Sakshi. But since you had the upper hand, you did bulldoze your way and we agreed to a settlement as stated in the MOU. Since you are my elder brother and in the interest of resolving family disputes, I agreed to give up my equal share. Thus, under the MoU executed on 31.08.2019, only a few properties were assigned to me.
3. You have now chosen to file cases against your own mother and deprive your own sister and her children of properties to which they are entitled under the MoU. I am appalled at the extent to which you have strayed from the path of our noble father.
4. Now, contrary to our father's wishes and your undertaking, you have sought to terminate the MoU unilaterally. Legally your letter is contrary to the MoU and has no sanctity, but what saddens me is the spirit behind your letter. It undermines every ideal of our late father. You have done what our father would never have imagined - filed cases against his dear wife (our mother) and daughter (myself) to deprive his family of their legitimate share of properties.

గతనెల 12న జగన్‌కు షర్మిల రాసిన లేఖ. దీనిపై విజయలక్ష్మి సంతకం కూడా చూడొచ్చు.

బుల్డోజ్ చేసుకుంటూ పోయావ్..

'2019లో కుదిరిన ఎంవోయూలో పేర్కొన్నట్లుగా 'ప్రేమాభిమానాలతో' నాకు కొద్దిపాటి ఆస్తులు బదిలీ చేశారు. తద్వారా మన తండ్రి ఆదేశాలను పాక్షికంగా మాత్రమే అమలు చేసినట్లు! పాక్షికం అని ఎందుకు చెబుతున్నానంటే.. భారతి సిమెంట్స్, సాక్షిలో మెజారిటీ వాటాలు నువ్వే ఉంచుకుంటానని ఒత్తిడి తెచ్చావ్.. నీదే పైచేయి కావడంతో అన్నీ బుల్డోజ్ చేసుకుంటూ పోయావ్.. అయినా ఎంవోయూలో ఉన్న ప్రకారం సెటిల్మెంట్‌కు అంగీకరించాం. నువ్వు నా అన్నవు కాబట్టి.. కుటుంబ వివాదాలను పరిష్కరించుకునే ఉద్దేశంతో సమాన వాటాను వదులుకునేందుకు నేను సమ్మతించాను. ఆ ప్రకారం 2019 ఆగస్టు 31న ఎంవోయూ అమలు చేశారు. కానీ కొద్ది ఆస్తులు మాత్రమే నాకు వచ్చాయి. ఇప్పుడు నీ సొంత తల్లిపైన కేసులు వేసి.. నీ చెల్లెలు, ఆమె పిల్లలకు చట్టబద్ధంగా రావలసిన ఆస్తులను రాకుండా చేయాలని చూస్తున్నావ్. నాన్న చూపిన దారిని తప్పి నువ్వు వ్యవహరించడం నాకు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. నాన్న ఆకాంక్షలు, నీవిచ్చిన హామీకి విరుద్ధంగా సదరు ఎంవోయూను ఏకపక్షంగా రద్దుచేయాలని కోరావు. నీవు నాకు రాసిన లేఖ చట్టబద్ధంగా ఎంవోయూకు వ్యతిరేకం. అందులో పవిత్రత లేదు. ఆ లేఖ వెనుక ఉద్దేశమే నాకు విచారం కలిగిస్తోంది. మన తండ్రి ప్రతి ఆదర్శాన్నీ పక్కనపెట్టావ్. ఆయనెంతో ప్రేమించే భార్య, మన అమ్మపై కేసులు పెట్టడం.. నాకు, నా కుటుంబానికి చట్టబద్ధంగా రావలసిన ఆస్తులను లాక్కోవాలనుకోవడం.. నాన్న ఎన్నడూ ఊహించి ఉండరు.'


నా వాటాగా సరస్వతి పవర్..

'ఎంవోయూ ప్రకారం నా వాటాగా వచ్చిన సరస్వతి పవర్‌కు సంబంధించిన షేర్లన్నీ దానిపై సంతకం చేసిన వెంటనే నాకు బదిలీచేస్తానని మాటిచ్చావు. కానీ ఏళ్ల తరబడి దానిని నిలబెట్టుకోలేదు. సరస్వతి పవర్ షేర్లపై అమ్మకు పూర్తి హక్కులు ఇస్తూ గిఫ్ట్ డీడ్స్‌ను అమలు చేశావు. ఇప్పుడు దానిపై ఫిర్యాదులు చేయడం.. ఏడవడం సరికాదు. షేర్లు వదులుకోవడానికి అంగీకరించి.. ఇప్పుడు అనవసరమైన వివాదాలు రేపుతున్నావు. సరస్వతి పవర్‌లో చట్టబద్ధమైన వాటా కలిగి ఉన్న నాకు అది లేకుండా చేయడానికే ఇలా చేస్తున్నావు. 2019నాటి ఎంవోయూ విషయానికొస్తే.. అది కొనసాగుతోంది.. దానికి కట్టుబడి ఉండాల్సిందే. దాని నుంచి నువ్వు ఏకపక్షంగా బయటకు వస్తానంటే.. దానికి చట్టబద్ధంగా ప్రాధాన్యం లేదు. ఎంవోయూలో ప్రస్తావించిన ఆస్తులకు సంబంధించి అందులో పేర్కొన్న ప్రతి మాటకూ నువ్వు కట్టుబడి ఉండాల్సిందే. ఎంవోయూలో ప్రస్తావించకపోయినా.. వీటిలో 20 ఎకరాల యలహంక హోం ప్రాపర్టీ కూడా ఉంది. అందులో కూడా నాకు వాటా ఉందని అమ్మ సాక్షిగా మౌఖికంగా అంగీకారం కుదిరింది.'

నన్ను నిర్దేశించలేవు..

'నా రాజకీయ కెరీర్ నా ఇష్టం. పార్టీపరంగా నా ప్రవర్తనను నువ్వు నిర్దేశించలేవు. నీకు, అవినాశ్‌కు వ్యతిరేకంగా బహిరంగ వేదికలపై మాట్లాడనంటూ ఓ క్లాజుపై సంతకం చేశానని.. దానికి కట్టుబడాల్సిందేనని నువ్వనడం హాస్యాస్పదం. ఇలాంటి ఆంక్షపెట్టడం నిర్హేతుకం. నా పిల్లలు నీకు రక్తసంబంధీకులు. ఇష్టపూర్వకంగా నువ్వు సంతకం చేసిన ఎంవోయూను వారికోసం అమలు చేయడం నా అన్నగా నీ బాధ్యత. నైతికంగా పతనమైన నువ్వు.. ఇప్పటికైనా నాన్న ఆకాంక్షలను నెరవేరుస్తావని.. ఎంవోయూకు కట్టుబడి ఉంటావని ఆశిస్తున్నాను.. ప్రార్థిస్తున్నాను. లేదంటే చట్టబద్ధమైన పరిష్కారాలు అన్వేషించే హక్కులు నాకు పూర్తిగా ఉన్నాయి. ఈ వాస్తవాలను ధ్రువీకరించేందుకు, గత, వర్తమాన సంఘటనలకు సాక్షిగా ఉన్న మన అమ్మ కూడా దీనిపై సంతకం చేశారు' అని షర్మిల తెలిపారు.





ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ఏఆర్ అనురాధ

» రిటైర్డ్ ఐపీఎస్ అధికారికి కీలక పదవి



అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్(ఏపీపీఎస్సీ) చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అర్కాట్ రాజారత్నం (ఏఆర్) అనురాధ నియమితులయ్యారు. ఆమె నియామకానికి గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైె ఐపీఎస్ అధికారి గౌతం సవాంగ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పదవికి రాజీనామా చేశారు. దీంతో తాజాగా చైర్‌పర్సన్‌ను నియమించారు. ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం చైర్మన్ లేదా చైర్‌పర్సన్ గరిష్ఠ వయో పరిమితి 62 సంవత్సరాలు. దీంతో ఏఆర్ అనురాధ సుమారు ఏడాది కాలం ఈ పదవిలో కొనసాగే అవకాశం ఉంది. కాగా, తమిళనాడుకు చెందిన అనురాధ 1987లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఏపీ కేడర్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఉమ్మడి ఏపీలో విభజన, సమైక్య ఉద్యమాలతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పుడు అప్పటి హోం శాఖ.. అనురాధకు సమన్వయ బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ కేడర్‌కు వచ్చిన ఆమె నిఘా విభాగం తొలి మహిళా అధిపతిగా నియమితులయ్యారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి గత ఏడాది అక్టోబరులో అనురాధ పదవీ విరమణ చేశారు. అనురాధ భర్త నిమ్మగడ్డ సురేంద్ర బాబు కూడా ఐపీఎస్ అధికారే. ఆయన కూడా ఏపీ కేడర్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు.

గాడిన పెట్టాలి!

గత వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించింది. గ్రూప్-1 పరీక్షలు, భర్తీ విధానాన్ని అక్రమాలకు వేదికగా మార్చింది. పదే పదే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి గందరగోళం సృష్టించింది. ఈ అక్రమాలను అభ్యర్థులు ఆధారాలతో నిరూపించడంతో ఏపీపీఎస్సీ పరువు పోయింది. ప్రభుత్వం మారడంతో వీటిపై విచారణ చేస్తారని భావించిన అప్పటి చైర్మన్ గౌతంసవాంగ్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఉద్యోగార్థులు ఎన్నో ఆశలు పెట్టుకున్న ఏపీపీఎస్సీని గాడిలో పెట్టాల్సిన బాధ్యత అనురాధపైనే ఉంది.

శారదా పీఠానికి భూకేటాయింపులు రద్దు

» సంబంధిత జీవోల రద్దుకు కేబినెట్ ఆమోదం

» మహిళలకు 3 ఉచిత సిలిండర్లకూ పచ్చజెండా

» ఇసుకపై సీనరేజీ తదితర పన్నుల రద్దు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విశాఖ శారదాపీఠానికి గత ప్రభుత్వం జరిపిన భూకేటాయింపులను రద్దుచేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. సంబంధిత జీవోలను రద్దుచేయాలని తీర్మానించింది. అలాగే మహిళలకు దీపావళి కానుక ప్రకటించింది. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఈ నెల 31 నుంచి అమలు చేసేందుకు ఆమోదముద్ర వేసింది. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఉచిత ఇసుకలో సీనరేజ్ తదితర పన్నుల రద్దు, ఆలయ పాలకమండళ్లలో సభ్యుల సంఖ్య పెంపు, బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణుల నియామకం, శారదాపీఠానికి భూకేటాయింపులు రద్దు తదితర నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర వెల్లడించారు. దీపావళి(31వ తేదీ) నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు కానుండగా.. దీనికి 3-4 రోజుల ముందే బుకింగ్ ప్రారంభించనున్నట్లు మనోహర్ తెలిపారు. సిలిండర్ ధరను డెలివరీ సమయంలో లబ్ధిదారులే చెల్లించాల్సి ఉంటుందని.. డెలివరీ అయిన 48 గంటల్లో ఆ డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. 31 నుంచి మార్చి నెలాఖరులోపు ఒక దఫా సిలిండర్ పొందవచ్చన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి 4 నెలలకు ఒక సిలిండర్ చొప్పున.. ఏప్రిల్ 1 నుంచి జూలై నెలాఖరు వరకు మొదటిది, ఆగస్టు 1 నుంచి నవంబరు నెలాఖరు వరకు రెండోది, డిసెంబరు 1 నుంచి మార్చి నెలాఖరు వరకు మూడో సిలిండర్ పొందేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక విడతలో సిలిండర్‌పై రాయితీ కింద ప్రభుత్వంపై రూ.894.92 కోట్లు, మూడు విడతల్లో ఏడాదికి రూ.2,684 కోట్లు భారం పడుతుందన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. కార్డుల డిజైన్లు ఖరారు చేసిన వెంటనే మంజూరు చేస్తామన్నారు. శారదాపీఠానికి తిరుమలలో గత ప్రభుత్వం 9 వేల చదరపు అడుగులు కేటాయించగా.. పీఠం ఏకంగా 25 వేల చ.అడుగుల్లో నిర్మాణాలు చేసి అద్దెలకు ఇచ్చుకుంటోందని పార్థసారథి తెలిపారు. ఇసుక పూర్తిగా ఉచితంగా అందించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందని రవీంద్ర చెప్పారు. గత ప్రభుత్వంలో మెట్రిక్ టన్నుకు రూ.475 చొప్పున లెక్కాపత్రం లేకుండా ఇసుక విక్రయించారని.. కూటమి ప్రభుత్వం దీనికి స్వస్తి పలికిందన్నారు. ఎవరైనా సొంత వాహనం తెచ్చుకుని నదిలో ఇసుకను తీసుకెళ్లొచ్చని.. అయితే వెబ్‌సైట్ లో గ్రామ/వార్డు సచివాలయంలో సమాచారం కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, పార్థసారథి, అనిత, కొల్లు రవీంద్ర

కేబినెట్ కీలక నిర్ణయాలివీ..

- విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని శారదాపీఠానికి సర్వే నంబర్లు 102, 102/2, 103ల్లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేస్తూ జారీ చేసిన జీవోలు 343, 64, 47ల రద్దు.
- ఇసుకపై సీనరేజ్ ఫీజు, డీఎంఎఫ్, ఎంఈఆర్‌ఐటీ మినహాయిస్తూ ఉచిత ఇసుక విధానం-2024లో సవరణలు. గ్రామ పంచాయతీల పరిధిలో సొంత అవసరాలకు ట్రాక్టర్లతో ఇసుక తరలింపునకు అనుమతి. పట్టాభూములతోపాటు, డీకేజీ పట్టా భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతి.
- జీవోలను అప్‌లోడ్ చేసేందుకు జీవోఐఆర్ వెబ్‌పోర్టల్ పునరుద్ధరణకు ఆమోదం.
- రివర్స్ టెండరింగ్ రద్దు.. కేంద్రం సహా అన్ని రాష్ట్రాలు టెండర్ల విధానంలో కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) గైడ్ లైన్స్‌నే అనుసరిస్తున్నాయి. ఏపీలోనూ వీటినే పాటించాలని నిర్ణయం.
- రూ.వంద కోట్లు దాటిన టెండర్లను పరిశీలించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన జ్యుడీషియల్ ప్రివ్యూ కూడా రద్దు.
- దేవాలయ ట్రస్టు బోర్డుల్లో మరో ఇద్దరు సభ్యుల పెంపు. బ్రాహ్మణ సంఘం నుంచి ఒకరిని, నాయీ బ్రాహ్మణ సంఘం నుంచి ఇంకొకరిని ఎంపిక చేస్తూ రూపొందించిన బిల్లుకు ఆమోదం.
- రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికిగాను వరి సేకరణ కోసం మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,800 కోట్ల మేర రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారెంటీ. అలాగే విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర సహకార బ్యాంకు నుంచి ఇప్పటికే పొందిన రూ.80 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ కొనసాగింపు.
- చెవిటి, మూగ, కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష నిర్మూలన ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- విశాఖలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 27 టీచింగ్ పోస్టులు, 56 నాన్ టీచింగ్ పోస్టుల మంజూరు. పదోన్నతులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ.
- 50 పడకల మంగళగిరి ఏరియా ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి రూ.52.22 కోట్ల అంచనా వ్యయానికి ఆమోదం. 73 అదనపు పోస్టుల మంజూరు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసి నిందలా: అనిత

ఐదేళ్లు వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వారే నిందలు వేయడం హాస్యాస్పదమని హోం మంత్రి అనిత అన్నారు. డాక్టర్ సుధాకర్, ఓం ప్రతాప్, వరప్రసాద్‌లను వేధించినప్పుడు దళితులు గుర్తుకు రాలేదా అని మాజీ సీఎం జగన్‌ను ఆమె నిలదీశారు. విజయవాడ నడిబొడ్డున దళిత వికలాంగ మహిళపై ముగ్గురు మూర్ఖులు పాటు అత్యాచారం జరిగినప్పుడు.. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు పరామర్శకు వెళ్తే వాసిరెడ్డి పద్మతో కేసు పెట్టించలేదా? గతం మీరు మరచిపోయినా మేం మరచిపోం. ఆస్తి తగాదాలతో తల్లి, చెల్లిపై కోర్టుకెళ్లడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం' అని మండిపడ్డారు. కాగా, ఇసుకను అక్రమంగా తవ్వినా.. అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు ప్రయోగిస్తామని గనుల మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

నాతో పోటీ పడండి!

మంత్రులు చురుగ్గా పనిచేయాలి: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 'మంత్రులందరూ నాతో పోటీ పడాలి.. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఇన్‌చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు తక్షణమే స్పందించాలి. ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా మంత్రులు ప్రచారం చేసుకోలేకపోతున్నారు' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంత్రివర్గ సమావేశంలో పలు సూచనలు చేశారు. ఉచిత ఇసుక విధానం ప్రకటించి 15 రోజులవుతున్నా.. ప్రజలకు ఆ విషయాలను సరిగా చెప్పలేకపోతున్నారని ఆక్షేపించినట్లు తెలిసింది. ఈ విధానం సక్రమంగా అమలయ్యే బాధ్యతను జిల్లా, ఇన్‌చార్జి మంత్రులు తీసుకోవాలన్నారు. పెన్షన్లు ఇచ్చామని, అన్న క్యాంటీన్లు అమల్లోకి తెచ్చామని, రైతులకు కల్పించిన ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విజయనగరం జిల్లాలో డయేరియాలాంటి సంఘటనలపై స్థానికంగా ఉన్న మంత్రులు వెంటనే స్పందించి ఉండాల్సిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తోందని.. రూ.100 కోట్లతో పలు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తోందని, ఈ విషయాలపై కూడా ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు.

బోగస్ పెన్షన్లపై ఉపసంఘానికి నో

బోగస్ పెన్షన్ల రద్దు, పెన్షన్ మంజూరు విధి విధానాలపై 8 మంది మంత్రులతో ఉపసంఘం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేబినెట్ తిరస్కరించింది. పెన్షన్లు రద్దు చేసేందుకు ప్రస్తుతమున్న ఆరంచెల విధానాన్ని కూడా ఎత్తివేయాలని తీర్మానించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన అర్హతల ఆధారంగా పెన్షన్లు మంజూరుచేయాలని, తప్పుడు విధానంలో అనర్హులెవరైనా పెన్షన్లు పొందినట్లు ఫిర్యాదులొస్తే గ్రామసభలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసినట్లు సమాచారం.

రాష్ట్రావతరణ వేడుక ఎప్పుడు?

రాష్ట్రావతరణ దినోత్సవం ఎప్పుడు జరపాలనే అంశంపై కేబినెట్ భేటీలో కీలక చర్చ జరిగింది. పొట్టి శ్రీరాములు 1952 డిసెంబరు 15న ఆత్మార్పణ చేశారని, 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైతే.. ఉమ్మడి ఏపీ నవంబరు 1న ఆవిర్భవించిందని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ నుంచి ఏపీ జూన్ 2న విడిపోయిన తేదీపైనా చర్చ జరిగింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణను తెలుగుజాతి గుర్తించాలని సీఎం పేర్కొన్నారు. జూన్ 2న ఏర్పడిన నవ్యాంధ్రను ఎలా గుర్తించాలనే అంశంపైనా చర్చ జరిగింది. గత టీడీపీ హయాంలో జూన్ 2 నుంచి వారం రోజుల పాటు నవ నిర్మాణ దీక్షలు చేపట్టామని మంత్రులు ప్రస్తావించారు. ఉచిత ఇసుక అమలుపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అక్రమాలకు పాల్పడిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

నవంబరు మొదటి వారంలో మెగా డీఎస్సీ

» 16,347 పోస్టులతో నోటిఫికేషన్ జారీకి సిద్ధం

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను నవంబరు మొదటి వారంలో జారీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. 3న నోటిఫికేషన్ ఇవ్వాలనుకున్నా ఆ రోజు ఆదివారం కావడంతో మరో తేదీని పరిశీలిస్తున్నారు. 16,347 పోస్టులతో ఈ నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు. నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే న్యాయ వివాదాలు లేవనెత్తి భర్తీని అడ్డుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తుందనే సమాచారం ప్రభుత్వానికి అందింది. అందువల్ల న్యాయ వివాదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు, నాలుగు నెలల్లో భర్తీ ప్రక్రియ ముగించి, ఆ వెంటనే ఎంపికైన వారికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. మెగా డీఎస్సీ పూర్తయితే రాష్ట్రంలోని 12 సింగిల్ టీచర్ స్కూళ్లకు అదనంగా ఉపాధ్యాయులు వస్తారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది.

పాఠశాలల అభివృద్ధికి 6,762 కోట్లు ఇవ్వండి

» కేంద్రానికి మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.6,762 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని మంత్రి లోకేశ్ కోరారు. ఇటీవలి ఢిల్లీ పర్యటనలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కలిసి పలు వినతిపత్రాలు అందజేశారు. రాజధాని అమరావతిలో అత్యాధునిక వసతులతో నిర్మించతలపెట్టిన సెంట్రల్ లైబ్రరీకి రూ.100 కోట్లు ఇవ్వాలని కోరారు.

రేపటి నుంచి అమెరికా పర్యటనకు లోకేశ్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. ఈ నెల 25 నుంచి వారం రోజులపాటు ఆయన అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. 29న లాస్ వేగాస్‌లో ఐటీ సర్వ్ అలయెన్స్ సంస్థ నిర్వహించే వార్షిక సమావేశానికి లోకేశ్ విశిష్ట అతిథిగా హాజరవుతారు. 25, 26 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్, పత్ర సినర్జీస్, బోసన్, స్పాన్ ఐవో, క్లారిటీ, ఎడోబ్, స్కేలర్, జనరల్ అటమిక్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశవుతారు. 27న ఆస్టిన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో, 28న మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో సమావేశమవుతారు. 29న ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం అమెజాన్, రేవాచర్, సేల్స్ ఫోర్స్, పెప్సికో ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. 30న శాన్‌ఫ్రాన్సిస్కోలో గూగుల్ క్యాంపస్‌ను సందర్శిస్తారు. 31న జార్జియా కమ్మింగ్స్‌లోని శానిమౌంట్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 1న న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో చర్చలు జరుపుతారు.

కొరియన్ ఎగ్జిమ్ బ్యాంకు ప్రతినిధులతో లోకేశ్ భేటీ

దక్షిణ కొరియాకు చెందిన సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. చెన్నైలోని కొరియా కాన్సులేట్ జనరల్ కిమ్ చాంగ్ యున్‌తోపాటు కొరియన్ ఎగ్జిమ్ బ్యాంక్ ఈడీసీఎఫ్ ఆపరేషన్స్ డిపార్ట్‌మెంట్-2 డైరెక్టర్ జనరల్ కెవిన్ చోయ్, ఎన్డీఆర్వో ముఖ్య ప్రతినిధి జంగ్ వాన్ రియూ, కొరియా ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ డైరెక్టర్ చాంగ్ వూ చాన్ బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.



తనను కలిసిన కొరియన్ ఎక్సిమ్ బ్యాంక్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్

అడ్డగోలుగా దోచిపెట్టారు

విశాఖ శారదా పీఠానికి భూ కేటాయింపులో అన్నీ ఉల్లంఘనలే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖ శారదా పీఠం సాములోరి సేవలో మాజీ సీఎం జగన్ తరించిపోయారు. భూ కేటాయింపు విధానం, నియమ నిబంధనలను ఉల్లంఘించి మరీ రూ.225 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కారుచౌకగా కేవలం రూ.15లక్షలకే స్వరూపానందకు కట్టబెట్టారు. ప్రజాప్రయోజనాల కోసమే కేటాయించాల్సిన భూమిని పక్తు సాములోరి వ్యక్తిగత ఆదాయార్జనకు అప్పగించారు. నాటి సీఎం బాటలోనే రెవెన్యూ అధికారులు కూడా సాములోరికి జైకొట్టారు. నాటి పాపాలన్నీ ఇప్పుడు బయటపడ్డాయి. శారదాపీఠం భూకేటాయింపు, ఇచ్చిన అనుమతులు, వెసులుబాట్లు అన్నీ అక్రమమే అని కూటమి సర్కారు తేల్చింది. భీమిలి మండలం కొత్తవలసలో శారదా పీఠానికి 15 ఎకరాల కేటాయింపులో ఉల్లంఘనలు జరిగాయని తేలుస్తూ రద్దు చేసింది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన ప్రతిపాదనపై కూలంకశంగా చర్చించి భూ కేటాయింపు ఉత్తర్వుతో పాటు ఇతర అనుబంధ జీఓలను కూడా రద్దు చేశారు. భూ కేటాయింపు రద్దు చేయడానికి 10కి పైగా కారణాలను ప్రస్తావించినట్లు తెలిసింది. శారదా పీఠానికి భూమి కేటాయింపునకు ముందు, ఆ తర్వాత ఎన్నో అడ్డగోలు పనులు చేశారు.

కలెక్టర్ ప్రతిపాదన బుట్టదాఖలు

2021లో శారదా పీఠానికి భూమి కావాలన్న వినతిని ఆంధ్రప్రదేశ్ భూమి నిర్వహణా వ్యవస్థ (ఏపీఎల్ఎమ్ఏ) ముందుకు దేవాదాయ శాఖ తీసుకొచ్చింది. పీఠం పరిధిలో సంస్కృత పాఠశాల ఏర్పాటుకు భూమి కావాలని కోరారు. ఈ వినతిపై రెవెన్యూ శాఖ నాటి విశాఖ కలెక్టర్‌ను నివేదిక కోరింది. శారదా పీఠం భూమి కోరిన భీమిలి మండలం కొత్తవలస సముద్ర ప్రాంతానికి అతి సమీపంలో ఉంది. అక్కడ బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.15 కోట్లు. రిజిస్ట్రేషన్ విలువ దాదాపు 1.89 కోట్లు. దీని ప్రకారం శారదా పీఠానికి ఎకరా 1.89 కోట్ల చొప్పున భూమి కేటాయించాలని నాటి కలెక్టర్ రెవెన్యూ శాఖకు నివేదించారు. అంటే.. 15 ఎకరాల భూమిని రూ.28.35 కోట్లకు ఇవ్వొచ్చని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన సీసీఎల్ఏ నేతృత్వంలోని ఏపీఎల్ఎమ్‌కు వచ్చింది. అయితే ఎకరా లక్ష చొప్పున 15 ఎకరాల భూమిని 15 లక్షలకే ఇవ్వాలని తీర్మానించారు. ఈ మేరకు మంత్రి వర్గానికి ఫైలు పంపించి ఆమోదం తీసుకున్నారు. 2021 నవంబరు 29న అప్పటి రెవెన్యూ కార్యదర్శి జీఓ 343 జారీ చేశారు. భూ కేటాయింపు కచ్చితంగా ప్రజాప్రయోజనంతో ముడిపడినదై, శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా ఉండాలని జీఓ571లోని 3(ఏ) చెబుతోంది. అయితే భూ కేటాయింపు ఉత్తర్వు 343లో ప్రజాప్రయోజనం అన్న పదమే చేర్చలేదు.

సర్వే నంబర్లు వేరు

జీఓ 343లో కేటాయించిన సర్వే నంబర్లలోని భూమి కాకుండా మరో సర్వే నంబర్లలోని భూమిని పీఠానికి ఇచ్చారు. ఈ మేరకు నాటి రెవెన్యూ కార్యదర్శి 2022 ఫిబ్రవరి 8న జీఓ 64ను గుట్టుగా ఇచ్చారు. పైగా మొదట జారీ చేసిన జీఓను శారదా పీఠం పేరిట ఇస్తే, ఆ తర్వాత 64 జీఓను శారదా పీఠం ఉత్తరాధికారి పేరిట ఇచ్చారు. ఓ ప్రైవేటు వ్యక్తికి భూమి కేటాయిస్తున్నట్లుగా జీఓ ఇచ్చారు. ఇది పక్తు ప్రైవేటు కేటాయింపుగానే చూడాలి.

ఆదాయార్జనకు అనుమతి

గత ఏడాది నవంబరులో పీఠం నుంచి సర్కారుకు మరో లేఖ వచ్చింది. తమకు కేటాయించిన భూమిని ఆదాయార్జనకు కూడా వినియోగించుకునేలా అనుమతి ఇవ్వాలన్నది ఆ లేఖ సారాంశం. అందులోనే బోర్డింగ్ హౌజ్, ఆశ్రమం, ఇతర నిర్మాణాలు చేపట్టుకుంటామని అనుమతి కోరారు. దీనిపై ఈ ఏడాది జనవరి 19న విశాఖ కలెక్టర్‌తో ప్రతిపాదన తెప్పించుకొని 20వ తేదీన ఏపీఎల్ఎమ్ఏలో ఆమోదించారు. ఫిబ్రవరి 6వ తేదీన జీఓ 47 జారీ చేశారు.

అంతా అడ్డగోలే

- శారదాపీఠం ట్రస్టీగా ఓ వ్యక్తి పేరిట భూమి కోరుతూ దరఖాస్తు వచ్చింది. కానీ ఆ వ్యక్తి పీఠంలో ట్రస్టు బోర్డు సభ్యుడు కారు.
- భూ కేటాయింపులో ప్రజాప్రయోజనం అన్న పదం లేదు కాబట్టి, ఆ భూమిని ఆదాయార్జనకు వినియోగించుకోవచ్చని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తర్వు ఇప్పించారు.
- ఆదాయార్జనకు అనుమతి ఇవ్వడం, ఉత్తరాధికారి పేరిట భూములు కేటాయించడం అనేది ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానంలోని సెక్షన్ 3(ఏ)కు పూర్తి విరుద్ధమైనది.
- ప్రజాప్రయోజనమే లేని ఈ కేటాయింపులో కలెక్టర్ సిఫారసును బుట్టదాఖలు చేయడం అన్యాయమైనదిగా, అక్రమమైనదిగా పరిగణిస్తున్నారు.
- బోర్డింగ్ హౌజ్ పేరు చెప్పి రిసార్ట్ కట్టాలన్నదే పీఠం ఆలోచనఅని రెవెన్యూ శాఖ సందేహించింది
- పీఠానికి ఇచ్చిన భూమి శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా లేదని, ఆ భూ కేటాయింపును రద్దు చేయాలని రెవెన్యూశాఖ కోరగా, కేబినెట్ ఆమోదించింది.

అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

శారదా పీఠానికి భూ కేటాయింపుల్లో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ... సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములు తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించేందుకు జరిగిన అక్రమాలన్నీ గుర్తించామని, అందుకే రద్దు చేశామన్నారు. ఎర్రమట్టి దిబ్బలను గత పాలకులు కొల్లగొట్టారని, అన్ని అక్రమాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నేహారెడ్డిపై ఏం చర్యలు తీసుకున్నారు?

» నివేదికను కోర్టు ముందు ఉంచండి

» గ్రేటర్ విశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జడ్) నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఇతర బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారని హైకోర్టు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులను ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా అని ఆరా తీసింది. వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. భీమిలి బీచ్‌లో సీఆర్‌జడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎస్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. సముద్రానికి అతిసమీపంలో జరుపుతున్న శాశ్వత నిర్మాణాలను తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా.. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. కేవలం ప్రహరీ మాత్రమే కూల్చివేశారని, ఇతర నిర్మాణాల జోలికి వెళ్లలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిని పర్యావరణ చట్టం కింద శిక్షించవచ్చన్నారు. జీవీఎంసీ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సీఆర్‌జడ్ ప్రాంతంలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చివేశామన్నారు. అధికారులు సర్వే చేస్తున్నారని.. వారిచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.





వైసీపీకి వాసిరెడ్డి పద్మ గుడ్ బై

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీలో మరో వికెట్ పడింది. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు, పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు ఆయన మోసం చేశారని అన్నారు. పేద ప్రజల సంక్షేమం పేరిట జగన్ లూటీ చేశారని, మద్యం పేరుతో భారీగా దోపిడీ చేశారని ఆరోపించారు. ప్రజాతీర్పు వెలువడ్డాక కూడా ఆయనలో మార్పు రాలేదని, ఆత్మవిమర్శ చేసుకోలేదన్నారు. గుడ్‌బుక్ పేరిట పార్టీ నేతలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తననూ మోసం చేశారని, మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో రాష్ట్రానికి, పేదలకు అన్యాయం జరిగిందన్నారు. సామాన్యులపై అధిక ధరల భారం వేశారని, ప్రతి సందర్భంలో ప్రజలను మోసం చేశారన్నారు. మహిళల విషయంలో జగన్ పాలనలో రోజుకో వికృత సంఘటన జరిగిందన్నారు. ఆ రోజు బాధితుల ఇళ్లకు వెళ్లి ఆయన ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల భద్రత కోసం జగన్ ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసుల పనితీరు బాగుందన్నారు. ప్రజాతీర్పు తర్వాత కూడా అన్యాయాన్ని భరించాల్సిన పరిస్థితి తనకు లేదన్నారు.

జగన్ మీ హయాంలో ఘటనలపై పరామర్శించలేదేం?: పీతల

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వేలాది హత్యలు, అత్యాచారాలు, అఘాయిత్యాలు జరిగితే జగన్ ఒక్క రోజైనా సమీక్ష చేశారా? ఒక్క కుటుంబాన్నైనా ఆదుకున్నారా? ఒక్కరినైనా పరామర్శించారా? అని మాజీ మంత్రి పీతల సుజాత నిలదీశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నా అక్కచెల్లెమ్మలంటూ మహిళలపై జగన్ కపట ప్రేమ ఒలకబోశారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలన ఆడబిడ్డల పాలిట శాపంగా మారిందని, జగన్ పాలనలో ఏపీ అత్యాచారాలకు కేరాఫ్ అడ్రస్ అయ్యిందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఆడబిడ్డలపై అఘాయిత్యం జరిగితే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.